



డిక్లరేషన్ పత్రాలతో సంతనూతలపాడు-2 అధ్యక్షుడు కంకణాల వేణు, ఉపాధ్యక్షుడు దామచర్ల శ్రీను

# డీసీ ఎన్నికలు ఏకగ్రీవం

- పదిచోట్లా టీడీపీ మద్దతుదారులు గెలుపు
- ప్రశాంతంగా ముగిసిన ప్రక్రియ

ఒంగోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)ల ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. మేజర్ ఇరిగేషన్ వనరుగా ఉన్న ఎన్నెస్పీ కాలువల పరిధిలో మొత్తం పది డీసీలు ఉన్నాయి. పదిచోట్ల మంగళవారం ఇరిగేషన్ అధికారులు ఎన్నికలు నిర్వహించగా అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా గెలుపొందారు. ఎన్నెస్పీ పరిధిలో జిల్లాలో మొత్తం 88 సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏలు) ఉండగా ఈనెల 14న జరిగిన ఎన్నికల్లో ఒకటి మినహా మిగిలిన అన్నిచోట్లా ఆ సంఘాల అధ్యక్షుల ఎన్నిక జరిగింది. కాగా మేజర్ ఇరిగేషన్‌లో రెండో స్థాయిలో ఉండే డీసీలకు ఆ పరిధిలో ఉన్న డబ్ల్యూయూఏల నుంచి గెలుపొందిన అధ్యక్షులు తమలో ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. ఒక్కో డీసీ పరిధిలో 6 నుంచి 12 వరకు డబ్ల్యూయూఏలు ఉండగా మంగళవారం ఆయా ప్రాంతాల్లో ఇరిగేషన్ అధికారులు ఈ ఎన్నికలు నిర్వహించారు. వైసీపీ మద్దతుదారులు డబ్ల్యూయూఏల స్థాయిలోనే ఎన్నికకు పోటీపడకుండా చేతులెత్తేశారు. దీంతో అక్కడే అంతా టీడీపీ మద్దతుదారులు, అక్కడక్కడా టీడీపీ మద్దతుతో జనసేన ప్రతినిధులు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో డీసీ అధ్యక్షులంతా టీడీపీ మద్దతుదారులే ఏకగ్రీవమయ్యారు. ఉదయం 9 గంటలకు ప్రక్రియ ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటలకల్లా అధికారులు పూర్తిచేసి గెలుపొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నికలలో ప్రస్తుతం గెలుపొందిన డీసీ అధ్యక్షులు ఓటుహక్కు కలిగి ఉన్నారు.

**జిల్లాలోని పది డీసీల అధ్యక్షులు వీరే..**

| డీసీ పేరు | గెలుపొందిన అధ్యక్షుడు |
|---|---|
| త్రిపురాంతకం | దేవినేని చలమయ్య |
| కురిచేడు | ఉన్నగిరి కోటేశ్వరరావు |
| దర్శి-1 | సందాడి సుబ్బారావు |
| దర్శి-2 | కె.వెలుగొండారెడ్డి |
| ముండ్లమూరు | కంచుమాటి శ్రీనివాసరావు |
| చీమకుర్తి-1 | పీవీ నారాయణ |
| చీమకుర్తి-2 | దొడ్డా వెంకట్రావు |
| సంతనూతలపాడు-1 | రామా శ్రీనివాసరావు |
| సంతనూతలపాడు-2 | కంకణాల వేణు |
| ఒంగోలు | నల్లూరి కృష్ణారావు |

డ్వామాలో పూర్వపు పీడీ శీనారెడ్డి రగడ కొనసాగుతూనే ఉంది. ఆయన ఆ సంస్థ పీడీగా పనిచేసిన కాలంలో అడ్డగోలుగా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రస్తుత విచారణ సమయంలోనూ అలాగే వ్యవహరిస్తున్నారు. తాజాగా డ్వామా కార్యాలయానికి వెళ్లి కొన్ని ఫైళ్ల నకళ్లను నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్లడం కలకలం రేపింది. అందుకు సహకరించిన కార్యాలయ సిబ్బందిపై ప్రస్తుత పీడీ జోసఫ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. మరోవైపు శీనారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై త్రిసభ్య కమిటీ విచారణ కొనసాగుతోంది. అందులో భాగంగా తమ ఎదుట వ్యక్తిగత విచారణకు హాజరుకావాలని అధికారులు రెండోసారి ఆయనకు నోటీసు ఇచ్చారు.





డ్వామా కార్యాలయం (ఇన్‌సెట్‌లో) శీనారెడ్డి

# డ్వామాలో శీనారెడ్డి రగడ

- నిబంధనలకు విరుద్ధంగా పలు ఫైళ్ల నకళ్లను తీసుకెళ్లిన వైనం
- సహకరించిన కార్యాలయ సిబ్బందిపై పీడీ జోసఫ్‌కుమార్ ఆగ్రహం
- పలువురికి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధం
- కొనసాగుతున్న త్రిసభ్య కమిటీ విచారణ
- వ్యక్తిగతంగా హాజరు కావాలని పూర్వ పీడీకి నోటీసులు

ఒంగోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగున్నరేళ్లపాటు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీగా పనిచేసిన శీనారెడ్డి ఆ సమయంలో ఇష్టారీతిగా వ్యవహరించారు. బదిలీలు, నియామకాలు, పనుల మంజూరు, సోషల్ ఆడిట్, చివరకు వాహనాల బిల్లులలో సైతం చేతివాటం చూపి భారీగా స్వాహా చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. అందుకు సంబంధించి ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుతో తొలుత విజిలెన్స్ విచారణ, తర్వాత ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ నియమించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ విచారణ కొనసాగుతోంది. విచారణ కమిటీకి సారథ్యం వహిస్తున్న లోకేశ్వరరావు కొంత లోతుగానే పరిశీలన చేపట్టగా ఇప్పటికే కొన్ని అంశాలలో అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు కమిటీ గుర్తించింది. ఈక్రమంలో ఈనెల 14న వ్యక్తిగత విచారణకు హాజరుకావాలని తొలుత శీనారెడ్డికి త్రిసభ్య కమిటీ నోటీసు ఇచ్చింది. అయితే కొన్ని అంశాలకు సంబంధించిన మెటీరియల్ సేకరించుకోవాల్సి ఉందని, అందుకు వారం గడువు ఇవ్వాలని శీనారెడ్డి సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

### సిబ్బందికి షోకాజ్ నోటీసులు!

విజిలెన్స్, హెచ్‌ఆర్‌తోపాటు మరికొన్ని విభాగాల నుంచి ఫైళ్ల నకళ్లు వెళ్లాయన్న నిర్ధయానికి అధికారులు వచ్చారు. గతంలో అధికారిగా పనిచేశారు కనుక శీనారెడ్డి వచ్చి అడిగితే ఇచ్చామని కొందరు ఉద్యోగులు తెలిపినట్లు సమాచారం. అలా ఇవ్వడం తమ పొరపాటుగా అంగీకరించగా, మరికొందరు తాము ఎలాంటి ఫైళ్లు ఇవ్వలేదని అబద్ధాలు చెప్పినట్లు సమాచారం. మరింత లోతుగా విచారించి సంబంధిత సిబ్బం దికి పీడీ జోసఫ్‌కుమార్ షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు

మిగతా 6వ పేజీలో

### నమ్మకస్థులతో శీనారెడ్డి మంతనాలు

కొన్ని విషయాలలో సమాచారం కోసం ప్రస్తుతం పీడీ జోసఫ్‌కుమార్‌ను శీనారెడ్డి సంప్రదించగా ఏమేమి అవసరమో నిబంధనల ప్రకారం రాతపూర్వకంగా తెలియజేస్తే ఆ మేరకు ఇచ్చేందుకు అభ్యంతరం లేదని ఆయన చెప్పినట్లు తెలిసింది. ఆ ప్రకారం కాకుండా సోమవారం డ్వామా కార్యాలయానికి వచ్చిన శీనారెడ్డి అక్కడ తాను పీడీగా పనిచేసిన కాలంలో తనకు నమ్మకస్థులుగా ఉన్న ఉద్యోగులు కొందరితో మంతనాలు జరిపారు. పలు ఫైళ్లకు సంబంధించిన నకళ్లను తీసుకెళ్లారు. ఈ విషయం డ్వామా ఉద్యోగులలో చర్చనీయాంశమైంది. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌లో బిజీగా ఉన్న ప్రస్తుత పీడీ జోసఫ్‌కుమార్‌కు సాయంత్రానికి విషయం తెలిసి కార్యాలయ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి ఏడు గంటల నుంచి పది గంటల వరకు వివిధ సెక్షన్ల ఇన్‌చార్జిలను తన కార్యాలయంలో విచారణ చేసి ఎవరెవ్వరు ఏయే ఫైళ్లు ఇచ్చారన్న దానిపై సుదీర్ఘ విచారణ చేశారని తెలిసింది.

### ఉద్యోగుల్లో ఆందోళన

ఈ రగడ ఇలా కొనసాగుతుండగా వ్యక్తిగత విచారణకు హాజరు కావాలని శీనారెడ్డికి మంగళవారం విచారణ కమిటీ తరఫున లోకేశ్వరరావు రెండో నోటీసు ఇచ్చారు. వచ్చేనెల 2వతేదీ ఉదయం 10.30 గంటలకు డ్వామా కార్యాలయంలో తమ కమిటీ ఎదుట హాజరై ఆయా ఫిర్యాదులపై రాతపూర్వకమైన వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఈలోపు అన్ని అంశాలపై సమగ్ర విచారణ చేయాలని కమిటీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కలెక్టర్‌కు ఇంకా కూడా శీనారెడ్డిపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారం డ్వామాలో తీవ్ర చర్చనీయాంశమైంది. పీడీగా శీనారెడ్డి ఉన్న కాలంలో సంబంధిత అంశాలలో భాగస్వాములైన ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# ఆనంద నిలయం

పండుటాకులను ఆదరిస్తున్న శింగరకొండ శ్రీరామ వృద్ధాశ్రమం



ఆశ్రమంలోని అన్నదాన మండపంలో భోజనం చేస్తున్న వృద్ధులు

- దాతల సాయంతో 50 ఏళ్లుగా నిర్వహణ
- నిత్య అఖండ సంకీర్తనతో మొదలై ఆశ్రమంగా అభివృద్ధి
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చి సంతృప్తిగా గడుపుతున్న వృద్ధులు

వివరాలు 7వ పేజీలో



అర్జీదారుడి సమస్యను వింటున్న మంత్రి స్వామి, వేదికపై ఆర్డీవో లక్ష్మీప్రసన్న

### ఫ్రీహోల్డ్‌లో భారీగా అక్రమాలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలను బెదిరించి వేలాది ఎకరాల భూములు లాక్కున్నారని మంత్రి స్వామి ఆరోపించారు. ఫ్రీహోల్డ్ భూములను సైతం ఆ పార్టీ నేతలు ఇష్టానుసారం రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలో 18,240 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేయగా అందులో అనేక అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. సర్వే రాళ్ల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మంత్రి మండిపడ్డారు. కరప్షన్‌కు కజిన్ అయిన జగన్‌కు విజన్ గురించి ఏమి తెలుసని ఎద్దేవా చేశారు. దోచుకోవడం, దాచు కోవడమే ఆయన విజన్ అని.. సంపద సృష్టించడం, ప్రజలకు పంచడం చంద్రబాబు విజన్ అని మంత్రి వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామని చెప్పారు. జనవరి మొదటి వారంలో కొండపి, గిద్దలూరు నియోజకవర్గాల్లో జరిగే రెవెన్యూ సదస్సులకు ఆ శాఖ మంత్రి, సీసీఎల్‌ఏ అధికారులు హాజరవుతారని ఈసందర్భంగా స్వామి వెల్లడించారు. అనంతరం అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ శాశ్వత రికార్డుల కౌంటర్, గ్రామ సచివాలయ రికార్డులను పరిశీలించారు.

# వైసీపీ పాపాల ప్రక్షాళన

## భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

- కరప్షన్‌కు కజిన్ జగన్
- ప్రజలను బెదిరించి భూములు లాక్కున్నారు
- బాధితులకు న్యాయం చేస్తాం
- మంత్రి డాక్టర్ బాలవీరాంజనేయ స్వామి

టంగుటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో చేసిన పాపాలను ప్రక్షాళన చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. అందులో భాగంగా తొలుత భూ సమస్యలపై దృష్టి సారించి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. మండలంలోని వల్లూరులో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న వినతుల్లో అత్యధికం భూసమస్యలే ఉంటున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే ప్రక్రియలో పలు రకాల లోపాలు చోటుచేసుకున్నాయని, దీని వలన రైతులకు సరికొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చే భూ సమస్యలకు 45 రోజుల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. ఈనెల 6న ప్రారంభమైన ఈ సదస్సులు వచ్చే నెల 8వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మండల ప్రత్యేకాధికారి లక్ష్మా నాయక్, తహసీల్దార్ ఆంజనేయులు, వివిధ శాఖల అధికారులు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, టీడీపీ స్థానిక నాయకుడు బెజ్జం శ్రీనివాసులు పాల్గొన్నారు.

# మీనమేషాలు

- డీసీసీబీలో అక్రమాలపై ఉన్నత స్థాయిలో ఉదాసీనత
- కలెక్టర్ నివేదిక పంపి పక్షం దాటినా తదుపరి చర్యలు శూన్యం
- తొలి నుంచి ఇదే ధోరణిలో సహకార శాఖ ఉన్నతాధికారులు
- వారి తీరుపై సర్వత్రా విమర్శలు




ఒంగోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో అడ్డగోలుగా సాగిన అవినీతి, అక్రమాల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంలో ఉన్నతస్థాయిలో ఉదాసీనత నెలకొంది. ప్రాథమికంగా చేపట్టిన విచారణలో అనేక అక్రమాలు జరిగినట్లు కమిటీ తేల్చింది. ఆ నేపథ్యంలో సమగ్ర విచారణ కోరుతూ కలెక్టర్ తమీమ్ అన్సారియా పక్షం క్రితం ప్రభుత్వానికి నివేదిక పంపినా తదుపరి చర్యలపై ఉన్నత స్థాయిలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. బ్యాంకు వ్యవహారంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల ధోరణి తొలి నుంచి అలాగే ఉండగా విషయం ముఖ్యమంత్రి దృష్టికి చేరి సీఎంవో జోక్యం చేసుకోవడంతో కొంత కదలిక వచ్చింది. తదుపరి చర్యలపై సాచివేత ధోరణిలోనే సహకారశాఖ ఉన్నతాధికారులు సాగుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

### ఎమ్మెల్యే ఫిర్యాదు.. కలెక్టర్ లేఖ

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తునఅవినీతి, అక్రమాలు జరిగాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ క్రమంలో అప్పటికి ఏడాదిగా బ్యాంకు సీఈవోగా ఉన్న అధికారి అక్కడే కొనసాగితే రికార్డులు ట్యాంపరింగ్ అయ్యే అవకాశం ఉన్నందున ఆయన్ను మార్చడంతోపాటు బ్యాంకుపై సెక్షన్ 51 విచారణ వేయాలని అక్టోబరు 21న కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి లేఖ రాశారు. సకాలంలో ఉన్నతాధికారులు స్పందించ లేదు. ఈ విషయాన్ని బహిర్గతం చేస్తూ నవంబరు 2న 'అక్కడ అంతే' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతి

మిగతా 6వ పేజీలో

### త్రిసభ్య కమిటీతో విచారణ

కలెక్టర్ లేఖ పంపిన చాలా రోజుల తర్వాత సెక్షన్ 51 విచారణకు వీలుగా ప్రాథమిక పరిశీలన చేసి నివేదిక పంపాలని రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. తదనుగుణంగా డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించగా వారు లోతుగానే పరిశీలన చేశారు. మొత్తం 62 ఫిర్యాదులలో అత్యధికం వాస్తవమేనని గుర్తించారు. నివేదికను కలెక్టర్‌కు గత నెలాఖరులో వారు అందజేశారు. మరోవైపు సీఎం దృష్టికి వ్యవహారం వెళ్లిన తర్వాత ఇక్కడి బ్యాంకు పీఐసీ పాలకవర్గం సూచనలతో బ్యాంకు సీఈవోగా ఉన్న కోటిరెడ్డి రాజీనామా చేయగా ఆ స్థానంలో ఆప్కాబ్ నుంచి మరొక అధికారిని తాత్కాలికంగా నియమించారు. బ్యాంకు సిబ్బంది లోనూ కొన్ని మార్పులు జరిగాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంకు పీఐసీ కమిటీగా ఉన్న కీలక అధికారులు కూడా తగు విధంగా వ్యవహరించలేదన్న విమర్శలు వచ్చాయి.



# రైతుల్లో మళ్లీ టెన్షన్

త్రిపురాంతకం వద్ద వరిని కోస్తున్న యంత్రం

ఒంగోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాపై ఉంటుందన్న సమాచారంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈనెల తొలి వారంలో తెరపి లేకుండా వారంరోజులపాటు విస్తారంగా కురిసిన వర్షాలకు తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని మండలాల్లో పొగాకు, శనగ పైర్లు దెబ్బతిన్నాయి. మినుము, వరి, మిర్చి, అలసంద ఇలా పలు రకాల పంటలు ఇంచుమించు లక్ష ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఏదో ఒకస్థాయిలో దెబ్బతిన్నాయి. అంతేకాక మిగిలిన రబీ పంటల సాగు కూడా జాప్యమైంది. దాని

మిగతా 6వ పేజీలో

- అల్పపీడన ప్రభావంతో చల్లబడిన వాతావరణం
- నేడు, రేపు వర్షాలు కురిసే అవకాశం
- ఇటీవలి వానలతో దెబ్బతిన్న పొగాకు, శనగ
- ఇప్పుడు కురిస్తే అంతా నష్టమే



# ఎదురుచూపులు

- కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- సంక్రాంతికి ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- దరఖాస్తు చేసుకొనేందుకు ఓపెన్ కాని సైట్
- అయోమయంలో అర్హులైన పేదలు

6

# మీనమేషాలు

(5వ పేజీ తరువాయి)

దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారులు కలవరపడ్డారు. అదే సమయంలో జిల్లాకు చెందిన టీడీపీ యువనేత ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో సీఎంవో ఆరా తీయడంతోపాటు ఉన్నతాధికారులకు తగు సూచనలు చేశారు.

**ఇంతవరకు చర్యల్లేవ్**

లోకేశ్వరరావు కమిటీ ఇచ్చిన విచారణ నివేదికను పక్షం క్రితమే కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి పంపించారు. కానీ ఇంతవరకు తదుపరి చర్యలు సహకార శాఖ ఉన్నతాధికారుల నుంచి కనిపించలేదు. తొలి నుంచి ఉన్నట్లుగానే ఆ శాఖ ఉన్నతాధికారులు ఉదాసీనంగానే వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి జిల్లాకు చెందిన అధికారపార్టీ ముఖ్య నేతలు ఇద్దరు, ముగ్గురు తీసుకెళ్లినట్లు సవచాఆరం. అయినా తదుపరి ఆదేశాలు రాకపోవడంతో ఇలాంటి విచారణలు మనల్ని ఏమి చేస్తాయి, గతంలో ఎన్నో చూశాం అన్నట్లుగా బ్యాంకులో అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు. అదేసమయంలో పలు వర్గాల నుంచి ఇప్పటికి కూడా విచారణాధికారి లోకేశ్వరరావుకు ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, జిల్లాలోని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ఇలాంటి వాటిపై సత్వర చర్యలవైపు దృష్టిసారించకపోతే ప్రజల్లో పాలకపక్షం అభాసుపాలయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

# డ్వామాలో శీనారెడ్డి రగడ

(5వ పేజీ తరువాయి)

తెలిసింది. మరోవైపు విచారణ కమిటీకి నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు కూడా ఈ విషయంపై సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. విచారణ ప్రారంభ సమయంలోనే అన్ని విభాగాల హెడ్‌లతో సమావేశం నిర్వహించి రికార్డుల విషయంలో పలు సూచనలు చేసిన ఆయన ఏమాత్రం తేడా వచ్చినా సెక్షన్ హెడ్‌లను కూడా విచారణలో బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. అయినా నిబంధనలకు విరుద్ధంగా ఫైళ్ల నకళ్లను ఎలా ఇస్తారని, అలాంటి వారిపై కూడా తమ విచారణలో ప్రత్యేకంగా చర్యలకు సిఫార్సు చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

# రైతుల్లో మళ్లీ టెన్షన్

(5వ పేజీ తరువాయి)

నుంచి తేరుకొని భూములు దున్ని పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులకు తాజాగా మరో అల్పపీడనం అన్న సమాచారం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వాతావరణ శాఖ తాజా సమాచారం ప్రకారం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా వాయుగుండంగా మారి తమిళనాడు తీరం వైపు పయనిస్తోంది. దీని ప్రభావంతో జిల్లాలో బుధ, గురువారాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దానికి అనుగుణంగా జిల్లాలో మంగళవారం వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఒంగోలులో సోమవారం 30 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రత ఉండగా మంగళవారం నాలుగు డిగ్రీలు తగ్గింది. ఇదే పరిస్థితి ఇతరచోట్ల కనిపిస్తుండటంతోపాటు చలి కూడా పెరిగింది. ఈ తరహా వాతావరణంతో పంటలపై తెగుళ్లు, పురుగుల దాడి మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో ఇటీవలి వర్షాల నష్టాల నుంచి ఇంకా తేరుకోక ముందే మరోసారి వర్షాల సమాచారంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## పోలీసుశాఖకు డ్రోన్ అందజేత



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

మార్కాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కందుల ఓబులరెడ్డి వైద్యశాల అధినేత డాక్టర్ కందుల గౌతమ్‌నాగిరెడ్డి రూ.2 లక్షల విలువచేసే అత్యాధునిక డ్రోన్‌ను మంగళవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన క్రైమ్ మీటింగ్ అనంతరం డాక్టర్ గౌతమ్ వెళ్లి ఎస్పీ దామోదర్ చేతులమీదుగా మార్కాపురం పోలీసులకు డ్రోను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ పోలీసుల విధులకు ఇలాంటి అత్యాధునిక డ్రోన్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ప్రధానంగా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడానికి, ఆకతాయిలను నిలువరించేందుకు, భారీ కార్యక్రమాలు జరిగినప్పుడు బందోబస్తును పర్యవేక్షించేందుకు, యాంటీసోషల్ యాక్టివిటీస్‌ను అరికట్టేందుకు ఇలాంటి డ్రోన్లు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. డాక్టర్ కందుల గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ స్ఫూర్తితో, నవ్యాంధ్ర కోసం వినూత్నమైన సరళితో ప్రేరణపొంది పోలీసుశాఖకు డ్రోన్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, సీఐ పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

పొదిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం స్థానిక పెన్షనర్ల భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు పెన్షన ర్లకు రావాలసిన బకాయిలు ఇవ్వాలన్నారు. అధ్యక్షుడు బాదుల్లా మాట్లాడుతూ పెన్షన్ సాధనకోసం నకార చేసిన పోరాటం మరువలేనిదన్నారు. పెన్షనర్లకు రావాల్సిన రెండు డీఆర్‌లు, పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన 15మంది పెన్షన్‌దారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మదార్‌వలి, గౌరవాధ్యక్షులు ఏ వీరారెడ్డి, అసోసియేటెడ్ అధ్యక్షుడు డీఎల్ నరసింహారావు, కార్యదర్శి మోహన్‌రావు, చిట్టెంశెట్టి సుబ్బారావు, గోవిందయ్య, అబ్దుల్‌హై, బాలవెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సామంతపూడి నాగేశ్వరరావు, వెలిశెట్టి వెంకటేశ్వర్లు ఎస్టీవో చంద్రశేఖర్, రిటైర్డ్ ఎస్టీవో ఎస్‌వీఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



మోదేపల్లి కొండ వద్ద గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్ల ముందు కూర్చున్న మహిళలు



గ్రామస్థులతో మాట్లాడుతున్న మైనింగ్ అధికారులు

# ఆగని కొండ గ్రావెల్ తరలింపు

- అడ్డుకున్న కొర్రపాటివారిపాలెం మహిళలు
- ఎంతవరకైనా పోరాడుతామని హెచ్చరిక
- పరిశీలించి అనుమతులు లేవని తేల్చిన అధికారులు

అద్దంకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొండ గ్రావెల్ తరలింపు ఆపకపోవడంతో కొర్రపాటివారి పాలెం మహిళలు మంగళవారం అడ్డుకున్నారు. బాపట్ల నుంచి వచ్చిన మైనింగ్ అధికారులు పరిశీలించి గ్రావెల్ తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని తేల్చారు. విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం అద్దంకి మండలంలోని మోదేపల్లి రెవెన్యూ పరిధిలో ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం కొర్రపాటివారిపాలెం సమీపంలో ఉన్న కొండ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో నెలరోజుల కిందట కొర్రపాటివారిపాలెం రైతులు అడ్డుకోవడంతో గ్రావెల్ తరలింపును నిలిపేశారు. మరలా నాలుగు రోజులుగా గ్రావెల్ తరలింపు ప్రారంభించారు. దీంతో సోమవారం కొర్రపాటివారిపాలెం గ్రామస్థులు రాజకీయ పార్టీలను పక్కనబెట్టి మూకుమ్మడిగా వచ్చి అడ్డుకున్నారు. అయినా తాళ్లూరు పోలీసుల అండతో మరలా గ్రావెల్ తరలింపు ప్రారంభించారు. దీంతో మంగళవారం ఉదయం మహిళలు కొండ వద్దకు చేరుకొని గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు. దీంతో గ్రావెల్ నిలిచిపోయింది. ఆంధ్రజ్యోతిలో మంగళవారం వార్త ప్రచురితం కావడంతో బాపట్ల నుంచి మైనింగ్ అధికారులు వచ్చి గ్రావెల్ తరలిస్తున్న కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రావెల్ తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని తేల్చి చెప్పారు. తమ పశువులు, గొర్రెలు, మేకల మేతకు ఆధారంగా ఉన్న కొండ నుంచి ఎట్టి పరిస్థితులలో గ్రావెల్ తరలింపు చేయడానికి వీలులేదని మహిళలు అటు రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇటు మైనింగ్ అధికారులకు తేల్చి చెప్పారు. గ్రావెల్ తరలింపును అడ్డుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయేందుకు ఎంతదూరమైనా వెళ్తామని, పోరాడుతామని గ్రామస్థులు, మహిళలు, టీడీపీ నేతలు అంటున్నారు. మైనింగ్ అధికారులు ఎలాంటి అనుమతులు లేవని చెప్పినా, తాళ్లూరు పోలీసులు రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్‌కు మేలు జరిగేలా గ్రామస్థులపై ఒత్తిడి చేయడం పట్ల పలువురు గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి మండల పరిధిలోని కొండ వద్ద తాళ్లూరు మండల పోలీసుల హడావుడి ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

# వై.పాలెంలో రైతుబజారు ప్రారంభం

- హాజరైన జేసీ గోపాలకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు ● రూ.1.28 కోట్లతో నిర్మాణం ● అందుబాటులోకి 38 దుకాణాలు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలు నేరుగా మార్కెట్‌కు తరలించి అమ్మడం ద్వారా లాభాలు పొందవచ్చని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ సూచించారు. టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి ఆయన మంగళవారం పుల్లలచెరువు రోడ్డులో రూ.1.28కోట్లతో నూతనంగా నిర్మించిన రైతుబజారును ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో మారుమూల మండలమైన ఎర్రగొండపాలెం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందన్నారు. రైతు బజారులో మొత్తం 38 దుకాణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిలో ఐదు దుకాణాలకు మాత్రమే వేలం నిర్వహించారన్నారు. స్థానికులు హెచ్చుపాట పాడి దుకాణాలు దక్కించుకున్నారు. మిగిలిన దుకాణాలకు లబ్ధిదారులకు ఉచితంగా కేటాయించారు. రైతు బజారు అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానన్నారు. జాతీయ రహదారి వెంబడి తోపుడు బండ్లపై వివిధ రకాల వ్యాపారాలు చేసుకొనేవారు ఇక్కడ వ్యాపారాలు



రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న జేసీ గోపాలకృష్ణ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

చేసుకోవచ్చన్నారు. ఇలా చేయడం వలన జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. అలాగే అన్ని రకాల సరుకులు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ, రైతుల కష్టాలను చూసిన వ్యక్తిగా, రైతు బాజారు ఏర్పాటు అంశాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లానన్నారు. కలెక్టర్, జేసీ సహకారంతో వేగంగా పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. రైతులు ఈ రైతుబజారును సద్వినియోగం చేసుకోవాలన్నారు. దోర్నాలలో రైతుబజారు ప్రజలకు అందుబాటులోకి తీసుకోవచ్చేలా చూడాలని ఈ సందర్భంగా జేసీని కోరారు. అక్కడ రైతుబజారు అందుబాటులోకి వస్తే ఆ ప్రాంత చెంచు గిరిజనులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వెంటనే స్పందించిన ఆయన వారంలోపు రైతుబజారుకు సంబంధించి పూర్తి వివరాలను ఇవ్వాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ముందుగా రైతు బజారులోని షాపులను పరిశీలించి ఆకుకూరలు, ఫ్రూట్స్, పచ్చళ్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, మార్కెటింగ్‌శాఖ ఏడీ ఉపేంద్ర కుమార్, మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, మాజీ సర్పంచ్ కంచర్ల సత్యనారాయణ గౌడ్, ఎస్సీ కార్పొరేషన్ డైరక్టర్ చేవుల అంజయ్య, ఎంపీటీసీ సభ్యులు చేదూరి కిషోర్, మెడబలిమి అచ్యుతరావు, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, నాయకులు చీదెళ్ల నాగేశ్వరావు, బీవీ.సుబ్బారెడ్డి మార్కెట్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్లు పయనం

- ఈ నెల 21 నుంచి 24 వరకు అయోధ్యలో నిర్వహణ

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న 68వ జాతీయ స్కూల్‌గేమ్స్ ఖోఖో చాంపియన్‌షిప్ అండర్-19 పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలురు, బాలికల జట్లు మంగళవారం అనకాపల్లి నుంచి బయలుదేరాయి. ఈ సందర్భంగా క్రీడాకారులకు అనకాపల్లి మండలం తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖాధికారి జి.అప్పారావు నాయుడు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

**బాలుర జట్టు**

జి.అజయ్ (విశాఖ), బి.సాయి (విశాఖ), సీహెచ్.చరణ్ (విశాఖ), డి.వినయ్ (ప్రకాశం), పి.నరేష్ (ప్రకాశం), డి.రాకేశ్ (కృష్ణా), ఎం.శివ (విజయనగరం), బి.తిరుమల (శ్రీకాకుళం), ఇ.శేషనార్‌గౌడ్ (అనంతపురం), ఎస్.నవీన్ (నెల్లూరు), జె.యల్లప్ప (కర్నూలు ), బి.పవన్ (చిత్తూరు).

**బాలికలు** : కె.లాస్య (విశాఖ), పి.జోత్స్న (విశాఖ), జె.గీత (విశాఖ),



జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్న రాష్ట్ర బాలురు, బాలికల జట్లు

సీహెచ్.లావణ్య (విజయనగరం), బి.భార్గవి (నెల్లూరు), కె.పవిత్ర(నెల్లూరు), డి.రంగమహాలక్ష్మి(గుంటూరు), కె.దివ్య (పశ్చిమగోదావరి), ఎస్.హస్మిత (చిత్తూరు), జి.దేవి (కడప), జి.భవాని (శ్రీకాకుళం), బి.కల్యాణి (ప్రకాశం). బాలికల జట్టు కోచ్‌గా కేఎం నాయుడు, మేనేజర్‌గా పి.లక్ష్మి వ్యవహరించనున్నారు.

# మెగా ఆర్వో ప్లాంట్ పూర్తయ్యేనా?

- నిర్మాణం కాకుండానే అటకెక్కిన వైనం
- ప్రత్యామ్నాయ అవసరాలకైనా వినియోగించాలంటున్న ప్రజలు

అద్దంకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి, బల్లికురవ మండలాలలో 22 గ్రామాలకు తక్కువ ధరకు శుభ్రమైన జలం అందించేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం శింగరకొండ వద్ద మెగా ఆర్వో ప్లాంట్ ని ర్మాణ పనులు ప్రారంభించారు. పనులు జరిగే సమయంలో 2019 ఎన్నికలలో వైసీపీ అధికారంలోకి రావ డంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ఐదున్నర సంవత్సరాలుగా పనులు అడుగు ముందుకు పడలేదు. భవనాసి చెరువులో ఏర్పాటు చేసిన ఇన్‌టెక్‌వెల్, శింగరకొండ వద్ద నిర్మించిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారాయి. మెగా ఆర్వో ప్లాంట్ నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చి ఉంటే రెండు రూపాయలకే 20లీటర్ల నీరు ఇళ్ల వద్దకే సరఫరా జరిగేవి. ప్రస్తుతం ఆయా గ్రామాలలో ప్రైవేటు వ్యక్తులు ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేసినప్పటికీ 20లీటర్ల నీరు 10 నుంచి 20 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అసంపూర్తిగా నిలిచిపోయిన మెగా ఆర్వో ప్లాంట్‌ను త్వరిత గతిన పూర్తిచేయాలని, ఒక వేళ దానిని ప్రస్తుతం ఏర్పాటు చేసే ఆలోచన లేకపోతే కనీసం ఆయా ట్యాంక్‌లను వినియోగంలోకి తీసుకువచ్చి శింగరకొండ, శింగరకొండపాలెం, గోపాలపురం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు మంచి నీటి సరఫరాకు వినియోగించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



భవనాసి చెరువులో ఏర్పాటు చేసిన ఇన్‌టెక్‌వెల్



శింగరకొండ వద్ద అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంక్

## గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

యద్దనపూడి, (మార్టూరు) డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎన్ వెంకయ్య (55) గుండెపోటుతో మంగళవారం వేకువజామున మృతి చెందారు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బల్లికురవ మండలం కొప్పెరపాడు స్వగ్రామం. సోమవారం రాత్రి మార్టూరులో కుమార్తె ఇంటిలో ఉన్న అతను తెల్లవారుజామున రెండు గంటల సమయంలో గుండెపోటుకు గురికాగా ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మృతి చెందారు. ఎంపీడీవో షేక్ మహమ్మద్ అబీబ్ జావెద్ సిబ్బందితో వెళ్లి కొప్పెరపాడులో కుటుంబసభ్యులకు మట్టిఖర్చులు నిమిత్తం 25 వేల రూపాయలను అందచేశారు.

## దాతల సాయం అభినందనీయం

చినగంజాం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం డి.రత్నకుమారి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తాగనీటి కోసం క్యాన్లు, గ్లాసులను దాత అక్కల రామకృష్ణారెడ్డి పాఠశాల హెచ్‌ఎంకు మంగళవారం అందజేశారు. దాతల సాయాన్ని విద్యార్థులు వినియోగించుకొని విద్యాభివృద్ధి చెందాలని హెచ్‌ఎం అన్నారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు అక్కల రామకృష్ణారెడ్డి విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం కోసం నాలుగు వాటర్ క్యాన్లు, గ్లాసులు పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కుర్రి రామసుబ్బారావు, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, శ్రీనివాసదీక్షితులు, సుబ్బారావు పాల్గొన్నారు

# ఎదురుచూపులు

- కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- సంక్రాంతికి కొత్తవి ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- దరఖాస్తులు చేసుకొనేందుకు ఓపెన్ కాని సైట్
- అయోమయంలో అర్హులైన పేదలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా తెల్లరేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న అర్హులైన పేదలకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం సంక్రాంతికి నూతన కార్డులు ఇస్తామని ప్రకటించడంతో వారిలో ఆశలు చిగురించాయి. అయితే సైట్ ఓపెన్ కాకపోవడంతో ఎదురుచూపులు చూడాల్సి వస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రేషన్ కార్డులపై ప్రత్యేక దృష్టిసారించారు. అందులోభాగంగా ఈనెల 2 నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిపై విచారణ చేసి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. తీరా ఇప్పుడు మీసేవ, వార్డు, గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే అక్కడ సైట్ (పౌరసరఫరాల శాఖకు సంబంధించినది) ఓపెన్ కావడం లేదు. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. ఏదైనా సాంకేతిక సమస్యతో ఓపెన్ కాలేదని ఎదురుచూసిన ప్రజానీకం ఇప్పుడు అధికారులను కలిసి సమస్యను విన్నవిస్తున్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం గ్రీవెన్స్ సెల్‌లో కూడా అర్జీలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయిలోనే టెక్నికల్ సమస్య ఏర్పడి వాయిదాపడిన విషయాన్ని కూడా సంబంధిత అధికారులకు తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతోంది.

## ఆస్పత్రిలో వాయిద్య శబ్దాలతో వేడుకలు

- జీజీహెచ్‌లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం
- సెమీ క్రిస్మస్ పేరుతో వైద్యశాలలో సంగీత వాయిద్యాలతో కచేరి

మార్కాపురంరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యసేవలు అందించాల్సిన వైద్యులు, సిబ్బంది సంగీత వాయిద్యాలతో కచేరిలో పాల్గొన్నారు. రోగులను గాలికి వదిలేశారు. రోగులకు వైద్య సేవలు అందించాల్సిన సమయంలో పాటలలో మునిగి తేలారు. స్థానిక సర్వజన వైద్యశాలలో మంగళవారం వైద్యులు, సిబ్బంది తోపాటు సూపరింటెండెంట్ కూడా వారితో సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఆ సమయంలో ఆస్పత్రికి వచ్చిన రోగుల బాధలను వారు పట్టించుకోలేదు. ఇదేం చోద్యం అంటూ ఆస్పత్రికి వచ్చిన రోగులు చర్చించుకున్నారు. అది కూడా వైద్యశాలలోనే నిర్వహించడం పరిసర ప్రాంతాలలో వైద్యం పొందుతున్న రోగులకు కూడా ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు కార్యక్రమం నిర్వహించడం గమనార్హం. ఇక ఆస్పత్రిలో మంగళవారం కూడా 320 మంది ఓపీ ఉండగా, పలువురు ఇన్‌పేషెంట్లు ఉన్నారు.



జీజీహెచ్‌లో కచేరీకి ఉపయోగిస్తున్న సంగీత వాయిద్యాలు



కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాల్లో సిబ్బంది

## ప్రజల్ని మభ్యపెట్టడానికే జగన్ వ్యాఖ్యలు

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'వెలిగొండ ప్రాజెక్టు పూర్తయింది. జాతికి అంకితం చేశాం. ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి నిర్వాసిత గ్రామాలను ఖాళీ చేయిస్తే జలాశయంలోకి నీళ్లు వస్తాయి' అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవాస్తవాలు మాట్లాడటం ప్రజల్ని మభ్యపెట్టడానికేనని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దుయ్యబట్టారు. స్థానిక ఇందిరమ్మ ఫేజ్-2 కాలనీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ నేను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాళ్లు, గడ్డాలు పట్టుకొనైనా ఆర్‌ఆర్ ప్యాకేజీ నిధులు మంజూరు చేయిస్తానని దమ్ము, ధైర్యం ఉంటే వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి నీటిని జలాశయంలోకి పారించాలని సవాల్ విసిరారు. నువ్వు చేసిన మోసపూరిత పనుల వల్లే ప్రజలు చెప్పుతో కొట్టినట్లు ఓటుతో బుద్ధిచెప్పి ఇంట్లో కూర్చోబెట్టినా ఇంకా అబద్ధాలు ప్రచారం చేయడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు. వెలుగొండ ప్రాజెక్టుకు సంబంధించి జలాశయంలోకి నీళ్లు రావాలంటే కనీసం రూ2 వేల కోట్లతో నిర్మాణ పనులు పూర్తిచేయాల్సి ఉందన్నారు. రెండు టన్నెళ్లు పూర్తయితేనే నీటిని వదిలేందుకు వీలుందన్నారు. అంతేకాక కొత్తూరు నుంచి జలాశయం వరకు ఉన్న ఫీడర్ కెనాల్ పూర్తిగా ధ్వంసమైందన్నారు. ప్రాజెక్టును గాడిలోపెట్టేందుకు రెండు నెలల క్రితం మంత్రులు వచ్చి పరిశీలించి వెళ్లారన్నారు. ఇప్పటి నుంచి యుద్ధప్రాతిపదికన పనులు చేస్తే ఇంకా రెండేళ్లకు కానీ నీళ్లిచ్చే పరిస్థితిలేదని జలవనరులశాఖ అధికారులు స్పష్టం చేశారన్నారు. ఐదేళ్లపాటు వెలుగొండ ప్రాజెక్టుకు ఏం చేయకపోయినా పూర్తయినట్లు జాతికి అంకితం చేసిన నువ్వు ఇంకా ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు తప్పుడు వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదన్నారు. 2027కల్లా ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. అంతేకాక మార్కాపురం జిల్లా కావడం కూడా తథ్యమన్నారు. అభివృద్ధి చేయడమే తమకు తెలుసని కల్లబొల్లి మాటలతో ప్రజల్ని మోసం చేయడం తమకు రాదని అన్నారు.

## ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- పెన్షనర్ల డేలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పెన్షనర్లడే సందర్భంగా మంగళవారం పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నాడు వైసీపీ హయాంలో ఉద్యోగులకు, పింఛనర్లకు జీతాల చెల్లింపులో ఆలస్యం ప్రదర్శించిందని, ప్రభుత్వ ఉద్యోగులను చిన్నచూపు చూస్తూ ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఉద్యోగులను అగౌరవ పరిచారన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సకాలంలో ఉద్యోగులకు, పింఛనర్లకు వేతనం అందిస్తోందన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో వ్యక్తిగతంగా తమకు ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీంద్రరెడ్డి, శివారెడ్డి, కాశీశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## 'పది'లో మంచి మార్కులు సాధించాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, దాతల చేయూతను విద్యార్థులు అందిపుచ్చుకుని పదవతరగతి పబ్లిక్ పరీక్షలల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని ఎంఈవో బి.సుధాకరరావు అన్నారు. మంగళవారం యూటీఎఫ్ అద్దంకి మండల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గురకాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం హెచ్‌ఎం ఎల్.సుజాత అధ్యక్షతన జరిగింది. గతేడాది యూటీఎఫ్ పంపిణీ చేసిన మెటీరియల్ 80శాతం మందికి ఉపయోగపడిందన్నారు.

భర్త దూరమై, బిడ్డల ఆదరణ కరువై, ఒంటరిగా బతకలేని కుంగిపోయే పండుటాకులు కొందరు... భార్యను కోల్పోయి వృద్ధాప్యంలో పిల్లల ఈసడింపులు భరించలేని ముదుసలిలు మరికొందరు... ఇలా వీరి బతుకు దుర్భరంగా ఉంటోంది. అయినవారి ఆసరా లేక కన్నీటిపర్యంత మవుతున్న వృద్ధులు రోడ్డున పడుతున్నారు. ఇటువంటివారికి మేమున్నాం అంటూ భరోసాగా నిలుస్తోంది అద్దంకి మండలం శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమం. 50 ఏళ్లుగా వృద్ధులకు సేవలందిస్తోంది. దాతల సహకారంతో నిర్విరామంగా కొనసాగుతున్న ఆ ఆశ్రమంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..


శింగరకొండలోని శ్రీరామ ఆశ్రమంలో ఆసరా పొందుతున్న వృద్ధులు

# ఆనంద నిలయం

## పండుటాకులను ఆదరిస్తున్న శింగరకొండ శ్రీరామ వృద్ధాశ్రమం

- దాతల సాయంతో 50 ఏళ్లుగా నిర్వహణ
- నిత్య అఖండ సంకీర్తనతో మొదలై ఆశ్రమంగా అభివృద్ధి
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చి హాయిగా గడుపుతున్న వృద్ధులు


శింగరకొండలోని వృద్ధాశ్రమానికి దాతల సహకారంతో నిర్మించిన భవనం

అద్దంకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని రామాలయంలో 50 ఏళ్ల క్రితం నిత్య హరేరామ సంకీర్తన ప్రారంభించారు. అప్పటి నుంచి అక్కడ శ్రీరామ వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నారు. అందులో ఉండే వృద్ధులు రామాలయంలో వంతుల వారీగా నిత్య హరేరామ సంకీర్తన చేస్తుంటారు. గంటకు ఇద్దరు, ముగ్గురు చొప్పున సంకీర్తనలో పాల్గొంటారు. మిగిలిన సమయంలో విశ్రాంతి తీసుకుంటారు. కొంతమంది రెండు దశాబ్దాల నుంచి ఇక్కడ ఉన్నారు. ఇళ్ల వద్ద సరైన పోషణ, సంరక్షణ లేకపోవటంతో ఎక్కువ మంది వృద్ధులు శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమానికి వస్తుంటారు. మరికొందరు నిత్య హరేరామ సంకీర్తన చేసేందుకు వస్తుంటారు. వృద్ధాప్యంలో ఉన్నా వాళ్ల పనులు వాళ్లు చేసుకోగలిగితే ఆశ్రమంలో ఉండొచ్చు. ఇక్కడున్నవారు వాళ్ల కుటుంబసభ్యులు వచ్చినప్పుడు పింఛన్ కోసం సొంతూళ్లకు వెళ్లి తిరిగి ఆశ్రమానికి వస్తుంటారు. గతంలో చిన్న భవనంలో నిర్వహించిన ఈ వృద్ధాశ్రమం ఇటీవల పై అంతస్తు నిర్మించారు. అదే సమయంలో అన్ని హంగులతో నిత్య అన్నదాన మండపం కూడా దాతల సహకారంతో నిర్మించారు. బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు 50 మంది వరకు ఇక్కడ ఉంటున్నారు.


ఆశ్రమంలో సేద తీరుతున్న వృద్ధులు

### దాతల సహకారంతో వృద్ధాశ్రమం నిర్వహణ



దాతల సహకారంతో వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నాం. గతంలో చిన్న భవనంలో నిర్వహించగా దాతల సహకారంతో పై అంతస్తు, నిత్య అన్నదాన మండపం నిర్మించాం. వృద్ధులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా జీవితం గడిపే విధంగా నిర్వహిస్తున్నాం.

-రావూరి రంగయ్య, వృద్ధాశ్రమం నిర్వహణ కమిటీ అధ్యక్షుడు, శింగరకొండ

### అందరం కలిసి ఆనందంగా ఉంటున్నాం



అందరం వయస్సు అయిపోయినవారే కావటంతో పాత జ్ఞాపకాలు చెప్పుకుంటూ హాయిగా గడుపుతున్నాం. నేను నెలకు ఒకసారి సొంతూరు వెళ్లి పింఛన్ డబ్బులు తీసుకొని మళ్లీ వస్తాను. వృద్ధాప్యాన్ని సైతం మరిచి ఇక్కడ ఆనందంగా గడుపుతున్నాం.

- ఎం.శింగారెడ్డి, చిమట, మర్రిపూడి మండలం

### ఇద్దరం ఇక్కడే ఉంటున్నాం



తొలుత నా భర్త వచ్చారు. ఆ తరువాత రెండు సంవత్సరాల క్రితం నేను కూడా వచ్చి ఇద్దరం ఇక్కడే ఉంటున్నాం. ఇంటి వద్ద కంటే మిన్నగా ఇక్కడ అన్ని వసతులూ ఉన్నాయి.

-ముత్తినేడి తాతయ్య- రమణమ్మ దంపతులు, పోట్లూరు, శావల్యాపురం మండలం

### దాతల సహకారం మరువలేనిది



వృద్ధాశ్రమానికి దాతల సహకారం మరువలేనిది. 25 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాను. పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, ప్రత్యేక సందర్భాల్లో పలువురు వచ్చి తమ వంతు సహకారం అందిస్తున్నారు.

-బోడేపూడి కోటయ్య, కుందుర్తి, సంతమాగులూరు మండలం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు

## జిల్లా అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించాలి

- మహాసభలో ఆమోదించిన తీర్మానాల అమలు కోసం పోరాటాలు
- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన జిల్లా అభివృద్ధికి పదివేల కోట్ల రూపాయలు కేటాయించాలని సీపీఎం నూతన జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు డిమాండ్‌చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల నిర్వహించిన ఆ పార్టీ జిల్లా మహాసభల్లో ఆమోదించిన తీర్మానాలను వెల్లడించారు. జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని, వర్షపాతం తక్కువగా ఉందని చెప్పారు. వెనుకబడిన జిల్లాను అభివృద్ధి చేయాలనే ఆకాంక్ష పాలకుల్లో కొరవడిందని ఆరోపించారు. జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని సీపీఎం నేతృత్వంలో అనేక పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వెనుకబడిన జిల్లాగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. జిల్లాకు పదివేల కోట్లు కేటాయిస్తేనే అభివృద్ధి చెందుతుందన్నారు. నీటి ప్రాజెక్టులతో పాటు కొత్త పరిశ్రమలు, రైల్వేలైన్లను ఏర్పాటు చేయాలని కోరారు. గుండ్లకమ్మ ప్రాజెక్టును ప్రభుత్వాలు మారినా పూర్తి కావడం లేదని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సత్వరమే రూ.4వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ట్రూఅప్ చార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు హనీఫ్ మాట్లాడుతూ చీమకుర్తిలో జరిగిన మహాసభలో ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా పోరాటాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు పూనాటి ఆంజనేయులు, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- నేరసమీక్షా సమావేశంలో ఎస్పీ
- ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేత

ఒంగోలు (క్రైం), డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): అదమరిస్తే సైబర్ నేరగాళ్లు నగదుతోపాటుగా ఫోన్‌లో ఉన్న వ్యక్తిగత సమాచారాన్ని కూడా చోరీ చేస్తున్నారనీ, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అహగాహన కల్పించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నెలవారీ నేరసమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న తీవ్రమైన నేరాలపై సమీక్ష నిర్వహించి వేగంగా దర్యాప్తు చేసేందుకు తగు సూచనలు చేశారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. దొంగతనాలు జరగకుండా డైనమిక్ బీట్లు వేసుకోవాలని ఆదేశించారు. విధుల్లో విశేష ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇటీవల జరిగిన లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారానికి కృషి చేసిన వారికి అభినందనలు తెలిపారు. .

**డ్రోన్ కెమెరా అందజేత**

శాంతిభద్రతల పరిరక్షణ కోసం డ్రోన్ కెమెరాలు దోహదపడతాయని, మార్కాపురంలో కందుల ఓబులరెడ్డి హాస్పిటల్స్ ఛైర్మన్ కందుల గౌతమ్ రెడ్డి డ్రోన్ కెమెరా అందజేయడం అభినందనీయమనీ ఎస్పీ తెలిపారు. నేరసమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, ఎస్బీ డీఎస్పీ సురేష్ బాబు పాల్గొన్నారు.

## జిల్లాలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- 425 మెట్రిక్ టన్నులు కొనుగోలు
- జేసీ గోపాలకృష్ణ వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దర్శి, ముండ్లమూరు, త్రిపురాంతకం మండలంలో ఏర్పాటు చేసి ఏడు కొనుగోలు కేంద్రాల ద్వారా 425 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 62 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు కేసి రైసు మిల్లులకు పంపినట్టు తెలిపారు. ఇప్పటి వరకు రైస్ మిల్లల వద్ద నుంచి కోటీ 50 లక్షల రూపాయలు బ్యాంకు గ్యారెంటీ తీసుకున్నట్టు పేర్కొన్నారు. రానున్న మూడు రోజుల్లో మరో మూడు రూ.కోట్లు బ్యాంకు గ్యారెంటీ ఆయా రైస్ మిల్లులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలుకు సంబంధించి 62 మంది రైతులకు రూ.94 లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేసిన 24 గంటల్లోనే మద్దతు ధర సొమ్మును సంబంధిత రైతు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. 650 టార్పాలిన్ పట్టలను కొనుగోలు చేసినట్టు, వర్షాభావ పరిస్థితుల్లో రైతులు టార్పాలిన్ పట్టలను సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు.



స్థానిక రైతులతో ఇతర రాష్ట్రాల ప్రతినిధులు

## ప్రకృతి సాగు.. అవగాహన బాగు!

గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన ఆగాఖాన్ రూరల్ సపోర్ట్ ప్రోగ్రామ్‌కు చెందిన 13 మంది బృందానికి మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. బృంద సభ్యులు 13 మంది మండల పరిధిలోని పందిళ్లపల్లిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా చేపట్టిన వరిసాగు క్షేత్రాలను సందర్శించారు. అక్కడ దేశవాళీ సాగు విధానాన్ని పరిశీలించారు. తద్వారా ఒనగూరే ప్రయోజనాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏడీ శ్రీనివాసరావు, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు ప్రకాష్‌రావు, శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.వాణిశ్రీ, ఏఓ కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

- వేటపాలెం (చీరాల), (ఆంధ్రజ్యోతి)

## ఉపాధి కూలీలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

### పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ శివప్రసాద్

పొదిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం పనులకు వచ్చే కూలీలకు సరైన అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమౌతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.శివప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ భవానీహర్షతో కలిసి మండలంలోని అక్కచెరువు, ఓబులక్కపల్లి గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులను, నీటికుంటలను, గోకులంషెడ్లను తనిఖీ చేశారు. అధికారులు కూలీలకు అవగాహన కల్పించకుండా నామమాత్రపు కూలితో పనులు చేయిస్తున్నట్లు అర్థమౌతుందన్నారు. జిల్లాలో ఉపాధి కూలీలకు ప్రభుత్వం నిర్ధేశించిన వేతనం దక్కడం లేదనే విషయంపై పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. కూలీలకు సరైన అవగాహన కల్పిండంలో క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఫారంపాండ్లను నిర్దేశించిన కొలతలతో ఏర్పాటు చేయిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలా చేయకపోవడం వల్ల ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం నెరవేరడంలేదన్నారు. ఫారంపాండ్ నిర్మాణం కొలతల ప్రకారం ఉందా? లేదా? అని రైతు మస్తాన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫారంపాండ్ ఏర్పాటు చేసిన పొలంలో బోర్డ్ ఏర్పాటు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుకు అందించిన మొక్కలను ఇచ్చినట్లు చూపించకపోవడం ఏమిటని ఏపీడీ లలితకుమారిని ప్రశ్నించారు. బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా పక్కరైతులు కూడా ఉత్సాహంతో సాగు చేసేందుకు ముందుకు వస్తారన్నారు. ఉపాధి కూలీలకు సరాసరి రూ.85 నుంచి రూ.195 మాత్రమే దక్కుతుందని గుర్తించామన్నారు. ఉపాధి కూలీలు వ్యవసాయ పనులు లేని సమయంలో పనులకు వచ్చి ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులుచేస్తే రోజువారి కూలీ రూ.300 వేతనం పూర్తిగా లభిస్తుందన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో జరుగుతున్న సీసీరోడ్ల పనులను పరిశీలించారు. గోకులంషెడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. తద్వారా పాడి పరిశ్రమకు ఉపయోగంగా ఉంటుందన్నారు. వారి వెంట పీడీ జోసఫ్‌కుమార్, ఏపీడీ లలితకుమారి, ఎంపీడీవో జి.శోభన్‌బాబు, ఏపీవో వెంకటేశ్వర్లు, టీఏలు, ఈసీలు, ఎఫ్ఏలు ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

## మహిళలపై ప్రభుత్వ ఉద్యోగి గొడ్డలితో దాడి

### ఇద్దరికి తీవ్రగాయాలు

కొమరోలు, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): మహిళపై ఓ ప్రభుత్వ ఉద్యోగి గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని అల్లీనగరం గ్రామంలో మంగళవారం చోటుచేసుకొంది. అందిన సమాచారం మేరకు, కొమరోలు మండలంలోని అల్లీనగరం గ్రామానికి చెందిన కత్తిరగండ్ల ప్రసాదు, సప్పర్ల పకీరయ్యలకు కొన్ని నెలల నుంచి పొలం వివాదాలున్నాయి. ఈ నేపథ్యంలో పొలంలో పనులు చేసుకుంటున్న కత్తెరగండ్ల లక్ష్మిదేవి, కత్తెరగండ్ల రమాదేవీల వద్దకు పకీరయ్య, భార్య, వారి కుమారుడు సాయి వెళ్లి పొలం విషయమై ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగి అయిన పకీరయ్య గొడ్డలితో మహిళలపై దాడి చేశాడు. తల, కాళ్లపై తీవ్ర గాయాలు చేశాడు. దీంతో గాయాలపాలైన లక్ష్మిదేవి, రమాదేవిలను 108 వాహనం ద్వారా గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో లక్ష్మిదేవి పరిస్థితి విషమించడంతో వైద్యులు కర్నూలుకు మురుగైన చికిత్సకోసం సిఫారసు చేశారని తెలిసింది.

**ప్రభుత్వ ఉద్యోగిగా విధులకు హాజరై..**

సప్పర్ల పకీరయ్య అల్లీనగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పకీరయ్య స్వగ్రామం కూడా అల్లీనగరమే కావటంతో తరచూ పాఠశాలలో హాజరు వేసుకుని తన సొంత పనులు చూసుకుంటాడని స్థానికులు తెలిపారు. మంగళవారం ఉదయం మోషన్స్ అవుతున్నాయని పర్మిషన్ తీసుకుని బయటకు వెళ్లి మళ్లీ తిరిగి పాఠశాలకు రాలేదని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురుస్వామి తెలిపారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో హాజరు వేసుకొని పొలం వద్ద ఘర్షణలో మహిళపై పకీరయ్య దాడిచేసినట్లు తెలిసింది.


గిద్దలూరు వైద్యశాలలో చికిత్సపొందుతున్న లక్ష్మీదేవి, రమాదేవి

## డీసీ అధ్యక్షుడిగా దేవినేని చలమయ్య

త్రిపురాంతకం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ పరిధిలోని సాగునీటి సంఘాలపై డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ) అధ్యక్షుడిగా కంకణాలపల్లి-1 సాగునీటి సంఘం అధ్యక్షుడు దేవినేని చలమయ్య, ఉపాధ్యక్షుడిగా కంకణాలపల్లి-2 సాగునీటి సంఘం అధ్యక్షుడు పి.గురవారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్నెస్పీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియకు ఏడుగురు సభ్యులు హాజరయ్యారు. చలమయ్య అధ్యక్షుడిగా నామినేషన్ వేయగా కంకణాలపల్లి-3 సాగునీటి సంఘం అధ్యక్షుడు అలవాల చెన్నారెడ్డి ప్రతిపాదించారు. అధ్యక్ష ఎన్నిక అనంతరం ఉపాధ్యక్షుడిగా గురవారెడ్డి నామినేషన్ వేయగా అన్నసముద్రం-2 సాగునీటి సంఘం అధ్యక్షుడు పి.లింగారావు ప్రతిపాదించారు. పోటీలో ఎవరూ లేకపోవడంతో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఎన్నికల అధికారిగా పశుసంవర్ధకశాఖ డీడీ కె.రాఘవయ్య వ్యవహరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అధికారులు, టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.


చలమయ్యను అభినందిస్తున్న ఎన్నెస్పీ డీఈఈ

## నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం నుంచి ఈనెల 23 వరకు జరగనున్న ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మాట్లాడారు. జిల్లాలో ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ సెంటర్, కృష్ణచైతన్య ఇంజనీరింగ్ కాలేజీ, నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చి సోషల్ యాక్షన్ ఇండియా, రైజ్ ఇంజనీరింగ్ కాలేజీ, రైజ్ కృష్ణ సాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో 1844 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్షా కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరాదని, తాగునీరు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు.

### 20న చెస్ పోటీలు

ఒంగోలు విద్య, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక హైదరీ క్లబ్‌లో ఈనెల 20న ఓపెన్, ఉమెన్ ర్యాపిడ్ అండ్ బ్లిడ్జ్ జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ సెక్రటరీ ఎస్‌కే అబ్దుల్ నబీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 9666725719 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

### 21, 22 తేదీల్లో హెచ్‌ఎంలకు అకౌంట్ టెస్ట్‌లు

ఒంగోలు విద్య, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని గాంధీజీ మునిసిపల్ హైస్కూలులో ఈనెల 21, 22 తేదీల్లో ప్రధానోపాధ్యాయులకు అకౌంట్ టెస్ట్ పరీక్ష జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ వెబ్‌సైట్‌నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

### 21న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ఒంగోలు విద్య, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీన స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ కాలేజీ నుంచి ప్రిన్సిపాల్ చేత ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు. పోటీలు కళాశాల స్థాయి విద్యార్థుల కోసం తెలుగు, ఆంగ్లమాధ్యమాలలో వేరువేరుగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రథమ స్థాయిలో విజయంసాధించిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత పొందుతారని తెలిపారు. విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని, వివరాలకు 9912328736నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### ఆళ్ల ఆంజనేయులు మృతి సీపీఐకి తీరనిలోటు

మద్దిపాడు,డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకులు ఆళ్ల ఆంజనేయులు మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) చెప్పారు. పెద్దకొత్తపల్లి పంచాయతీ మారెళ్లగుంటపాలెంకు చెందిన ఆళ్ల ఆంజనేయులు మృతికి మంగళవారం నివాళులర్పించారు. నాయకుడు ఉప్పుటూరు ప్రకాశరావు, ఎంసీ వెంకటేశ్వర్లు, పావులూరు అంజయ్య, ఈసా రామకోటయ్య, కాకి జాలయ్య, ఎద్దు రమేష్, దారా శేషయ్య తదితరులు సంతాపం ప్రకటించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

### నాగేశ్వర రావు కుటుంబానికి ఆర్థిక సహాయం

మద్దిపాడు, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): గుళ్లాపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎంగా పనిచేస్తూ అకాల మరణం చెందిన పూనూరి నాగేశ్వర రావు కుటుంబ సభ్యులకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.1.50 లక్షల చెక్కును ఎంఈవో శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ బాబు, కె.వసంతకుమారి, కె.హనుమంతరావు, ఆర్.రామారావు, ఎస్.వి.సుబ్బారావు, ఆర్.రాధారాణి, వినయ్‌కుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పునర్వసు పూజలు

ఒంగోలు కల్చరల్, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాసం పునర్వసు నక్షత్రం సందర్భంగా ఏటా నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలు మంగళవారం రాత్రి గడియారంవారి వీధిలోని శ్రీఅనంత కోదండ రామస్వామి దేవస్థానంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఆధ్వర్యంలో శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అధ్యాయాలను పారాయణం చేశారు.



# ఎస్‌ఎన్‌పాడు, ఒంగోలు డీసీలు ఏకగ్రీవం


డిక్లరేషన్ పత్రంతో సంతనూతలపాడు-1 అధ్యక్షుడు రామాశ్రీను, ఉపాధ్యక్షుడు చెరుకూరిశ్రీను


ఒంగోలులో డిక్లరేషన్‌పత్రంతో అధ్యక్షుడు నల్లూరి క్రిష్ణారావు, ఉపాధ్యక్షుడు పెండ్యాల రోశయ్య

సంతనూతలపాడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు-1(డీసీ-46), ఒంగోలు డీసీల అధ్యక్షుల ఎంపిక మంగళవారం జరిగింది. సంతనూతలపాడు-1(డిసి-46) అధ్యక్షుడుగా రామా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడుగా చెరుకూరి శ్రీనులు ఎన్నికయ్యారు. సంతనూతలపాడు జడ్పీ హైస్కూల్లో అధికారుల సమక్షంలో ఈ ఎన్నికను నిర్వహించారు. ఒంగోలు డీసీ అధ్యక్షుడుగా నల్లూరి కృష్ణారావు, ఉపాధ్యక్షుడుగా పెండ్యాల రోశయ్యను ఒంగోలు డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్లో అధికారుల సమక్షంలో ఎన్నుకున్నారు. కాగా సంతనూతలపాడు-2 (డిసి-47) అధ్యక్షుడుగా కంకణాల వేణు, ఉపాధ్యక్షులుగా దామచర్ల శ్రీనివాసరావులు నీటిసంఘాల అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వీరందరికీ అధికారులు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు శ్రీరామ్మూర్తి, అబ్బూరి శ్రీను, నువ్వల శ్రీను తన్నీరు శ్రీను, ఎస్ఎస్పీ డీఈఈ పద్మావతి, జేఈఈ కరీంబాష, ఎస్సై వి.అజయ్‌బాబు పాల్గొన్నారు.


మంత్రిని సన్మానిస్తున్న శ్రీనివాసరావు,సాగునీటి సంఘాల పాలకవర్గాలు

### మంత్రిని కలిసిన సాగునీటి సంఘాల అధ్యక్షులు

టంగుటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) అధ్యక్షుడిగా టంగుటూరు మండలం కొణిజేడుకు చెందిన రామా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ డీసీ పరిధిలో కొణిజేడులోని రెండు మేజర్, ఒక మైనర్.. సంతనూతలపాడులోని ఐదు సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఉపాధ్యక్షుడిగా సంతనూతలపాడుకు చెందిన చెరుకూరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. మంగళవారం వీరంతా తూర్పునాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కలిశారు. ఆయన్ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వీరందరినీ అభినందించారు. కార్యక్రమంలో కొణిజేడు టీడీపీ నాయకుడు రామా గోపి పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

### డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి

మర్రిపూడి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని కనిగిరి డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.జగదీష్, ఈవోఆర్డీ ఎ.సాంబశివరావు, ఏఈలు ఎన్.జాలయ్య, యు.జయపాల్, మర్రిపూడి, కాకర్ల వైద్యాధికారులు సిహెచ్.వీరబాబు, ఎం.తేజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత, సర్పంచ్‌లు కదిరి బాస్కర్, ఎం.కోటమ్మ, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, ఎం.సుబ్బయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీ కేశవరెడ్డి

#### సింగరాయకొండలో..

సింగరాయకొండ : గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించాలని ఎంపీడీవో జయమణి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఈవోఆర్డీ సుధాకర్, ఏవో కృష్ణారావు, ఏపీఎం భాగ్యలక్ష్మి, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

#### నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధి సాధించాలని ఏపీ పంచాయితీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ కేశవరెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులకు గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ, ఎంపీడీవో వైమహాలక్ష్మి,ఎంఈవో టి.రవి పాల్గొన్నారు.

#### సంతనూతలపాడులో...

సంతనూతలపాడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో డి.సురేష్‌బాబు చెప్పారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో రెండురోజుల పాటు గ్రామాల్లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

#### ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో...

ఒంగోలు(రూరల్)డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమగ్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని డీఎల్పీవో పద్మ చెప్పారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, డిజిటల్ సహాయకులు, వీఆర్‌వోలు, ఇంజినీరింగ్ సహాయకులు, మండల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శేషుబాబు, ఈవోఆర్డీ బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

#### మద్దిపాడులో...

మద్దిపాడు, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జేడీ కేశవ రెడ్డి మాట్లాడారు. ఎంపీడీవో జ్యోతి పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

నాగులుప్పలపాడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. కనపర్తి పంచాయతీ పరిధిలోని కుక్కలవారిపాలెం, చిన్నంగారి పట్టపుపాలేలలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సులో 20 అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయరు రత్నాకర్, ఆర్ఐ రమేష్, వీఆర్‌వోలు భాగ్యారావు, చంద్ర పాల్గొన్నారు

#### సంతనూతలపాడులో 20 అర్జీలు

సంతనూతలపాడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు-1 సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 20 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి చెప్పారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ వరకుమార్ పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

### చైర్మన్‌గా విజయకుమార్ నియామకం సంతోషం

ఒంగోలు రూరల్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : మాల కార్పొరేషన్ చైర్మన్‌గా డాక్టర్ పెద్దపూడి విజయకుమార్‌ను నియమించటం ఎంతో సంతోషకరమని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు పేర్కొన్నారు. ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యావంతుడు, అంబేద్కర్ సిద్ధాంతాలకు కట్టుబడి విజయకుమార్ పనిచేస్తూ ప్రజలు మన్ననలు పొందుతున్నారన్నారు. ఈ నెల 19వ తేది సాయంత్రం 5 గంటలకు అంబేద్కర్ భవన్‌లో విజయకుమార్ సన్మాన కార్యక్రమం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పులిపాటి రాఘవులు, మేడికొండ మురళి, పెద్దపూడి సురేష్ పాల్గొన్నారు

### జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం


కబడ్డీ నిర్వాహకులను సత్కరిస్తున్న ప్రతినిధులు

సంతనూతలపాడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో సూదనగుంట ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూదనగుంట రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు విజయవంతమైన సందర్భంగా మంగళవారం ఫౌండేషన్ నిర్వాహకులు సూదనగుంట కృష్ణమూర్తి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రాభాస్కరరావులను, వైస్‌ప్రెసిడెంట్ సిరిగిరి రంగారావులను, ట్రెజరర్ దాసరి రమేష్‌లను జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మందాడివెంకటేశ్వర్లు, సాధినేని శ్రీరామ్మూర్తి, ముప్పరాజు శ్రీను, పీఎస్ఎస్ చౌదరి, ఎస్.సుబ్బారావు, ఇంద్రబాబు, ఎం సుబ్బారావు, శంకర్, కే శ్రీను, ఎం శ్రీను పాల్గొన్నారు.

### మోడల్ ప్రశ్నపత్రాల గైడ్‌ల పంపిణీ


పుస్తకాలను పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు

సింగరాయకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మోడల్ ప్రశ్నపత్రాల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.హరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు ఉలిచి సుబ్బారెడ్డి, బక్కమంతుల వెంకటేశ్వర్లు, కొల్లూరి వెంకయ్య, టి.రామ్మూర్తి, బి.సుధాకర్‌రెడ్డి, కోటపాటి నారాయణ. ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

### పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ


స్టడీమెటీరియల్‌ని అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

చీమకుర్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కడవా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కందుకూరి వెంకటసుధాకర్‌బాబు, పరాంకుశం శ్రీనివాసమూర్తి, అంబటి వీరారెడ్డి, నాగళ్ల సత్యం, ఆదినారాయణరెడ్డి, దొంతు సోమయ్య, పేరం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### జనసేనలోకి 42వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు

సంతనూతలపాడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్ట 42వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు నూకతోటి ఈశ్వరరావు మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో మంగళవారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ తన భార్య 42వ డివిజన్ కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, తదితరులు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో బుధవారం పార్టీ కండువ కప్పుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గోలి తిరుపతిరావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, కిషోర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### చీమకుర్తి 1, 2 డీసీ అధ్యక్షులుగా నారాయణ,వెంకట్రావు

చీమకుర్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి డివిజన్ పరిధిలోని ఎన్ఎస్‌పీ మేజర్‌కు సంబంధించి చీమకుర్తి డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)లకు ఎన్నిక ప్రక్రియ మంగళవారం చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. డీసీ నంబర్-45 చీమకుర్తి-2 కారుమంచి మేజర్‌కి కూనంనేనివారిపాలేనికి చెందిన పాలడుగు వెంకటనారాయణ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పిడతలపూడికి చెందిన వేల్పుల వెంకటేశ్వర్లను ఎన్నుకున్నారు. డీసీ-44, చీమకుర్తి-1 కరవది మేజర్ కింద అధ్యక్షునిగా చంద్రపాడు గ్రామానికి చెందిన దొడ్డా వెంకట్రావు అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా తాళ్లూరికి చెందిన తూము శివనాగిరెడ్డిని ఎన్నుకున్నారు. వీరికి ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల ఆర్‌వో అందజేశారు. తదుపరి వీరు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌ని కలిసి ధన్యవాదాలు తెలిపారు.ఎన్నికైన వారిని టీడీపీ నాయకులు గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ల గంగాధరరావు, సూరంపల్లి హనుమంతరావు, గోగినేని శ్రీనివాసరావు, రావిపాటి రాంబాబు, దొడ్డా సుబ్బారావు అభినందించారు.


ఎమ్మెల్యే బీఎన్‌కు బొకే ఇస్తున్న నారాయణ, టీడీపీ నాయకులు

అవీఇవీ

### ఎమ్మెల్యే విజయకుమార్‌ను కలిసిన ఏపీఎస్పీ అధికారులు


బీఎన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 17, ఆంధ్రజ్యోతి : ఏపీఎస్పీ బెటాలియన్ అధికారులు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. మద్దిపాడు మండలంలో 7వ ఏపీఎస్పీ బెటాలియన్ ఏర్పాటు కోసం సుమారు 100 ఎకరాల భూమిని కేటాయించారు. ఆ స్థలంలో బెటాలియన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా కమాండెంట్ ఏ మురళి, అదనపు కమాండెంట్ బీ జనార్దన రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ పైడి రాజులు ఎమ్మెల్యేతో కలిసి చర్చించారు.

### వైసీపీ తప్పిదాల భారాన్ని ప్రజలపై మోపవద్దు

#### ట్రూఅప్ చార్జీల ప్రతుల దహనం కార్యక్రమంలో సీపీఎం నేతలు


ట్రూ అప్ చార్జీల ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కరెంటు భారాలు గత వైసీపీ ప్రభుత్వ తప్పిదమని వారిపై మోపి ప్రస్తుత ప్రభుత్వం తప్పుకోవడం సరికాదని, వెంటనే విద్యుత్ బిల్లులను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం 49వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక 60 అడుగుల రోడ్డు జంక్షన్‌లో ట్రూ అప్ చార్జీల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు రమేష్ మాట్లాడుతూ విద్యుత్ భారాలను ప్రజలపై రూ.17వేల కోట్లు వేయడం దారుణమన్నారు. ఈ బిల్లులను ప్రజలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కరెంటు నష్టాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఒప్పందాలను రద్దు చేయడంతోపాటు కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ భారాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీ మాలకొండయ్య, జీ బాలకృష్ణ, ఎం ఆదినారాయణ, పాపని సుబ్బారావు, టీ వీరయ్య, కే రాజేశ్వరి, డీ ఏడుకొండలు పాల్గొన్నారు.

### బాస్కెట్‌బాల్ టీంకు రైజ్ విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు


ఒంగోలు విద్య, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేరళలోని కొట్టాయంలో జరగనున్న మహిళా బాస్కెట్ బాల్ పోటీల్లో జేఎన్‌టీయూకే యూనివర్సిటీ తరపున ఆడే 12 మంది టీంలో స్థానిక రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూపునకు చెందిన విద్యార్థిని ఎంపికయ్యారు. స్థానిక కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బాస్కెట్ బాల్‌కు ఎంపికైన బండి మంజును అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు మాట్లాడుతూ ఈసీఈ మూడవ సంవత్సరం చదువుతున్న మంజు ఈనెల 20నుంచి 24వతేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు, గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, రాగ చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్.హిమచంద్రరావు, ఎన్.సుబ్బారావులు అభినందించారు.

### ఎమ్మెల్సీ సాబ్జికి ఘన నివాళులు


సాబ్జికి నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఒంగోలు విద్య, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం శాసనమండలి సభ్యుడు దివంగత షేక్ సాబ్జి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి. వీరాంజనేయులు.. సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా శాసనమండలి సభ్యునిగా సాబ్జి ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడిన తీరును వివరించారు. ఈకార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్, రవి, ప్రతినిధులు ఐవీ రామిరెడ్డి, జీ ఉమామహేశ్వరి, ఎన్ చిన్నస్వామి, ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌వీ కొండారెడ్డి, కే నరసింహరావు, బ్రహ్మయ్య, ఆర్, నారాయణ, జీ హరిబాబు, మాలకొండయ్య పాల్గొన్నారు.

### 29న చిన్నారుల ఫ్యాషన్ హంట్


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈ నెల 29వ తేదీ చిన్నారుల కోసం ఫ్యాషన్ హంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సైనోస్యూర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మరియు, పీఆర్‌ఎం టి.సుజితశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆమె మంగళవారం స్థానిక అన్నవరప్పాడులోని ట్రినిటీ బెల్స్ స్కూల్‌లో ఇతర టీం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలి కార్యక్రమంగా 5 నుంచి 8 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు ఫ్యాషన్ షో పోటీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రథమ విజేతగా నిలిచిన వారికి 2025 లిటిల్ ఐకాన్ ట్రోఫీతో పాటు ప్రశంసాపత్రం, 2, 3 స్థానాలలో నిలిచిన వారికి రన్నరప్ ట్రోఫీ ఇస్తామన్నారు. వివరాలకు 9110787892 నెంబరులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ టీం సభ్యులు తుమ్మల చంద్రశేఖర్, హరికృష్ణ, భానుప్రకాష్, రేఖ, మమత, దివ్య, సురేఖ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు

ఒంగోలు క్రైం, డిసెంబరు17 ఆంధ్రజ్యోతి : జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా సెమీ క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా, పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం, ప్రధానకార్యదర్శి ఈదా సుధాకరరెడ్డి, నాయకులు పాలపర్తి విజేష్‌రాజ్, చందునాయక్, ఉద్దండి మల్లికార్జునరావు, మన్నం ప్రసన్నరాజు, విజేంద్ర పాల్గొన్నారు.

#### సంతనూతలపాడులో...

సంతనూతలపాడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిలారెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం రాత్రి సంతనూతలపాడు బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కేవీ క్రిష్ణారెడ్డి, ఎస్ క్రిష్ణయ్య, టి.సుబ్బారావు, డి.యలమందారెడ్డి, వెంకటేశ్వర్లు, అంజయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

## అవీ..ఇవీ

### పంట కాలువల అభివృద్ధికి నిధులు

● ఇరిగేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పూరార్ధనరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంభం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంభం చెరువు ఇరిగేషన్ కాలువల్లో పూడికతీతకు రూ.38.52లక్షలు నిధులు మంజూరయ్యాయని, పనులకు టెండర్లు పిలిచామని మార్కాపురం ఇరిగేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.పూరార్ధనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మురుగు వీడదు.. నీరు పారదు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. కాలువల్లో పెరిగిన గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు ప్రతి పాదనలు తయారు చేసి పంపగా రూ.38.52 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

### సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడి

● 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పుల్లలచెరువు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కాపు సారా కాస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మంగళవారం ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పెద్దపీఆర్‌సీ తాండ సమీపంలోని అటవీ ప్రాంతంలో బట్టీలపై దాడులు చేశారు. సారా కోసం నిల్వ ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రమాదం అంచున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


సప్లయ్ చానల్ అంచున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

గిద్దలూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నల్లబండ బజారులో సగిలేరు సప్లైఛానల్ పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదం అంచున ఉంది. ఒక వైపు సగిలేరు సప్లై ఛానల్, మరోవైపు మురుగునీటి డ్రైనేజ్ కాలువ కలిసే ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. నీటి ఉధృతికి మట్టి అంతా కిందికి ఒగిరిపోతున్నది. దాంతో దిమ్మె సైతం కాలువలోకి పడిపోయే ప్రమాదం పొంచియున్నది. దిమ్మె పడిపోతే దానిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కడ పేలిపోతుందోనని ఆప్రాంత వాసులు ఆందోళనకు గురవుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె చుట్టూ మట్టి ఒరిగిపోకుండా కట్టడం చేపట్టాలని ఆప్రాంత వాసులు కోరుతున్నారు.

### మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

● వేగ నియంత్రణ పాటించాలని పోలీసుల సూచన


సూచికబోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులలో ఉండే మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకొన్నాయి దీంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎర్రగొండపాలెం ఎస్ఐ పి. చౌడయ్య అధ్వర్యంలో మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని మలుపుల వద్ద వేగాన్ని తగ్గించాలని సూచించారు. పట్టణం నుండి హనుమాన్ జంక్షన్ వరకు 14 బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు పోలీసుల సూచనలు పాటిస్తూ సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

### పశుగణన 60 శాతం పూర్తి

● పశుసంవర్ధక శాఖ డీడీ రాఘవయ్య


పశుగణనను పరిశీలిస్తున్న డీడీ రాఘవయ్య

త్రిపురాంతకం, డిసెంబరు 17 ( ఆంధ్రజ్యోతి ) : ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన పశుగణన 60 శాతం పూర్తి అయినట్లు పశుసంవర్ధకశాఖ మార్కాపురం డీడీ కె.రాఘవయ్య అన్నారు. మండలంలోని సోమేపల్లిలో నిర్వహిస్తున్న పశుగణనను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం డివిజన్‌లో 3,10,232 కుటుంబాలు వారు పశుపోషణ చేస్తుండగా, ఇప్పటి వరకు 1,75,650 కుటుంబాలు పూర్తి చేసినట్లు తెలిపారు. పశుగ్రాస క్షేత్రాలు చేపట్టే రైతులకు 50 సెంట్ల భూమి ఉండాలన్నారు. ఎంతమంది రైతులు ఉన్నా, దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీ ఎస్.శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో ప్రమాదం

● ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

పెద్దదోర్నాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలేనికి చెందిన గుండుపల్లి శేషారావు, షేక్ నాగూర్ సాహెబ్‌కు కాళ్లు విరిగాయి. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం శేషారావు, నాగూర్ సాహెబ్ మోటారు సైకిలుపై శ్రీశైలం వెళుతున్నారు. చింతల వద్ద ఎదురుగా వస్తున్న కారు వేగం అదుపు తప్పి మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో వారు ఇరువురు కిందపడి గాయపడ్డారు. అదే సమయంలో సుండిపెంట నుంచి దోర్నాల వైపు వస్తున్న 108 అంబులెన్స్ వాహనం సిబ్బంది గమనించి క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్సలు నిర్వహించారు. పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

### సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు తోడ్పాటు

పెద్దదోర్నాల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు ఇవ్వనున్నట్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి తెలిపారు. దోర్నాల వ్యాపార దుకాణాలను మంగళవారం ఎంపీడీవో పరిశీలిచారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు నిర్వాహకుల అభిప్రాయాలు, లాభనష్టాలను తెలుసుకొని ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా పొందుపరిచారు. అంతేగాక చిన్న తరహా పరిశ్రమలకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వాలు తగిన నివేదికలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. వ్యాపారాలలో ఒడిదుడుకులకు లోను కాకుండా ప్రభుత్వాలు తగు సలహాలు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

# రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

● నాగులవరం రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ● పొదిలిలో సదస్సులను పరిశీలించిన జేసీ గోపాలకృష్ణ


అర్ధవీడు మండలం నాగులవరంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ పాలనలో నాయకుల దౌర్జన్యాలు, దాడులకు గురై తమ భూములు, స్థలాలు కోల్పోయిన రైతుల సమస్యలు పరిష్కరించేందుకే కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అర్ధవీడు మండలం నాగులవరంలో ఏర్పాటు చేసిన రెవెన్యూసదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలల కాలంలో 2 లక్షల అర్జీలు గ్రీవెన్స్ సెల్‌కు వస్తే వాటిలో 80వేలు అర్జీలు భూ సమస్యలకు సంబంధించినవేనన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులకు న్యాయం చేయాలనే ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారన్నారు. ప్రకాశం జిల్లాలో అత్యధిక భూసమస్యలు అర్ధవీడు మండలంలో ఉన్నట్లు గుర్తించిన కలెక్టర్ ఈ మండలంలో జరిగే రెవెన్యూ సదస్సులకు ప్రత్యేక అధికారిని నియమించారన్నారు. అర్ధవీడు మండలంలో అత్యధికంగా ప్రభుత్వ, చుక్కల, అసైన్‌మెంట్, పోరంబోకు భూములు అన్యాక్రాంత మయ్యాయన్నారు. పలువురు అనర్హులు ఈ భూములను స్వాధీనం చేసుకున్నారన్నారు. రైతులు వారి సమస్యలపై అర్జీలు ఇస్తే ఖచ్చితంగా సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ రెవెన్యూ సదస్సులో భూ అక్రమాలన్ని బయటకు వస్తాయన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్ధవీడు మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో నరసయ్య, డీటీ.ప్రసాద్, ఎంపీపీ వెంకటరావు, మాజీ ఎంపీపీ చేగిరెడ్డి కాశిరెడ్డి, సర్పంచ్ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

**రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి**

తర్లుపాడు : రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని రాగిసముద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 11 అర్జీలు వచ్చాయన్నారు. గ్రామసభల్లో ఇచ్చిన అర్జీలకు 45 రోజుల్లోగా పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, వీఆర్‌వోలు, సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : భూసమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలంగా వివిధ రకాల భూసమస్య లతో ఇబ్బందులు పడుతున్న రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, మండల సర్వేయర్ గురవయ్య, ఎండోమెంట్ అధికారులు, వీఆర్వోలు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, టీడీపి నాయకులు ఉలవాగోపి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మండలంలోని ఐనముక్కల గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలంటూ నలుగురు అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు కిన్నెర శాంతి తెలిపారు. పరిశీలించి త్వరలోనే అందజేయనున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో సర్వేయరు సురేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: గ్రామాలలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ కె చిరంజీవి తెలిపారు. మండలంలోని మాల్య వంతునిపాడు గ్రామంలో మం గళవారం అధికారులతో కలిసి రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ఈ సదస్సులో ప్రజల నుంచి వచ్చిన భూసమస్యల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ భూములను అక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. రోడ్లు, ప్రభుత్వ భూములను అన్యాక్రాతం చేస్తే వారి నుండి ఆ భూములను ప్రభుత్వం స్వాధీ నం చేసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తుంద న్నారు. ప్రజలు తమ భూ సమస్యలను పరిష్కరించుకు నేందుకు ఈ రెవెన్యూ సదస్సులను ఉపయోగించు కోవాలన్నారు. గ్రామస్థుల నుండి 19 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో సర్వేయర్ సంజీవయ్య, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**రెవెన్యూ సదస్సును సందర్శించిన సబ్ కలెక్టర్**

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని అమాని గుడిపాడు గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మంగళవారం సందర్శించారు. ప్రజల నుంచి ఆర్జీలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసిందన్నారు. ఈ సదస్సును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొత్తం 36 ఆర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఏ బాలకిషోర్ తెలిపారు. కార్యక్రమంలో విఆర్వో బి మోహన్ రావు, మాజీ ఎంపీటీసీ చిట్యాల వెంగళ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాల్యవంతునిపాడులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు, పొదిలిలో మాట్లాడుతున్న జేసీ

# ఇందిరమ్మ కాలనీల అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులో గతంలో నిరాదరణకు గురైన ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2ను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇందిరమ్మ ఫేజ్-2 కాలనీలో మంగళవారం సాయంత్రం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఫేజ్-2ను ప్రారంభించారన్నారు. సుమారు 16 సంవత్సరాలు కావస్తున్నా కాలనీలో మౌలిక వసతులు కూడా లేవన్నారు. ముఖ్యంగా నీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే వదిలేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలనీ గురించి పట్టించుకున్న పాపానపోలేదన్నారు. చాలామంది కాలనీ దుస్థితిని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. గత నెలచివర్లో తాను అధికారులతో కలిసి కాలనీలో పర్యటించానన్నారు. కాలనీని ఎలాగైనా అభివృద్ధి చేయాలని తాను ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి సమస్యలను తెలియజేశారన్నారు. ప్రధానంగా బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిన ఇళ్లకు నూతన స్కీమ్‌ల ద్వారా బిల్లులు ఇవ్వాలని కోరాన న్నారు. బేస్‌మెంట్‌స్థాయిలో గృహాలు నిలిచి పోయిన లబ్ధిదారులు గతంలో తీసుకున్న బిల్లులు తిరిగి చెల్లిస్తే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. గతంలో బేస్‌మెంట్ నిర్మాణానికి రూ.16 నుంచి రూ.25 వేల వరకు బిల్లులు పొందారన్నారు. వాటిని తిరిగి చెల్లిస్తే వెంటనే నూతన నిర్మాణాలను ప్రారంభించుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఇందిరమ్మ ఫేజ్-2 కాలనీలో బేస్‌మెంట్‌స్థాయిలో నిలిచిపోయిన నిర్మాణాలు 267 ఉన్నాయన్నారు. అదేవిధంగా రూఫ్ లెవల్‌లో నిలిచిపోయిన గృహాలు 90, శ్లాబ్ పూర్తిచేసుకున్న నిర్మాణాలు 531 ఉన్నాయన్నారు. వీరందరూ కొద్దిపాటి వ్యయం భరిస్తే నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. వీరిలో స్వయం సహాయక సంఘాలలో ఉన్న వాళ్లకు రూ.35 వేలు రుణం మెప్మా అధికారులు ఇస్తారన్నారు. ఆ మొత్తాన్ని వాయిదాల్లో చెల్లించుకోవచ్చన్నారు. ముఖ్యంగా కాలనీకి చెన్నరాయునిపల్లి నుంచి బీటీ రహదారిని నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయించానన్నారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.43 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఆ నిధులతో కాలనీని సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. లబ్ధిదారులు తప్పకుండా గృహాలు నిర్మించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, హౌసింగ్ డీఈ ఎ.పవన్‌కుమార్, టౌన్ ఏఈ సాయిచంద్, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లిఖార్జున్, మాలపాటి వెంకటరెడ్డి, కనిగిరి బాలవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### వెంకటసుబ్బారావు సేవలకు గుర్తింపు

● వాసవీక్లబ్ అడ్మినిస్ట్రేటివ్ వైస్‌ప్రెసిడెంట్‌గా పదవీ బాధ్యతలు


వెంకటసుబ్బారావు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ కో ఆపరేటివ్ అడ్మిన్‌స్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గా పట్టణానికి చెందిన గోళ్ళ వెంకట సుబ్బారావు ఎన్నికైయ్యారు. 2002 సంవత్సరం నుండి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతు అందరి మన్ననలు పొందారు. ఈ నేపథ్యంలో ఇంటర్నేషనల్ వాసవీక్లబ్ కో-ఆపరేటివ్ అడ్మిన్‌స్ట్రేటివ్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ సుబ్బారావు ఎన్నికైనట్లు తెలిపినట్లు గోళ్ల సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇరుకుల రామకృష్ణకు తోటి సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ ఎన్నికైన గోళ్ల సుబ్బారావును పలువురు నాయకులు, వాసవీక్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

### సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఏవో

మార్కాపురం రూరల్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి). రైతులు సాగుచేసిన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు సూచించారు. మండలంలోని గోగులదిన్నె, రాయవరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులతో కలిసి నిర్వహించారు. ఆ గ్రామాలలో రైతులు సాగుచేస్తున్న మిరప, మొక్కజొన్న, శనగ తదితర పైర్లను పరిశీలించి రైతుసేవా కేంద్రాలలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మిరపలో రసం పీల్చే పురుగుల నివారణ చర్యలను వివరించారు. కందిలో మారుకా మచ్చ పురుగు దాని నివారణ చర్యల గురించి తెలియజేశారు. రైతులు రబీలో సాగు చేసిన పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది శివకుమార్, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

# సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి**

కంభం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దేశ సైనికుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మాజీ సైనికుల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. దేశరక్షణ కోసం ప్రాణాలకు తెగించి నివాళులు అందించే సైనికులు ఉండడం గిద్దలూరు నియోజకవర్గానికే గర్వకారణమన్నారు. ఇటీవల కాలంలో జమ్మూలో తాను ప్రాణాలో కోల్పోతానని తెలిసి కూడా మరో 30 మంది జవాన్ల ప్రాణాలు కాపాడిన అమరవీరుడు రావిపాడు గ్రామానికి చెందిన వరికుంట్ల వెంకట సుబ్బయ్య అన్నారు. ఆయన ప్రాణత్యాగం దేశానికే గర్వకారణమన్నారు. జిల్లాలోనే అత్యధికంగా గిద్దలూరు నియోజకవర్గంలో సైనికులు ఉన్నారన్నారు. వారి అభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి రజనికుమారి మాట్లాడుతూ మాజీ సైనికులకు సంబంధించిన అనేక ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల నియోజకవర్గం నాయకులు పుల్లయ్య, పోలయ్య, ప్రసాద్, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

**జూనియర్ కళాశాల సందర్శన**

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మంగళవారం సాయంత్రం కంభం జూనియర్ కళాశాలను, ఆటస్థల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆటస్థల ప్రాంగణం మిని స్టేడియంగా రూపొందించడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ హెచ్‌ఎంలు, సిబ్బంది కళాశాల పరిస్థితిని వివరించి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

గిద్దలూరు టౌన్ : నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన తుఫాన్ల కారణంగా గిద్దలూరు నియయోజకవర్గంలో రైతులకు జరిగిన పంటనష్టంపై మంగళవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఏఏ మండలాలో ఎంతవరకు పంట నష్టం జరిగింది, ఏఏ పంటలు నీట మునిగాయని అధికారులను అడిగారు. ప్రతి గ్రామంలో పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి పంట దెబ్బతిన్న ప్రతి ఎకరాకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవడమే ఎన్‌డీఏ ప్రభుత్వం బాధ్యతని పేర్కొన్నారు. గ్రామాల్లోని రైతులకు వ్యవసాయాధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడి పథకాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియ చేస్తూ అధిక దిగుబడులు వచ్చే పంటలను సాగు చేసుకునేలా రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీనాయక్, వ్యవసాధికారులు విజయ భాస్కర్‌రెడ్డి, రఫిక్, మెర్సీ, స్వరూపా, మొహమ్మద్, రాజశ్రీ, విష్ణుప్రియ, శ్వేత, మహబూబ్‌భాషా పాల్గొన్నారు.

### మిర్చి పైరులో నల్లనల్లి నివారణకు సూచనలు


మిరపతోటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తర్లుపాడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చిపై నల్లనల్లి ఉధృతంగా ఉందని, దీని నివారణకు వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు, సీతా నాగులవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మిర్చి, కంది, శనగ పంటలను పరిశీలించారు. ప్రస్తుతం మిర్చి పంటపై నల్లనల్లి ఉధృతంగా ఉండటంతో ముడత ఎక్కువగా వచ్చిందని, శనగ పంటపై కూడా పచ్చపురుగు వ్యాపించిందని, వెంటనే రైతులు మిర్చి, కంది, శనగ పంటల తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు భోపాల్, శంకర్, భార్గవి, రైతులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా వీఆర్‌వోల సంఘం అధ్యక్షులు వై.పీ.రంగయ్య ఆధ్వర్యంలో గిద్దలూరు మండల వీఆర్‌వోల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా నిర్వహించారు. అధ్యక్షులుగా అరిగెల వెంకటరామయ్య, ఉపాధ్యక్షులుగా అనురాజుల లక్ష్మీదేవి, కార్యదర్శిగా బిజ్జం రాజశేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దూదేకుల ఖాశింవలి, కోశాధికారిగా సూరా ఈశ్వర్‌రెడ్డి, ఆర్గనైజర్లుగా కొండయ్య, రమణ, రామయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### కరపత్రాల విడుదల

గిద్దలూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎఫ్‌ఐ, యూటీఎఫ్ సంయుక్తంగా 10వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయిలో నిర్వహించనున్న ప్రతిభ పరీక్ష కరపత్రాలను మంగళవారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విడుదల చేశారు. పాఠశాల హెచ్‌ఎం పోలా నాగభూషణ్‌రెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం ఎం.రాంభూపాల్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్, పట్టణ కార్యదర్శి తేజ తదితరులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 22న ఉదయం 10గంటలకు పట్టణంలోని సాయిచైతన్య డిగ్రీ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులు ప్రజ్ఞ వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజు రూ.30 ఉంటుందన్నారు. 10వ తరగతి అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయన్నారు. మండల స్థాయి విజేతలకు జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. జిల్లాస్థాయి విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికేట్లు అందచేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్ తెలిపారు.

### గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యం : ఎంపీడీవో

మార్కాపురంరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సుస్థిరా భివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పారిశుధ్యం, తాగునీటి, మౌలికవసతుల కల్పనకు ప్రణాళికలు తయారుచేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. గ్రామాలలో లింగవివక్షత, బాల్యవివాహల నిర్మూలన అంశాలపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. శిక్షణ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం డి.పిచ్చయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, పీఎస్ పెద్దిరాజు, వైద్యులు శిక్షకులుగా వ్యవహరించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు పాల్గొన్నారు.

### విద్యుత్ ఆదా చేసే ఉపకరణాలను వినియోగించాలి

● డీఈ శ్రీనివాసరావు సూచన


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసరావు

పొదిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తక్కువ విద్యుత్ వినియోగంతో ఎక్కువ పనితనాన్ని ఇచ్చే ఉపకరణాలను ఇళ్లలో వినియోగించాలని విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసరావు అన్నారు. జాతీయ ఇంధనపొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యుత్ ఉత్పత్తికి మూలమైన బొగ్గు, డీజిల్ వంటి వాటి వినియోగాన్ని తగ్గించాలన్నారు. తద్వారా కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఫైవ్‌స్టార్ రేటెడ్ గృహోపకరణాలను వినియోగించాలన్నారు. అవసరం లేనిచోట లైట్లు ఆపేయాలన్నారు. విద్యుత్ పొదుపును పాటించి భావితరాలకు వెలుగునిద్దామన్నారు. ముఖ్యంగా ఇంటిపై సోలార్‌ప్లేట్‌లను బిగించుకునేందకు కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ బిజిలీ యోజన పథకం కింద ఒక కిలోవాట్‌కు రూ.30వేలు రాయితీ ఇస్తోందన్నారు. అత్యధికంగా 3 కేవీ వరకు రూ.78వేలు రాయితీ పొందవచ్చన్నారు ఈ పథకాని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరీమున్ బీబీ, పొదిలి డీఈ హరిబాబు, ఏఈ మోహన్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### 29న చిన్నారుల ఫ్యాషన్ హంట్


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈ నెల 29వ తేదీ చిన్నారుల కోసం ఫ్యాషన్ హంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సైనోస్యూర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మరియ, పీఆర్‌ఎం టి.సుజితశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆమె మంగళవారం స్థానిక అన్నవరప్పాడులోని ట్రైనీ బెల్స్ స్కూల్‌లో ఇతర టీం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలి కార్యక్రమంగా 5 నుంచి 8 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు ఫ్యాషన్ షో పోటీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రథమ విజేతగా నిలిచిన వారికి 2025 లిటిల్ ఐకాన్ ట్రోఫీతో పాటు ప్రశంసాపత్రం, 2, 3 స్థానాలలో నిలిచిన వారికి రన్నరప్ ట్రోఫీ ఇస్తామన్నారు. వివరాలకు 9110787892 నెంబరులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ టీం సభ్యులు తుమ్మల చంద్రశేఖర్, హరికృష్ణ, భానుప్రకాష్, రేఖ, మమత, దివ్య, సురేఖ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### 21, 22 తేదీల్లో హెచ్‌ఎంలకు అకౌంట్ టెస్ట్‌లు

ఒంగోలు విద్య, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని గాంధీజీ మునిసిపల్ హైస్కూలులో ఈనెల 21, 22 తేదీల్లో ప్రధానోపాధ్యాయులకు అకౌంట్ టెస్ట్ పరీక్ష జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మంగళవారం ముండ్లమూరులోని ఎన్ఎస్‌పీ డీఈ కార్యాలయం వద్ద మోదేపల్లి మేజరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన వేముల బండకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కంచుమాటి శ్రీనివాసరావుకు నియామక పత్రం అమె చేతుల మీదుగా అందజేశారు. వైస్‌చైర్మన్‌గా శంకరాపురం గ్రామానికి చెందిన వట్టికొండ కోటేశ్వరరావుకు అందజేశారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సాగర్ కాలువల ఆధునీకరణకు నిధులు కేటాయించి చివరి భూములకు సైతం నీరందించారని చెప్పారు. ఆతరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలివేసిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి సంఘాలను పటిష్టపరచి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన చరిత్ర మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కంచుమాటి శ్రీనివాసరావు రైతుల సంక్షేమానికి పాటుపడి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, దర్శి నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, కోడెగ మస్తాన్‌రావు, సుంకర రాఘవరెడ్డి, సర్పంచ్‌లు కూరపాటి నారాయణస్వామి, గజ్జల సుబ్బారెడ్డి, చిమ్మిలి కోటేశ్వరమ్మ, ఆదిలక్ష్మి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు మేదరమెట్ల వెంకటరావు, డీఈ పూర్ణచందు, జేఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నీటి సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలి**

దర్శి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలు సమర్థవంతంగా పనిచేసి ఆరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సూచించారు. నూతనంగా ఎన్నికైన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కాలువల మరమ్మతులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవటంతో అధ్వానంగా మారాయన్నారు. తద్వార ఆయకట్టు భూములకు నీరందక రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం, సాగునీటి రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే ఉద్దేశంతో వడివడిగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అందులోభాగంగా నీటి సంఘాల అధ్యక్షుల ఎన్నికలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ల ఎన్నికలు నిర్వహించినట్టు చెప్పారు. చివరి ఆయకట్టు భూములకు కూడా సంవృద్ధిగా నీరందేలా నీటి సంఘాల అధ్యక్షులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: ఉగ్రను సన్మానిస్తున్న నీటి సంఘం అధ్యక్షుడు అశోక్ తదితరులు

**ఆయకట్టు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి**

పామూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడు రిజర్వాయర్, ఆయకట్టు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. మోపాడు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని నెల్లూరు జిల్లా కొండాపురం నీటిసంఘం అధ్యక్షుడు దాసరి అశోక్, టీడీపీ నాయకులు కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్రను శాలువాతో సన్మానించారు. నీటి సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన దాసరి అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



దర్శి: డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లను అభినందిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, నారపుశెట్టి పాపారావు తదితరులు

**రైతు సంక్షేమానికి ప్రాధాన్యం**

కురిచేడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. కురిచేడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఉన్నగిరి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా బొల్లేపల్లి కనకయ్యను ఎన్నుకున్నారు. మంగళవారం సాయంత్రం కురిచేడు ఎన్నెస్పీ కాలనీలో జరిగిన సన్మాన కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య అధ్యక్షత వహించారు. డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల కాలంలో చంద్రబాబు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. తనను నాన్‌లోకల్ అన్నారని నేను దర్శిలోనే ఉంటున్నానని చెప్పారు. మీరు గెలిపించిన ఎమ్మెల్యే దర్శిలో ఉంటున్నారా అని ప్రశ్నించారు. అభివృద్ధే పరమావధిగా తాను పనిచేస్తున్నట్లు చెప్పారు. నూతనంగా ఎన్నికయిన సాగునీటి సంఘం చైర్మన్‌లు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు కడియాల లలిత్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు ఏకగ్రీవం

దర్శి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దర్శి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ల ఎన్నిక మంగళవారం జరిగింది. దర్శి-1 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గా రజానగరం నీటి సంఘం అధ్యక్షుడు సందాడి సుబ్బారావు, వైస్‌చైర్మన్‌గా ఉల్లగల్లు నీటి సంఘం అధ్యక్షుడు వలేటి చలపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దర్శి-2 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా రాజంపల్లి నీటి సంఘం అధ్యక్షుడు కామిరెడ్డి వెలిగొండారెడ్డి, వైస్ చైర్మన్‌గా నిప్పట్లపాడు నీటి సంఘం అధ్యక్షుడు మన్నెం శేషయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దర్శి ఎన్ఎస్‌పీ కార్యాలయం వద్ద ఈ ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయి. ఎన్ఎస్‌పీ ఎస్సీ వరలక్ష్మి ఎన్నికల నిర్వహణను పరిశీలించారు.

## డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్‌గా శివనాగిరెడ్డి

తాళ్లూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-2 మైనర్ కాలువ చైర్మన్ తూము శివనాగిరెడ్డి చీమకుర్తి-1 డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం చీమకుర్తిలో జరిగిన కార్యక్రమంలో చీమకుర్తి-1 డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా దొడ్డా వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా శివనాగిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి మాట్లాడుతూ తనను డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్‌చైర్మన్‌గా నియమించటం పట్ల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఈపంట నమోదు చేసుకోవాలి

దొనకొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పెద్దన్నపాలెం, గంగదేవిపల్లి రైతు సేవాకేంద్రాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈపంటలో నమోదైతేనే బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, కొనుగోలు కేంద్రాలలో పంటల అమ్ముకోవటానికి వీలవుతుందన్నారు. ఈసందర్భంగా కంది, మిరప పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అరుణాదేవి, వీణాకుమారి, రైతులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పామూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేవిధంగా అధికారులు కృషి చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరత అభివృద్ధి, లక్ష్యాలపై మండలస్థాయి అధికారులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, ఏవో కె.రాధ, ఉద్యానశాఖ హెచ్‌వో కె.కుసుమ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ యాదాల రమేష్, ఏపీవో బి.మాల్యాద్రి, కార్యాలయ పరిపాలనాధికారి ఎస్.చెన్నకేశవరెడ్డి, మండల సర్వేయర్ స్నేహ, తదితరులు పాల్గొన్నారు.

## చేపల పెంపకానికి అవకాశం ఇప్పించరూ!

కనిగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి చెరువులో చేపల పెంపకానికి అవకాశం కల్పించాలని మత్స్యకార కుటుంబాలు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని కలసి అభ్యర్థించారు. తమకు జీవనోపాధి కింద కనిగిరి పెద్దచెరువులో చేపలు పెంచుకుని, అమ్ముకునేలా చూడాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. చెరువుల్లో చేపలు పెంచుకుని జీవించే హక్కు మీకే ఉందని, ఎలాంటి అక్రమార్కులకు తావు ఉండదన్నారు.

# రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలు పరిష్కారం



కురిచేడు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రజనీకుమారి

ముండ్లమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలను పరిష్కరిస్తున్నట్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని తూర్పుకంభంపాడులో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామన్నారు. భూముల సరిహద్దులు, రికార్డుల్లో తప్పులు ఉంటే వెంటనే సరిచేస్తున్నట్టు చెప్పారు. ఇనాం, వాగు పోరంబోకు, పశువుల మేత పోరంబోకు లాంటి సమస్యలు మాత్రమే జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళితే పరిష్కరించటం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ సమస్యలపై 12 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఏ.స్రవంతి, మండల సర్వేయర్ కోటంరాజు, వీఆర్‌వోలు సుజాత, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



కనిగిరి: భూసమస్యలపై అర్జీలను అందజేస్తున్న రైతులు

**కురిచేడులో పది అర్జీలు**

కురిచేడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రజనీకుమారి అన్నారు. మంగళవారం పెద్దవరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు సమస్యలను గ్రామస్థులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా తమ జీవాలు, గేదెలు మేతకు వెళ్ళాలంటే దారి ఇవ్వడం లేదని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ సభలో పది అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, వీఆర్వోలు నక్కా పిచ్చయ్య మారెళ్ళ కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

**రైతుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం**

పామూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తహసీల్దార్ బీవీ రమణారావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఇనిమెర్లలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రైతులకు చెందిన రికార్డులను పరిశీలించి సత్వరమే న్యాయం జరిగేలా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా 58 అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ బి.మల్లికార్జునరావు, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్వో మండ్ల శ్రీనివాసులు, దేవదాయశాఖ ఈవో నరసింహాబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు, టీవీకే సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

**రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి**

కనిగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాళ్ళూరు గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో భూ సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సమర్పించిన అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, కేవీఎస్ గౌడ్, దశరథరామిరెడ్డి, స్వామిరెడ్డి, కోటేశ్వరరావు, మధు, రామిరెడ్డి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా రోడ్డు మలుపులు

» హెచ్చరిక బోర్డులులేక వాహనచోదకుల అవస్థలు

» పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారుల్లో మూలమలుపులు మృత్యువుకు పిలుపులుగా మారాయి. వాహనచోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వేంపాడు నుంచి ఈదర వెళ్ళే ప్రధాన రహదారి పై మలుపు

మండలంలోని వేంపాడు నుంచి ఈదర వెళ్ళే ప్రధాన రహదారిపై ఆరు చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, భీమవరం, బొప్పూడివారిపాలెం వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై మలుపులు ఉన్నాయి. మారెళ్ళ నుంచి వేంపాడు వచ్చే ఆర్అండ్‌బీ రహదారిపై మూడు మలుపులు ఉన్నాయి. నూజెండ్లపల్లి నుంచి మారెళ్ళ వెళ్ళే రహదారిపై నాలుగు చోట్ల మలుపులు ఉన్నాయి. పెద ఉల్లగల్లు నుంచి వేముల వెళ్ళే రహదారి, ముండ్లమూరు నుంచి సింగనపాలెం వెళ్ళే ఆర్అండ్‌బీ రహదారిపై పలుచోట్ల మలుపులు ఉన్నాయి.

ఈరహదారులపై ప్రయాణించేసే వాహనచోదకులు మలుపులను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రుల సమయాల్లో మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. వేంపాడు నుంచి ఈదర వెళ్ళే రహదారిపై గత ఏడాది నుంచి ఇప్పటివరకు పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి మీద ఉన్న మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

# రైతులు అప్రమత్తంగా ఉండాలి



పూతమీద ఉన్న కందిపైరు

పీసీపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తలకొండపాడు, చింతగుంపల్లి గ్రామాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుమూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొందన్నారు. ఈ సమయంలో రైతులు వరికోతలను వాయిదా వేసుకోవాలన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి పంటలు దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు. ఏవో ప్రకాశరావు మాట్లాడుతూ రబీ సాగుచేసిన పంటలన్నింటినీ ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈక్రాప్ చేయించుకున్న రైతులంతా ప్రధానమంత్రి పసల్‌బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కల్యాణ్, రసూల్ పాల్గొన్నారు.

**వర్షం కురిస్తే మరింత నష్టం**

కురిచేడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో కనిపిస్తున్న మార్పులతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. మండలంలో ప్రధానంగా కంది పంట పూత దశలో ఉంది. వర్షం కురిస్తే పూత రాలిపోయే ప్రమాదం ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే పొగాకు రైతులూ నష్టపోయే ప్రమాదం ఉంది. కోత దశలో ఉన్న వరి గింజ రాలిపోతుందని భయపడుతున్నారు. ఈ అల్పపీడన ప్రభావం కోస్తా జిల్లాలకు ఎక్కువగా ఉంటుందని, మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తామనే ప్రకటనలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

# విశ్రాంత ఉద్యోగులకు సంపూర్ణ సహకారం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు అన్నివిధాలుగా సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన విశ్రాంత ఉద్యోగుల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లకు సంబంధించిన అరియర్స్ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పెన్షనర్లకు సంబంధించి ఇళ్ల స్థలాలు, భూ సమస్యలను పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. పెన్షనర్లకు ఇళ్ళ స్థలాలు ఇప్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కనిగిరి నియోజకవర్గంలో పెన్షనర్ల జాబితా అందజేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను పెన్షనర్లు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ గఫార్, పెన్షనర్ల సంఘం నాయకులు నరసింహారావు, ముక్కు వెంకటరెడ్డి, చెన్నయ్య, నాగభూషణం, ప్రసాద్‌రెడ్డి, గౌస్ మొహిద్దీన్, ఎర్రారెడ్డి, పెద్దిరెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

పీసీపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విధులకు డుమ్మా కొట్టడంతో పాటు సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో ప్రభాకరశర్మ మంగళవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. సోమవారం చినవరిమడుగు, వెంగళాయపల్లి, చింతగుంపల్లి, పెదయిర్లపాడు సచివాలయాలను 'ఆంధ్రజ్యోతి' సందర్శించింది. ఆయా సచివాలయాల్లో కొంతమంది ఉద్యోగులు సమయపాలన పాటించడంలేదని వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఆయా సచివాలయాల్లో విధులకు హాజరుకాని ఉద్యోగులతో పాటు సమయపాలన పాటించనివారు షోకాజ్ అందిన వెంటనే స్వయంగా ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి సంజాయిషీ ఇవ్వాల్సిందిగా నోటీసులో పేర్కొన్నారు. దీనిపై స్పందించని ఉద్యోగులపై తమవద్ద ఉన్న ఆధారాలను బట్టి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లిస్తాం!



రైల్వే లైన్ భూములను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణయ్య

పామూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్ భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణయ్య తెలిపారు. మండలంలోని రావిగుంటపల్లి, నర్రమారెళ్ల గ్రామాల్లో అదనపు భూసేకరణ నిమిత్తం మంగళవారం ఆయన పర్యటించారు. ఇనిమెర్లలో సర్వే నెంబర్ 640, 644/1, 987/1 లలో రైల్వేలైన్ నిర్మాణం కోసం అదనపు భూమి కోసం 4.91 ఎకరాల భూమిని గుర్తించారు. ఈసందర్భంగా తమకు మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు జేసీని కోరారు. మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం ఇస్తామని, అభివృద్ధి కార్యక్రమాలకు రైతులు సహకరించాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్వోలు శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

## విద్యుత్ బకాయిలను వెంటనే వసూలు చేయాలి



ముండ్లమూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసులు

ముండ్లమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని ఈఈ పాలగిరి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పెండింగ్ బకాయిల జాబితాను పరిశీలించారు. దాదాపు కోటి రూపాయల మేర బకాయిలు ఉన్నాయన్నారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఎక్కువ బకాయిలు ఉన్నట్టు చెప్పారు. వరుసగా మూడు నెలల పాటు బిల్లులు చెల్లించని వినియోగదారులుంటే కనెక్షన్ తొలగించాలని ఆదేశించారు. మండలంలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ అంకబాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సాంబయ్య, లైన్‌మెన్‌లు అంజనేయులు, నాయక్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ కార్యవర్గం

కురిచేడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు కరిముల్లా వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో నూతన అధ్యక్షుడిగా బి.బాలానాయక్‌ను, కార్యదర్శిగా నిమ్మకాయల గోపిని ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు.

## రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు

తాళ్లూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం మన్నేపల్లి, దారంవారిపాలెం, తురకపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కల్లాలోని ధాన్యాన్ని పరిశీలించి నిల్వలకు తగిన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏ సుధీర్, ఆనగ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లను పరిశీలించిన అధికారులు

తాళ్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపట్టారా, లేదా కొలతలు తీసి పరిశీలించారు. శివరాంపురం గ్రామంలో పూర్తయిన సీసీ రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి టి.బంగారు బాబు, ఏఈ వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవా, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పీసీపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేయడం అభినందనీయమని తహసీల్దార్ సీహెచ్ ఉష అన్నారు. స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయుడు షేక్ అబ్దుల్ సుభాన్, పోలు కొండారెడ్డి, గోపిరెడ్డి మల్లికార్జున, జి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం మండలం సి.నాగులారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హస్తి వీరాంజనేయులు సహకారంతో యూటీఎఫ్ మోడల్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని హెచ్‌ఎం ఎం.కమల అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ పాదుషా, ఎం.శ్రీనివాసరాజు, జెవెంకట్రావు, బీవీఎస్ రమేష్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి

దొనకొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి అని కంభం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అలీ పేర్కొన్నారు. అయితే, విధులు నిర్వర్తించే ప్రాంతాల్లో బాధ్యతగా పనిచేస్తూ ప్రజల్లో మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. స్థానిక పోస్టల్ శాఖలో పనిచేస్తూ పదోన్నతి పొంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న లక్ష్మీకాంత్, మురళీకృష్ణ, మణిలకు పోస్టల్ కార్యాలయంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ముగ్గురు ఉద్యోగులు ఇప్పటివరకు వారు పనిచేసిన ప్రాంతాల్లో క్రమశిక్షణ, పట్టుదలతో పనిచేసి ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నారని అన్నారు. పదోన్నతిపై వెళ్లే ప్రదేశంలో కూడా ఇంతకన్నా రెట్టింపు పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పోస్టల్ శాఖ ఉద్యోగులు, టీడీపీ నాయకులు షేక్ తోహీద్, మోడి అంజనేయులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్నాతకోత్సాహం



మంగళగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేరింతలు.. వారి కుటుంబసభ్యులు, తల్లిదండ్రుల ఆనందోత్సాహాలు.. అతిరథులకు స్వాగత సత్కారాల మధ్య మంగళవారం మంగళగిరి ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాధారణంగా స్నాతకోత్సవాలకు గవర్నర్ చాన్సలర్ హోదాలో పాల్గొంటారు. అయితే ఏకంగా రాష్ట్రపతి హాజరుకావడంతో ఈ వేడుకకు విశేషమైన ప్రాధాన్యం ఏర్పడింది. ఎయిమ్స్ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖమంత్రి జేపీ నడ్డా హాజరుకావాల్సి ఉండగా ఆ స్థానంలో ఆ బాధ్యతలను కేంద్ర ఆయుష్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావుజాదవ్ నిర్వర్తించారు. జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి నలుగురు విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఓవరాల్ అకడమిక్ టాపర్‌గా కేరళకు చెందిన లియా అజీ, బెస్ట్ మేల్ టాపర్‌గా ఏపీకి చెందిన దాసరి దివ్యాంశ్, బెస్ట్ ఫిమేల్ టాపర్‌గా పంజాబ్‌కు చెందిన సుప్రభసింహా, బెస్ట్ ఇంటర్నషిప్‌గా కేరళకు చెందిన వీకే అధీరా ప్రభృతులు బంగారు పతకాలను అందుకున్నారు. 47 మంది ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు, మరో నలుగురు పోస్ట్ డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులకు కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్‌జాదవ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో కలిసి

(మిగతా 6వ పేజీలో)



వేడుకకు హాజరైన వైద్య విద్యార్థులు, కుటుంబసభ్యులు

- సంబరంగా ఎయిమ్స్ స్నాతకోత్సవం
- విద్యార్థులకు పట్టాలు అందజేసిన రాష్ట్రపతి
- మహిళా వైద్యుల శాతంపై ద్రౌపదిముర్ము హర్షం
- వైద్యులు చిత్తశుద్ధితో సేవకు ప్రాధాన్యమివ్వాలన్న రాష్ట్రపతి
- కేంద్ర సహాయమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి సమక్షంలో వేడుక
- ఎయిమ్స్‌లో ఇకపై మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వం: చంద్రబాబు



స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రకాష్‌రావు జాదవ్, లోకేశ్, సత్యకుమార్ యాదవ్



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న సీఎస్ నీరబ్‌కుమార్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, కలెక్టర్ నాగలక్ష్మి



అభిషేకాల అనంతరం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకారం

## త్రికోటేశ్వరునికి మహారుద్రాభిషేకం

- జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు

కోటప్పకొండ (నరసరావుపేట), డిసెంబరు 17 : ఆరుద్రోత్సవం సందర్భంగా కోటప్ప కొండ త్రికోటేశ్వర స్వామికి మహారుద్రాభిషేకాలు సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళ వారం తెల్లవారు జాము వరకు నేత్ర పర్వంగా జరిగాయి. వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామిని అభిషేకించారు. ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, విభూది, గంధం, కుంకుమ, తైలం, సుగంధ ద్రవ్యాలు, ఫలాలతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. స్వామికి అన్నాభిషేకం వైభవంగా జరిగింది. అర్ధరాత్రి పాత కోటేశ్వర స్వామి దేవాలయం వద్ద కర్పూర జ్యోతి దర్శనం చేసుకొని భక్తులు పులకించి పోయారు. ఉదయం ఆలయ యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర హోమాలు ఘనంగా జరిగాయి. జ్యోతి దర్శనం అనంతరం మేధా దక్షణామూర్తి స్వాములు దీక్ష విరమించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు పర్యవేక్షించారు.



రోడ్డు పక్కన ఆరబోసిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తుతున్న రైతులు

## చిరుజల్లులతో.. వణుకు

- ఆందోళనతో అన్నదాతల పరుగులు
- ధాన్యాన్ని భద్రపరుచుకుంటోన్న రైతులు

రేపల్లె, కర్లపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూర్పిళ్లు చేసి ఆరబెట్టుకున్న రైతులను చిరుజల్లులు పరుగులు పెట్టిస్తున్నాయి. వరికోతలు ముంచుకొస్తున్న తరుణంలో బంగాళాఖాతంలో వాయుగుండంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే చాలాదగ్గర్ల యంత్రాలతో కోతలు జరగ్గా ఆ ధాన్యాన్ని రైతులు పొలాలు, సమీపంలోని రహదార్లపై ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం వర్షం పడటంతో ధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు రైతులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. వాయుగుండం నట్టేట ముంచేస్తుందని రైతులు కంటిమీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కర్లపాలెం మండలంలో అక్కడక్కడ చిరుజల్లులు కురియడంతో ధాన్యం రాశులపై కొందరు రైతులు పట్టాలు కప్పగా, మరికొందరు బస్తాలకు ఎక్కించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎచ్చిపచ్చిగా ఉన్న పనలను సైతం కుప్పలుగా వేశారు. వారం రోజులు వర్షం లేకుంటే పంటంతా ఇంటికి చేరుతుందని రైతులు తెలుపుతున్నారు.

## కొండను తవ్వేస్తున్నారని కన్నెర్ర

- తవ్వకాలను అడ్డుకున్న కొర్రపాటివారిపాలెం మహిళలు
- పరిశీలించి అనుమతులు లేవని తేల్చిన మైనింగ్ అధికారులు

అద్దంకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండను తవ్వేస్తూ గ్రావెల్‌ను తరలిస్తున్నారని తాళ్లూరు మండలంలోని కొర్రపాటివారిపాలెం మహిళలు మంగళవారం తవ్వకా లను అడ్డుకున్నారు. విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం పేరుతో కొర్రపాటివారిపాలెం సమీపం లోని కొండ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. నెలరోజుల క్రితం కొర్రపాటివారిపాలెం రైతులు అడ్డుకోవడంతో గ్రావెల్ తరలింపును నిలిపేశారు. మళ్లీ నాలుగు రోజులుగా గ్రావెల్ తరలిస్తున్నారు. దీంతో కొర్రపాటివారిపాలెం గ్రామస్థులు సోమవారం మూకుమ్మడిగా వచ్చి అడ్డుకున్నారు. అయినా తాళ్లూరు పోలీసుల అండతో మరలా గ్రావెల్ తరలింపు ప్రారంభించగా మంగళవారం మహిళలు కొండ వద్దకు చేరుకుని గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు. పశువులు, జీవాలు మేతకు ఆధారంగా ఉన్న కొండ నుంచి ఎట్టి పరిస్థితుల్లో గ్రావెల్ తరిలింపునకు వీలులేదన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న మైనింగ్ అధికారులు

అద్దంకి మండల పరిధిలోని కొండ వద్ద తాళ్లూరు మండల పోలీసుల హడావుడి ఏమిటని ప్రశ్నించారు. గ్రామస్థుల ఆందోళన.. ఆంధ్ర జ్యోతిలో కథనంతో మంగళవారం బాపట్ల నుంచి వచ్చిన మైనింగ్ అధికారులు తవ్వకాలను పరిశీలించారు. గ్రావెల్ తరలింపునకు అనుమతులు లేవని తేల్చారు.



ఎక్స్‌కవేటర్, టిప్పర్ ముందు కూర్చున్న మహిళలు



సంతమాగులూరు : కొమ్మాలపాడు డీసీకి ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ధ్రువీకరణ పత్రం అందజేత

## డీసీలు ఏకగ్రీవం

- జిల్లాలో 22 కమిటీలకు ఎన్నిక పూర్తి
- ఒక్కటి మినహా అన్నీ ఏకగ్రీవమే
- ఈ నెల 21న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో రెండో అంకమైన డీసీ(డిస్ట్రిబ్యూటరీ కమిటీ)ల ఎన్నికలను మంగళవారం అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 22 డీసీలు ఉండగా ఒక్కటి మినహా అన్ని ఏకగ్రీవమయినట్లు అధికారులు ప్రకటించారు. జిల్లాలో కెడబ్ల్యూడీ పరిధిలో 14 డీసీలు ఉండగా, ఎన్ఎస్‌పీ కింద 8 డీసీలు ఉన్నాయి. వీటన్నింటికి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునే ప్రక్రియను యంత్రాంగం పూర్తి చేసింది. ఈనెల 21న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక జరగనుంది. ఈ ప్రక్రియలో ఇప్పుడు డీసీ నుంచి ఎన్నికయిన వారు ఓటింగ్‌లో పాల్గొని చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. డబ్ల్యూయూఏలకు ఈ నెల 14న జరిగిన ఎన్నికలలో 170 సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక జరిగిన సంగతి విదితమే. తర్వాత దశలో భాగంగా డీసీలకు ఎన్నికను కూడా అధికారులు పూర్తి చేశారు.

### ఒక్కటి మినహా అన్నీ ఏకగ్రీవమే...

మండలాల వారీగా నిర్దేశించిన ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళ వారం ఉదయం తొమ్మిదింటి నుంచే డీసీల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఇందుకోసం 15 నిమిషాల సమయం కేటాయించిన యంత్రాంగం తొమ్మిదిన్నరకు పోటీలో ఉండే వారి పేర్లను ప్రకటించి ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 22 డీసీలు ఉండగా 47 వ నంబరు డీసీకే మాత్రం ఎన్నిక నిర్వహించగా మిగిలినవన్నీ కూడా ఏకగ్రీవాల బాటే పట్టాయి. ఎన్నిక జరిగిన 47 డీసీ పరిధిలో మొత్తం ఆరుగురు ఓటు హక్కు వినియోగించుకోగా ఇరువురికి చెరి మూడు ఓట్లు వచ్చాయి. ఫలితం కోసం అధికారులు డ్రా తీయగా అప్పికట్లకు చెందిన శ్రీకాంత్‌ను డీసీ అధ్యక్ష పదవి వరించింది. 21 డీసీలకు అధ్యక్ష ఉపాధ్యక్ష పదవులన్నీ ఏకగ్రీవమయినట్లు అధికారులు ప్రకటించడంతో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన డీసీల ఎన్నిక కూడా ముగిసినట్లైంది.

## సంక్రాంతికి సాధ్యమేనా?

### 456 రోడ్లకు 19 పనులే పూర్తి

- వారం లక్ష్యాలు నిర్దేశించినా విఫలం
- పనులపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నత్తనడకన గుంతల రహిత రహదారుల పనులు
- గుంతల రహదారులతో వాహనచోదకుల ఇక్కట్లు

గోతుల రహదారులు సంక్రాంతి నాటికి కనిపించవు.. వైసీపీ హయాంలో ప్రజలు గుంతల రోడ్లతో పడిన ఇబ్బందులు ఇక ఉండవు.. అని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. గత నెలలో గుంతల రహిత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు చేపట్టేందుకు పెద్ద ఎత్తున నిధులు కూడా మంజూరు చేసింది. ఆర్భాటంగా పనులను ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ ప్రారంభించారు. అయితే కొన్ని దగ్గర్ల శరవేగంగా పనులు జరుగుతుండగా చాలాప్రాంతాల్లో గుంతల పూడ్చివేత పనులు అరకొరగా.. నత్తనడకన సాగుతున్నాయి. పనులు సాగుతున్న తీరును చూస్తే సంక్రాంతి నాటికి గోతుల రహిత రహదారుల లక్ష్యం అసాధ్యంగా కనిపిస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో రోడ్ల పనులను 456 ప్యాకేజీలుగా విభజించి మరమ్మతులు చేపట్టగా ఇప్పటికి 19 పనులే పూర్తి చేశారు. దీనినిబట్టి ప్రభుత్వ లక్ష్యంపై అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

### నత్తతో పోటీ...

- గుంటూరు జిల్లాలో 134 ప్యాకేజీల్లో చేపట్టిన గుంతల పూడ్చివేత పనులకు రూ.28.94 కోట్లు మంజూరయ్యాయి. అయితే రూ.10.24 కోట్లతో 10 పనులు చేపట్టగా రూ.3.03 కోట్ల విలువైన ఒక్క ప్యాకేజీలోని పని మాత్రమే పూర్తిచేశారు. 535 కిలోమీటర్ల మేర రహదారుల్లో పనులు చేపట్టగా ఇప్పటికి 69.40 కిలోమీటర్లల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు.
- పల్నాడు జిల్లాలో రూ.38.56 కోట్లతో 910 కిలోమీటర్లలో 124 పనులు మంజూరు చేశారు. వీటిలో 170.50 కిలోమీటర్ల మేర 18 ప్యాకేజీల్లో రూ.2.82 కోట్ల పనులు మాత్రమే పూర్తి అయ్యాయి.
- బాపట్ల జిల్లాలో 708.50 కిలోమీటర్లలో గుంతల పూడ్చివేత పనులను 198 ప్యాకేజీలుగా విభజించారు. రూ.46.79కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటికి 55.02 కిలోమీటర్ల రోడ్లపై గుంతలు పూడ్చివేశారు. ఒక్క ప్యాకేజీలో కూడా పూర్తిస్థాయిలో పనులు పూర్తికానట్లు ప్రభుత్వ నివేదికలు తెలియజేస్తున్నాయి.

జానపాడు రహదారిలో గుంతలు





వనికుంట ప్రాంతంలో గుంతలు

పనులు పురోగతి ఇలా..

| జిల్లా | మంజూరు | చేపట్టినవి | పూర్తయినవి |
|---|---|---|---|
| పల్నాడు | 124 | 38 | 18 |
| బాపట్ల | 198 | 29 | నిల్ |
| గుంటూరు | 134 | 19 | 1 |

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రధాన రహదారుల నుంచి సందుగొందుల్లోని రోడ్ల వరకు గోతుల మయం. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల అభివృద్ధి కాదు కదా.. కనీసం గుంతల పూడ్చాలన్న ఆలోచన చేయలేదు. దీంతో గుంతల రహదారులతో ప్రమాదాలు తరచూ జరగడం.. మరణాలు, గాయపడటం వాహన చోదకులకు పరిపాటిగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రజలు రోడ్డెక్కాలంటే వణికిపోవాల్సి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల రహదారులను విస్మరించగా కూటమి ప్రభుత్వం రోడ్లపై దృష్టిసారించింది. రహదారులను అభివృద్ధి చేస్తామని, గుంతలు లేని రహదారులను నిర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం గుంతల రహిత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి సంక్రాంతి కల్లా గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే పనులు చేపట్టి నెల దాటుతున్నా.. ప్రభుత్వ లక్ష్యాలు

(మిగతా 6వ పేజీలో)



బొమ్మనంపాడులో మొక్కజొన్నను పరిశీలిస్తున్న అధికారులు

## తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవాలి

**ఏడీఏ మోహనరావు**

పర్చూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శనగలో కుంకుమ ఇతర తెగుళ్లను రైతులు నివారించి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.మోహనరావు అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నుంబొట్ల అగ్రహారం, భూషాయపాలెం గ్రామాల్లో ఏవో రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెగుళ్లను తొలిదశలో గుర్తించి నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితం ఉంటుందన్నారు. కుంకుమ తెగులు నివారణకు 35-40 రోజులు ఉన్నప్పుడు కాంటాఫ్ ప్లస్ 400 ఎంఎల్ లేదా టిల్ట్ 200 మాల్‌ను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ. డిశంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మొకకజొన్న, శనగ సాగు చేసిన రైతులు పంటలను తెగుళ్ళ బారి నుంచి కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. మంగళవారం మండలంలోని కొణిదెన, కె.రాజుపాలెం గ్రామాలలో పోలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కత్తెర పురుగు, లద్దె పురుగు ఉన్న దృష్ట్యా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో రైతులకు సూచించారు. వాన సూచన ఉండడంతో కోతను నాలుగురోజులు వాయిదా వేయాలన్నారు.

ఇంకొల్లు : శనగలో మొదలుకుళ్ల తెగులు నివారణకు ఎకరాకు 200 గ్రాముల కర్బండెజమ్, 600 గ్రాముల మంగోజెబ్‌ను పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని పావులూరు, కొణికి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, పశు సంవర్థకశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ఈ-పంట నమోదుతోనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ అన్నారు. మండలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గిట్టుబాటు ధరలు, ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ, అన్నదాత సుఖీభవ తదితర పథకాల లబ్ధి కోసం ఈపంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎస్. దీప్తి, వీఏఏలు ఆజాజ్, శంకర్, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : కంది మొగ్గ దశలో ఉన్నందున పురుగు సోకకుండా కాపాడుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని అనమనమూరు, యర్రబాలెం గ్రామాల్లో రైతులతో కలిసి కంది, శనగ పంటలను ఆయన పరిశీలించారు. కంది పూత, మొగ్గ దశలో ఉన్నప్పుడు వేప కషాయాన్ని పిచికారీ చేయాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో ఏటీఎం రామిరెడ్డి, ఎంఎంసీ శ్రీనివాసరావు, వీఏఏలో హస్రీన్, షరీఫ్, రైతులు పాల్గొన్నారు.

## జీసీటీఏ ఎన్నికల్లో కేఆర్‌కే నుంచి నలుగురు ఎన్నిక



ఎన్నికైన అధ్యాకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు

అద్దంకిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల అధ్యాపక సంఘం (జీసీటీఏ) ఎన్నికలలో రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయిలలో ఒకే కళాశాలల నలుగురు అధ్యాపకులు ప్రధాన హోదాలలో ఎన్నికవడం ఇదే ప్రథమం అని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. సోమవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీసీటీఏ ఎన్నికలల్లో పదవులు పొందిన కళాశాల అధ్యాపకులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీటీఏ ఎన్నికలల్లో కెఆర్‌కె కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న డాక్టర్ చిలకా అనిత రాష్ట్ర మహిళ కార్యదర్శిగా, జోనల్ స్థాయిలో చల్లా ప్రసాద్, జిల్లా స్థాయిలో డాక్టర్ మహమ్మద్ నయీం, అశోక్ ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా సంఘంలో కీలక పదవులు పొందిన కళాశాలలోని నలుగురు అధ్యాపకులను ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించి అభినందించారు. జీసీటీఏ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కలిసికట్టుగా పోరాడతామని తెలియజేశారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

పంగులూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్‌ను ఎంపీడీవో స్వరూపారాణి కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు మానవాళికి మేలు చేకూర్చుతాయన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, పీఆర్ ఏఈ హనుమంతరావు, ఏపీవో సంతోషమ్మ, జ్యోతిప్రసాద్, పంచాయతీ కార్యద ర్శులు రాంబాబు, సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, రామారావు, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

## దాబాలలో మద్యం అమ్మితే కేసులు

బల్లికురవ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఉన్న మిని రెస్టారెంట్లు, దాబాలలో మద్యం అమ్మకాలు చేపడితే కేసులు తప్పవని ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని మల్లాయపాలెం, వేమవరంలో ఉన్న లాడ్జీలు, దాబాలలో ఎస్ఐ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. నిబంధనలను ఉల్లంఘించి మద్యం అమ్మకాలు చేపట్టినా, పేకాట ఆడినా చర్యలు తప్పవన్నారు.

## డీజిల్ దొంగను పట్టుకున్న గ్రామస్థులు

బల్లికురవ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో మంగళవారం రాత్రి వాహనాల్లోని పెట్రోలు, డీజిల్‌ను చోరీ చేస్తున్న యువకుడిని గ్రామస్థులు పట్టుకున్నారు. ఇంటి ముందు ఉన్న ద్విచక్రవాహనాల నుంచి డబ్బాలోకి పెట్రోల్ తీస్తుండగా గమనించిన ప్రజలు వెంటనే ఆ యువకుడిని పట్టుకున్నారు. విచారించగా పలు రకాలుగా సమాధానం చెప్పడంతో అనుమానం వచ్చి యువకుడిని చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఇటీవల తరచూ డీజిల్, పెట్రోల్ చోరీలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు.

## జాతీయ ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్లు పయనం

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న 68వ జాతీయ స్కూల్‌గేమ్స్ ఖోఖో చాంపియన్‌షిప్ అండర్-19 పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలురు, బాలికల జట్లు మంగళవారం అనకాపల్లి నుంచి బయలుదేరాయి. ఈ సందర్భంగా క్రీడాకారులకు అనకాపల్లి మండలం తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖాధికారి జి.అప్పారావునాయుడు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

**బాలుర జట్టు**

జి.అజయ్ (విశాఖ), బి.సాయి (విశాఖ), సీహెచ్.చరణ్ (విశాఖ), డి.వినయ్ (ప్రకాశం), పి.నరేష్ (ప్రకాశం), డి.రాకేశ్ (కృష్ణా), ఎం.శివ (విజయనగరం), బి.తిరుమల (శ్రీకాకుళం), ఇ.శేషనార్‌గౌడ్ (అనంతపురం), ఎస్.నవీన్ (నెల్లూరు), జె.యల్లప్ప (కర్నూలు ), బి.పవన్ (చిత్తూరు).

**బాలికల జట్టు**

కె.లాస్య (విశాఖ), పి.జోత్స్న (విశాఖ), జె.గీత (విశాఖ), సీహెచ్.లావణ్య (విజయనగరం), బి.భార్గవి (నెల్లూరు), కె.పవిత్ర(నెల్లూరు), డి.రంగమహాలక్ష్మి(గుంటూరు), కె.దివ్య (పశ్చిమగోదావరి), ఎస్.హస్మిత (చిత్తూరు), జి.దేవి (కడప), జి.భవాని (శ్రీకాకుళం), బి.కల్యాణి (ప్రకాశం). బాలికల జట్టు కోచ్‌గా కేఎం నాయుడు, మేనేజర్‌గా పి.లక్ష్మి వ్యవహరించనున్నారు.

# భూ సమస్యలకు పరిష్కారం

**ఆర్డీవో చంద్రశేఖరనాయుడు**



బూదవాడలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

పంగులూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను రైతులు పరిష్కరించుకోవాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు కోరారు. మండలంలోని బూదవాడ, మల్లవరం గ్రామాలలో మంగళవారం తహసీల్దార్ సింగారావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులో తమ దృష్టికి తెచ్చిన సమస్యలకు నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపాలన్నారు. ఈ సద్సులలో భూమి కొతలకు సంబంధించి 3, ఆర్వోఆర్‌కు సంబంధించి 12 దరఖాస్తులు అందగా, అందులో 3 పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ సురేష్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

**కన్వర్షన్ భూముల పరిశీలన**

రైతులు కన్వర్షన్ కోరిన భూములను ఆర్డీవో చంద్రశేఖరనాయుడు పరిశీలించారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో ఎస్ఎస్ పౌల్ట్రీ పామ్స్‌కు సంబందించి చేబ్రోలు ఆదినారాయణ భూములతో పాటు, బైటమంజులూరు గ్రామ సరిహద్దులో 16వ నెంబరు జాతీయ రహదారి పక్కన పెట్రోలు బంకు ఏర్పాటు కోసం కన్వర్షన్ కోరిన భూమిని ఆర్డీవో పరిశీలించారు. అనంతరం చందలూరు బీసీ కాలనీలో తమకు నివేశన స్థలాలు ఇవ్వాలని కోరుతూ గ్రామస్థులు దరఖాస్తు చేసుకోగా, ఆ భూమిని ఆర్డీవో పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్, సర్వేయర్‌లు ఉన్నారు.

బల్లికురవ : రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కారం చూపేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని రైతులు వినియోగించుకో వాలని తహసీల్దార్ రవినాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంబడిపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యల గు రించి తహసీల్దార్‌కు అర్జీలను సమర్పించా రు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భూముల రీసర్వే పనులు మరలా ప్రా రంభం అవుతున్నాయని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భూములపై హక్కులు ఉన్న అందరికీ రికార్డులలో నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ కిషోర్, గ్రామ పెద్దలు దద్దాల అంజయ్య పాల్గొన్నారు.

చినగంజాం : రెవెన్యూ సదసుల్లో స్వీకరించే ప్రతి అర్జీకి న్యాయమైన పరిష్కారం చూసిస్తామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామానికి చెందిన విద్యార్థులు తమ కుల, ఆదాయ సర్టిఫికెట్స్ కోసం అర్జీలను ఇ చ్చినట్లు తహసీల్దార్ తెలి పారు. 40 మంది విద్యార్థులకు వెంటనే అవసరమైన ధ్రువపత్రాలను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మార్టూరు : నాగరాజుపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 26 అర్జీలు వచ్చాయి. వాటి లో భూసర్వే కోసం 6, పట్టాదారు పాస్ పుస్తకాలకు 3, ఇతరత్రా భూముల మార్పు పై 17 అర్జీలు వచ్చాయని తహసీల్దారు టీ ప్ర శాంతి తెలి పారు. కార్యక్రమంలో ఆర్ఐ రహమాన్ బాషా, సర్వేయర్ ఏడుకొండలు దేవదాయ శాఖ ఈవో శిరీష, రైతులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

- మంత్రి రవికుమార్
- గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన సాగు నీటి రంగం
- అద్దంకి, పంగులూరు డీసీ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు ఏకగ్రీవం



అద్దంకి డీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ధ్రువపత్రాలను అందుకుంటున్న శ్రీనివాసరావు, పేరయ్య, పంగులూరు డీసీ చైర్మన్‌గా ఎన్నికైన ఆంజనేయులు

అద్దంకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే లక్ష్యంగా డీసీ కమిటీలు పనిచేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన అద్దంకి, పంగులూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌కు మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగు నీటి రంగం, సాగర్ కాలువలు పూర్తి నిర్లక్ష్యంకు గురైందన్నారు. సాగుదారులకు దన్నుగా పనిచేయాలన్నారు. కాల్వకట్టల రక్షణ, బలోపేతం పనులు చేపట్టి దిగువ ఆయకట్టు కు నీటి సరఫరా సక్రమంగా జరిగేలా పనిచేయాలన్నారు.

**అద్దంకి, పంగులూరు డీసీ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు ఏకగ్రీవం**

అద్దంకి ఎన్ఎస్‌పీ కార్యాలయంలో మంగళవారం అద్దంకి డీసీ చైర్మన్‌గా ధర్మవరంకు చెందిన బండారుపల్లి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ గా బల్లికురవ మండలం కొత్తపాలెంకు చెందిన కోయ పేరయ్యను, పంగులూరు డీసీ చైర్మన్‌గా పంగులూరు మండలం ముప్పవరానికి చెందిన కుక్కపల్లి ఆంజనేయులు, వైస్ చైర్మన్‌గా అద్దంకి మండలం జార్లపాలెంకు చెందిన ధూళిపాళ్ల వీరాస్వామి లను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లను బల్లికురవ టీడీపీ నేతలు మలినేని గోవిందరావు, పావులూరి ఏడుకొండలు, ధూళిపాళ్ల హనుమంతరావు తదితరులు అభినందించారు.

చినగంజాం : మండలంలోని గొనసపూడి గ్రామానికి చెందిన పొద వీరయ్య చినగంజాం-52 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. చీరాల ఇరిగేషన్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల అధికారి గుంటూరి మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మీ, అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఇరిగేషన్ శాఖ ఏ.ఈ ఏ.శ్రీధర్‌లు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో మండల పరిధిలోని ఆరు నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు కమిటీ చైర్మన్‌గా వీరయ్యను, వైస్ చైర్మన్‌గా జాగర్లమూడి సాయిప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వీరయ్య, సాయిప్రసాద్‌లకు ఎన్నికల అధికారి ధ్రువపత్రాలను అందజేశారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లుగా ఎన్నికైన వీరయ్య, సాయిప్రసాద్‌లకు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుల అభినందనలు తెలిపారు. మండల పరిధిలోని టీడీపీ నాయకులు తూమాటి శ్రీనివాసరావు, వడ్లమూడి సత్యనారాయణ, సందు శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, అబ్దుల్‌కలాంఅజాద్, కే.విష్ణు, మండల పరిధిలోని పలువురు నాయకులు వీరయ్యను పూలమాలలు, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



వీరయ్యకి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి విజయలక్ష్మి

# మీనమేషాలు

- డీసీసీబీలో అక్రమాలపై ఉన్నత స్థాయిలో ఉదాసీనత
- కలెక్టర్ నివేదిక పంపి పక్షం దాటినా తదుపరి చర్యలు శూన్యం
- తొలి నుంచి ఉన్నతాధికారుల ధోరణి అలాగే
- ప్రభుత్వ తీరుపై సహకార వర్గాల్లో విమర్శలు

ఒంగోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో అడ్డగోలుగా సాగిన అవినీతి, అక్రమాల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంలో ఉన్నత స్థాయిలో ఉదాసీనత నెలకొంది. ప్రాథమికంగా చేపట్టిన విచారణలో అనేక అక్రమాలు జరిగినట్లు విచారణ కమిటీ తేల్చింది. ఆ నేపథ్యంలో సమగ్ర విచారణ కోరుతూ కలెక్టర్ తమీమ్ అన్సారియా పక్షం రోజుల క్రితం ప్రభుత్వానికి నివేదిక పంపినా తదుపరి చర్యలపై ఉన్నత స్థాయిలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. బ్యాంకు వ్యవహారంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల ధోరణి తొలి నుంచి అలాగే ఉండగా విషయం ముఖ్యమంత్రి దృష్టికి చేరి సీఎంవో జోక్యం చేసుకోవడంతో కొంత కదిలిక వచ్చింది. తదుపరి చర్యలపై సాచివేత ధోరణిలోనే సహకారశాఖ ఉన్నతాధికారులు సాగుతున్నారన్న విమర్శలు సహకార వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి.

**ఎమ్మెల్యే ఫిర్యాదు.. కలెక్టర్ లేఖ**

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ క్రమంలో అప్పటికి ఏడాది కాలంగా బ్యాంకు సీఈవోగా ఉన్న అధికారి అక్కడే కొనసాగితే రికార్డులు ట్యాంపరింగ్ అయ్యే అవకాశం ఉన్నందున ఆయనను మార్చడంతోపాటు సెక్షన్ 51 విచారణ బ్యాంకుపై వేయాలని అక్టోబరు 21న కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి లేఖ రాశారు. సకాలంలో ఉన్నతాధికారులు స్పందించ లేదు. ఈ విషయాన్ని బహిర్గతం చేస్తూ నవంబరు 2న 'అక్కడ అంతే' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు కలవరపడ్డారు. అదే సమయంలో జిల్లాకు చెందిన టీడీపీ యువనేత ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో సీఎంవో ఆరా తీయడంతో పాటు ఉన్నతాధికారులకు తగు సూచనలు చేశారు.

**త్రిసభ్య కమిటీతో విచారణ**

ఈ నేపథ్యంలో సెక్షన్ 51 విచారణకు వీలుగా ప్రాథమిక పరిశీలన చేసి నివేదిక పంపాలని రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారుల నుంచి కలెక్టర్‌కు సమాచారం అందింది. డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించగా వారు లోతుగానే పరిశీలన చేశారు. మొత్తం 62 ఫిర్యాదులలో అత్యధికం వాస్తవమేనని గుర్తించి పక్షం రోజులపాటు విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు నెలాఖరులో వారు అందజేశారు. మరోవైపు సీఎం దృష్టికి వ్యవహారం వెళ్లిన తర్వాత ఇక్కడి బ్యాంకు పీఐసీ పాలకవర్గం సూచనలతో బ్యాంకు సీఈవోగా ఉన్న కోటిరెడ్డి రాజీనామా చేయగా ఆ స్థానంలో ఆప్కాబ్ నుంచి మరొక అధికారిని తాత్కాలికంగా నియమించారు. బ్యాంకు సిబ్బందిలోనూ కొన్ని మార్పులు జరిగాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంకు పీఐసీ కమిటీగా ఉన్న కీలక అధికారులు కూడా తగు విధంగా వ్యవహరించలేదన్న విమర్శలు వచ్చాయి.

**ఇంతవరకు చర్యల్లేవ్**

ఇదిలాఉండగా లోకేశ్వరరావు కమిటీ ఇచ్చిన విచారణ నివేదికను పక్షంరోజుల క్రితమే కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి పంపించారు. కాని ఇంతవరకు తదుపరి చర్యలు సహకార శాఖ ఉన్నతాధికారుల నుంచి కనిపించలేదు. తొలి నుంచి ఉన్నట్లుగానే ఆ శాఖ ఉన్నతాధికారులు ఉదాసీనంగానే వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుండగా, ఆ విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి జిల్లాకు చెందిన అధికారపార్టీ ముఖ్య నేతలు ఇద్దరు, ముగ్గురు తీసుకెళ్లినట్లు తెలిసింది. అయినా తదుపరి ఆదేశాలు రాకపోవడంతో ఇలాంటి విచారణలు మనల్ని ఏమి చేస్తాయి, గతంలో ఎన్నో చూశాం అన్నట్లుగా బ్యాంకులో అక్రమార్కులు వ్యవహరిస్తుండగా పలు వర్గాల నుంచి ఇంకా కూడా విచారణాధికారి లోకేశ్వరరావుకు మరికొన్ని ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇలాంటి వాటిపై సత్వర చర్యలవైపు దృష్టిసారించకపోతే ప్రజల్లో పాలకపక్షం అబాసుపాలు అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

## సంక్రాంతికి సాధ్యమేనా?

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పల్నాడు.. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,153.50 కిలోమీటర్ల మేర రహదారుల్లో పనులకు రూ.113.99 కోట్ల నిధులను ప్రభు త్వం మంజూరు చేసింది. రహదారులను ప్యాకేజీలుగా విభజించి 456 పనులు చేపడితే ఇప్పటికి 19 పనులు మాత్రమే పూర్తయినట్లు ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి. పనులు నత్త నడకకన్నా నిదానంగా సాగుతున్నాయి. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో గుంతల రహదారులతో వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. సంక్రాంతి కల్లా పనులు పూర్తి అవుతాయని ప్రభుత్వం ప్రకటించినా పురోగతి ఆ మేరకు కనిపించడం లేదు. మూడు జిల్లాల్లో కాస్తంత పల్నాడు జిల్లాలో పనులు పురోగతి కొంత మెరుగ్గా ఉంది. రహదారుల గుంతల పూడ్చివేతకు వారం వారం లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించినా ఆ మేర లక్ష్యాలను చేరుకోవడంతో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. పనుల్లో జరుగుతున్న జాప్యంతో రహదారుల ఇక్కట్లు ఇప్పట్లో వాహనదారులకు తీరే పరిస్థితులు కానరావడం లేదు. పురోగతిని పరిశీలిస్తే ప్రభుత్వం ప్రకటించినట్లుగా సంక్రాంతికి పూర్తి అయ్యే పరిస్థితులు లేవని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో కూడా రహదారులపై గుంతల పూడ్చివేతపై చర్చ జరిగింది. వేగవంతంగా పనులు పూర్తి చేసి రహదారుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

## స్నాతకోత్సాహం

(5వ పేజీ తరువాయి)

డిగ్రీలను ప్రదానం చేశారు. ఎయిమ్స్ మంగళగిరి సెంటర్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ బ్రోచర్‌ను కేంద్ర సహాయమంత్రి జాదవ్ ఆవిష్కరించారు.

**47 మందిలో 17 మంది మహిళలే**

ఎయిమ్స్‌లో డిగ్రీలు తీసుకున్న 47 మందిలో 17 మంది మహిళలే. దీనిపై రాష్ట్రపతి ముర్ము హర్షం వ్యక్తం చేశారు. వైద్యవృత్తిలో పెరుగుతున్న మహిళల భాగస్వామ్యంతోపాటు వారి గణనీయమైన సహకారాన్ని చూస్తూ ఉంటే అభివృద్ధి చెందుతున్న సమాజంగా మారుతున్నట్లు అనిపిస్తోందన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు మొదటి బ్యాచ్ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లన్నారు. తన ప్రసంగంలో ముందుగా ఆమె మంగళగిరి క్షేత్రాన్ని గురించి ప్రస్తావించి వేదికపై నుంచే పానకాలస్వామికి నమస్కారాలను తెలిపారు. నరసింహస్వామి చెంత వైద్యవిద్యను అభ్యసించిన విద్యార్థులందరూ ఎంతో అదృష్టవంతులన్నారు. వైద్యులు సేవకు ప్రాధాన్యమివ్వాలని, యువ వైద్యులు మరింత చిత్తశుద్ధితో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలు పూర్తిస్థాయి ఆరోగ్యవంతులుగా ఉండాలని.. అందుకోసం ప్రతి ఒక్కరూ తమతమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.

**దేశ భవిష్యత్ నగరంగా అమరావతి : చంద్రబాబు**

దేశ భవిష్యత్ నగరాల్లో ఏపీ రాజధాని అమరావతి ప్రముఖంగా నిలువబోతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. దేశంలోని ఎయిమ్స్‌లన్నింటిలోనూ రాజధాని అమరావతి పరిధిలోని మంగళగిరి ఎయిమ్స్ నెంబర్‌వన్‌గా నిలుస్తుందన్న నమ్మకం తనకుందని చెప్పారు. మంగళగిరి ఎయిమ్స్‌లో ఇకమీదట ఎలాంటి మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వబోమని హామీ ఇచ్చారు. దేశంలోని ఏ ఎయిమ్స్‌లో కూడా ఇంత సుందరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం లేదన్నారు. ముర్ము సామాన్య ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చి దేశ అత్యున్నత పదవిని సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. కష్టపడితే ఈ ప్రపంచంలో సాధించలేనిది ఏదీ లేదనడానికి ద్రౌపదిముర్ము జీవితమే ఒక ఉదాహరణ అని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రపతి ద్రౌపదిముర్మును శాలువతో సన్మానించి తిరుమల శ్రీవారి మెమొంటోను అందజేశారు. రాష్ట్రపతికి మంగళగిరి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి నారా లోకేశ్ మంగళగిరి చేనేత చీరెను బహూకరించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ మదబానందకర్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూపులు

- మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న ప్రజానీకం
- సంక్రాంతికి కొత్తవి ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- దరఖాస్తులు చేసుకోనేందుకు ఓపెన్ కానీ సైట్
- అయోమయంలో అర్హులైన పేదలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా తెల్లరేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న అర్హులైన పేదలకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించడంతో వారిలో ఆశలు చిగురించాయి. అయితే సైట్ ఓపెన్ కాకపోవడంతో అందరు ఎదురుచూస్తున్నారు. ఈనెల 2 నుంచి మీసేవ, వార్డు, గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించి వాటిపై విచారణ చేసి అర్హులైన వారందరికి రేషన్ కార్డులు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో కార్డుదారులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు మీసేవ కేంద్రాలు, సచివాలయాలకు వెళ్లగా అక్కడ నిరాశే ఎదురవుతోంది. ఇప్పటికే కొత్త వాటితోపాటు ఉన్న రేషన్ కార్డుల్లో పేర్లు మార్పులతో పాటు వివిధ కారణాల వల్ల పేర్లు తొలగింపు చేయకపోవడంతో వేలాదిమంది ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**సైట్ ఓపెన్ కావడం లేదు**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రేషన్ కార్డులపై ప్రత్యేక దృష్టిసారించారు. అందులోభాగంగా కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి అధికారులు కూడా తదనుగుణ చర్యలు చేపట్టారు. తీరా ఇప్పుడు దరఖాస్తులు చేసుకునేందుకు వెళితే అక్కడ సైట్ (పౌరసరఫరాల శాఖకు సంబంధించినది) ఓపెన్ కాకపోవడంతో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. ఏదైనా టెక్నికల్ సమస్యతో ఓపెన్ కాలేదని ఎదురుచూసిన ప్రజానీకం ఇప్పుడు అధికారులను కలిసి సమస్యను విన్నవిస్తున్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం గ్రీవెన్స్ సెల్‌లో కూడా అర్జీలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయిలోనే టెక్నికల్ సమస్య ఏర్పడి వాయిదాపడిన విషయాన్ని కూడా సంబంధిత అధికారులకు తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.

## డ్వామాలో శీనారెడ్డి రగడ

- నిబంధనలకు విరుద్ధంగా పలు ఫైళ్ల నకళ్లు తీసుకెళ్లిన వైనం
- సహకరించిన కార్యాలయ సిబ్బందిపై పీడీ జోసఫ్‌కుమార్ ఆగ్రహం

ఒంగోలు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగున్నరేళ్ల పాటు జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీగా పనిచేసిన శీనారెడ్డి ఆ సమయంలో ఇష్టారీతిగా వ్యవహరించారు. బదిలీలు, నియామకాలు, పనుల మంజూరు, సోషల్ ఆడిట్, చివరకు వాహనాల బిల్లులలో సైతం భారీగా స్వాహా చేశాడన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. అందుకు సంబంధించి ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుతో ప్రస్తుతం తొలుత విజిలెన్స్ విచారణ, తర్వాత ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ నియమించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ విచారణ కొనసాగుతోంది. ఇలాంటి విచారణలలో దిట్టగా పేరున్న లోకేశ్వరరావు కొంత లోతుగానే పరిశీలన చేపట్టగా ఇప్పటికే కొన్ని అంశాలలో అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు కమిటీ గుర్తించింది. ఈక్రమంలో ఆయా ఫిర్యాదులపై శీనారెడ్డిని కూడా విచారించాలని త్రిసభ్య కమిటీ భావించి ఈనెల 14వతేదీన తమ కమిటీ ఎదుట హాజరుకావాలని తొలుత శీనారెడ్డికి నోటీసు ఇచ్చారు. అయితే విచారణ కమిటీ ముందు హాజరై తన వివరణ ఇచ్చేందుకు కొన్ని అంశాలకు సంబంధించిన మెటీరియల్ సేకరించుకోవాల్సి ఉందని, వారం గడువు ఇవ్వాలని సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

# అల్పపీడన ప్రభావం.. రైతులలో టెన్షన్

- చల్లబడిన వాతావరణం
- నేడు, రేపు వానలు కురిసే అవకాశం
- ఇటీవలి తుఫాన్‌కు దెబ్బతిన్న పొగాకు, శనగ
- మళ్లీ కురిస్తే అంతా నష్టమే

ఒంగోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాపై ఉంటుందన్న సమాచారంతో జిల్లా రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈనెల తొలి వారంలో తెరపి లేకుండా వారంరోజుల పాటు విస్తారంగా వర్షాలు కురవగా, జిల్లా తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని మండలాల్లో పొగాకు, శనగ పైర్లు దెబ్బతిన్నాయి. ఆ రెండు తోపాటు మినుము, వరి, మిర్చి, అలసంద ఇలా పలు రకాల పంటలు ఇంచుమించు లక్ష ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఏదో ఒక స్థాయిలో దెబ్బతిన్నాయి. అంతేకాక మిగిలిన రబీ పంటలు సాగు కూడా జాప్యమైంది. దాని నుంచి తేరుకొని భూములు దున్ని పంటలు వేయాలని సిద్ధం అవుతున్న రైతులకు తాజాగా మరో అల్పపీడనం అన్న సమాచారం కంటి మీద కునుక లేకుండా చేస్తోంది. వాతావరణ శాఖ తాజా సమాచారం ప్రకారం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా వాయుగుండం గా మారి తమిళనాడు తీరం వైపు పయనిస్తోంది. దీని ప్రభావం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో ఉండనుండగా జిల్లాపైనా ఉంటుందని సమాచారం. జిల్లాలో దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దానికి అనుగుణంగా జిల్లాలో ప్రత్యేకించి తూర్పు, దక్షిణ ప్రాంతాలలో మంగళవారం వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఒంగోలులో సోమవారం 30 డిగ్రీలుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రత ఉండగా మంగళవారం నాలుగు డిగ్రీలు తగ్గింది. ఇదే పరిస్థితి ఇతరచోట్ల కనిపిస్తుండటంతోపాటు చలి కూడా పెరిగింది. ఈ తరహా వాతావరణంతో పంటలపై తెగుళ్లు, పురుగుల దాడి మరింత పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో ఇటీవలి వర్షాల నష్టాల నుంచి ఇంకా తేరుకోక ముందే మరోసారి వర్షాల సమాచారంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## గ్రానైట్ రాయి లారీ పట్టివేత

బల్లికురవ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీర్ల కొండ నుంచి పర్మిట్ లేకుండా కటింగ్ ఫ్యాక్టరీలకు తరలిపోతున్న గ్రానైట్ ముడి రాయి లారీని సోమవారం రాత్రి బాపట్ల మైనింగ్ ఏడీ రాజేష్‌బాబు పట్టుకొన్నారు. అనంతరం ఆ లారీని బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. గత రెండు రోజుల వ్యవధిలోనే పర్మిట్లు లేని ఏడు లారీలను అధికారులు పట్టుకున్నారు.

## నేటి నుంచి రెండో విడత శిక్షణ

పంగులూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన అంశాలపై బుధ, గురు వారాలలో రెండవ విడత శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. ఫిఫ్త్ గ్రేడ్ కార్యదర్శులు, డిజిటల్, విలేజ్ హార్టికల్చరల్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఏఎన్‌ఎంలు, మండల స్థాయి అధికారులు ఈ శిక్షణకు హాజరు కావలసిందిగా ఎంపీడీవో కోరారు. మండల విద్యా వనరుల కేంద్రంలో ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

# మెగా ఆర్వో ప్లాంట్ పూర్తయ్యేనా?

» నిర్మాణం కాకుండానే అటకెక్కిన వైనం
» ప్రత్యామ్నాయ అవసరాలకైనా వినియోగించాలంటున్న ప్రజలు

అద్దంకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి, బల్లికురవ మండలాలలో 22 గ్రామాలకు తక్కువ ధరకు శుభ్రమైన జలం అందించేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం శింగరకొండ వద్ద మెగా ఆర్‌వో ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు జరిగే సమయంలో 2019 ఎన్నికలలో వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ఐదున్నర సంవత్సరాలుగా పనులు అడుగు ముందుకు పడలేదు. భవనాసి చెరువులో ఏర్పాటు చేసిన ఇన్‌టెక్‌వెల్, శింగరకొండ వద్ద నిర్మించిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారాయి. మెగా ఆర్వో ప్లాంట్ నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చి ఉంటే రెండు రూపాయలకే 20లీటర్ల నీరు ఇళ్ల వద్దకే సరఫరా జరిగేవి. ప్రస్తుతం ఆయా గ్రామాలలో ప్రైవేటు వ్యక్తులు ఆర్‌వో ప్లాంట్‌లను ఏర్పాటు చేసినప్పటికీ 20లీటర్ల నీరు 10 నుంచి 20 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అసంపూర్తిగా నిలిచిపోయిన మెగా ఆర్వో ప్లాంట్‌ను త్వరిత గతిన పూర్తిచేయాలని, ఒక వేళ దానిని ప్రస్తుతం ఏర్పాటు చేసే ఆలోచన లేకపోతే కనీసం ఆయా ట్యాంక్‌లను వినియోగంలోకి తీసుకు వచ్చి శింగరకొండ, శింగరకొండ పాలెం, గోపాలపురం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు మంచి నీటి సరఫరాకు వినియోగించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


భవనాసి చెరువులో ఏర్పాటు చేసిన ఇన్‌టెక్‌వెల్
శింగరకొండ వద్ద అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంక్

## 12 మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

మార్టూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎఫర్ట్ కార్యాలయంలో మంగళవారం రాత్రి బీజీఆర్ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రా హైదరాబాదు వారి ఆర్థిక సహకారంతో రోటరీ క్లబ్ వారు 12 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు, రావి అంకమ్మచౌదరి,చెన్నుపాటి బసవరాములు, ఇంటూరి ఆంజనేయులు,శానంపూడి లక్ష్మయ్య, యూ కోటేశ్వరరావు, షేక్ కాజా హుస్సేన్, కొర్రపాటి వేణు, మాదాల సాంబయ్య పాల్గొన్నారు.

## కోనంకి డీసీ అధ్యక్ష,ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం

మార్టూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కోనంకి సబ్ డివిజన్ ఎన్‌ఎస్పీపరిధిలో కోనంకి, పర్చూరు, ఇంకొల్లు, ద్రోణాదుల డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్ష పదవులకు మంగళవారం కోనంకి ఎన్నెస్పీ కార్యాలయంలో ఎన్నిక జరిగింది. కార్యక్రమానికి బాపట్ల డీడబ్ల్యూఆర్వో అబుత్ అలీం ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారికి అబుత్‌అలీం, అద్దంకి ఈఈ నాగ మురళి, డీఈ స్వామి చేతులమీదుగా నియామకపత్రాలను అందచేశారు. వారిలో కోనంకి 39 డిస్ట్రిబ్యూషన్ కంట్రిబ్యూషన్ అధ్యక్షుడిగా ఉప్పలపాటి చక్రపాణి, ఉపాధ్యక్షుడిగా తాటి ఆంజనేయ స్వామి, ద్రోణాదుల 41 డీసీ అధ్యక్షుడిగా కొసరాజు దిలీప్ కుమార్ ఉపాధ్యక్షుడిగా పఠాన్ మహబూబ్ ఖాన్, పర్చూరు 42 డీసీ అధ్యక్షుడిగా కొల్లా మురళీకృష్ణ, ఉపాధ్యక్షునిగా ముప్పా ఆంజనేయులు, ఇంకొల్లు 40 డీసీ అధ్యక్షుడిగా బండ్ల శ్రీనివాసరావుఉపాధ్యక్షుడిగా గుడి మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. వారందరికీ అధికారులు నియామక పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు అనూరాధ, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు వ్యవహరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోటపాటి సురేష్, తాటి నాగేశ్వరరావు, తాటి నాగార్జున, కోలలపూడి సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, పెంట్యాల శ్రీను, కరణం మారుతి, ఉప్పలపాటి నాగేంద్రమ్మ పాల్గొన్నారు. అదేవిధంగా కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలో చీరాల 51 డీసీ చైర్మన్‌గా స్వర్ణకు చెందిన నీరుకట్టు పాండురంగారావు, వైస్ చైర్మన్‌గా నక్కల నాగరాజు, చినగంజాం 52 డీసీ చైర్మన్‌గా గొనసపూడికి చెందిన పొదవీరయ్య, వైస్ చైర్మన్‌గా జాగర్లమూడి సాయి ప్రసాద్ ఎన్నికయ్యారు.


కోనంకిలో ఎన్నికైన డీసీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో టీడీపీ నాయకులు

### సాగు నీటి సమస్యతో ఇబ్బంది పడకూడదు

**ఎమ్మెల్యే ఏలూరి .. డీసీ కమిటీ చైర్మన్‌లకు అభినందనలు**

ఆయకట్టు చివరి భూములకు కూడా నీరు అందేవిధంగా చూడాలని, రైతులకు సాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడాలని నూతనంగా ఎన్నికైన డీసీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. మంగళవారం జరిగిన డీసీ కమిటీ చైర్మన్ లు, వైస్ చైర్మన్‌ల ఎన్నికలో కోనంకి ఎన్‌ఎస్పీ పరిధిలోని 4 డీసీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలోని 2 డీసీ చైర్మన్‌లు తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వారిని అభినందించారు. అనంతరం సాగర్ కాలువల ఆధునికీకరణ డీసీ కమిటీ చైర్మన్‌లు కృషి చేయాలని సూచించారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా కమిటీ చైర్మన్‌లు పనిచేయాలన్నారు.

### కోనంకి డీసీ అధ్యక్షునిగా రెండో సారి చక్రపాణి నియామకం


కోనంకి డీసీ అధ్యక్షుడు చక్రపాణి

కోనంకి డీసీ కమిటీ అధ్యక్షుడిగా ఉప్పలపాటి చక్రపాణి రెండో సారి బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2014-19 కాలంలో డీసీ అధ్యక్షులుగా పని చేశారు. అదేవిధంగా 1997 నుంచి కోనంకి నీటి సంఘం అధ్యక్షులుగా ఉన్నారు. ప్రస్తుతం కోనంకి 2 నుంచి నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై డీసీ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అతనిని లీలా కృష్ణ మూర్తి, జరుగుల సాంబయ్య, గ్రామస్థులు అభినందించారు.

### డీసీ చైర్మన్‌గా మురళీకృష్ణ

పర్చూరు : సాగు నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు హవా కొనసాగింది. నియోజకవర్గంలో అన్ని డీసీల్లో విజయం సాధించారు. మంగళవారం డీసీ కమిటీలకు నిర్వహించిన ఎన్నికల్లో పర్చూరు 42 డీసీ చైర్మన్‌గా కొల్లా మురళీకృష్ణ, వైస్ చైర్మన్‌గా ముప్పా ఆంజనేయులు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు. కార్యక్రమంలో కొల్లా శ్రీనివాసరావు (ఫ్యాక్టరీ), డీసీ మాజీ చైర్మన్ పాలేరు సుబ్బయ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న మురళీకృష్ణ



## గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న అధికారులు

చీరాలటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్ డైరెక్టర్ కేశవరెడ్డి, డీఎల్‌డీవో పద్మావతి, తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. గత రెండు రోజులుగా చీరాల మండల కార్యాలయంలో పంచాయతీ కార్యాలయ అన్ని ప్రభుత్వ విభాగాలకు ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆరోగ్య వంతమైన గ్రామం, బాల హిత పంచాయతీలు, నీటి సమృద్ధి గల గ్రామం, పరిశుభ్రమైన, స్వచ్ఛమైన గ్రామం, స్వయం సమృద్ధితో సదుపాయాల గ్రామం, సామాజిక న్యాయం, భద్రత, సుపరి పాలన కలిగిన గ్రామం అంశాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సంబంధిత శిక్షణపై సిబ్బందికి రాత పరీక్ష కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీఎం మధు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పెన్షనర్స్ డే

చీరాలటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో మంగళవారం ఘనంగా పెన్షనర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భం గా ఎస్‌జే రంగనాయకులు బాపనమ్మ కల్యాణ మండపంలో సుమారు 350 మంది పెన్షనర్స్ పాల్గొన్నారు. ముందుగా డిస్ నకార చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు 40 మంది సీనియర్స్‌ను ఎస్టీవో సుబ్బారావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, బత్తుల బ్రహ్మారెడ్డి, సిద్దయ్య, బ్రహ్మం, భాగి కృష్ణమూరి పాల్గొన్నారు. విజ్ఞాన భారతి పాఠశాలలో నిర్వహించిన పెన్షనర్స్ డే వేడుకలను ఆర్‌సీటీఏ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పలువురు సీనియర్ పెన్షనర్స్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెంకటరావు, రోశయ్యగంగాధర్‌రావు, రవీంద్రకుమార్, గిరిజాశంకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.


పాఠశాలకు క్యాన్లు, గ్లాసులను అందజేస్తున్న దాత

## దాతల సాయం అభినందనీయం

చినగంజాం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం డి.రత్నకుమారి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తాగునీటి కోసం క్యాన్లు, గ్లాస్లులను దాత అక్కల రామకృష్ణారెడ్డి పాఠశాల హెచ్‌ఎంకు మంగళవారం అందజేశారు. దాతల సాయాన్ని విద్యార్థులు వినియోగించుకొని విద్యాభివృద్ధి చెందాలని హెచ్‌ఎం అన్నారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు అక్కల రామకృష్ణారెడ్డి విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం కోసం నాలుగు వాటర్ క్యాన్లు, గ్లాసులు పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కుర్రి రామ సుబ్బారావు, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, శ్రీనివాసదీక్షితులు, సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు

## గ్రామాల్లో ఆధార్ మొబైల్ శిబిరాలు

చినగంజాం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో 0-6 సంవత్సరాలలోపు చిన్నారులకు ఆధార్ నమోదు కోసం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తల సహకారంతో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు, 26 నుంచి 28వ తేదీ వరకు ఆధార్ మొబైల్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి తెలిపారు. సంతరావూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో జరిగే ఆధార్ శిబిరాలకు సంతరావూరు, గొనసపూడి గ్రామాలు, కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 18, 19 తేదీల్లో కడవకుదురు, చింతగుంపల్లి గ్రామాలు, చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 19, 20న చినగంజాం, పల్లెపాలెం గ్రామాలు, 20, 21న పెదగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెదగంజాం, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు, 26, 27న రాజుబంగారుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజుబంగారుపాలెం, కొత్తపాలెం గ్రామాలు, 27, 28న మోటుపల్లి, మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలు, 28వ తేదీన మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మున్నంవారిపాలెం, నీలాయపాలెం గ్రామాలకు ఆధార్ శిబిరాల ఇన్‌చార్జిలు ఎన్.సురేష్, ఎ.మనీష్‌కుమార్ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆధార్ శిబిరాలు జరుగుతున్నప్పుడు ఆధార్ ఆపరేటర్లు, ఇద్దరు సచివాల సిబ్బందిని కేటాయించాలని, ముందు రోజు గ్రామాల్లో దండోరా, ఇతర ప్రచార సాధనాల ద్వారా ప్రచారం చేయించాలని గ్రామ కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు.

## పెళ్లయిన ఆరు నెలలకే నూరేళ్లు నిండాయి

» అనుమానాస్పదంగా స్వర్ణకు చెందిన వ్యక్తి మృతి
» కూలి పనులకు వెళ్లి అనంతలోకాలకు


కల్యాణ్‌బాబు (ఫైల్)

చీరాలటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి అయిన ఆరు నెలలకే ఓ వ్యక్తికి నిండు నూరేళ్లు నిండాయి. పని ముగించుకుని పెందలకడనే తిరిగి వస్తానని భార్యకు చెప్పి వెళ్లి అనంత లోకాలకు చేరాడు. ఈమృతిపై అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. కారంచేడు మండలం స్వర్ణ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన కూరపాటి కల్యాణ్‌బాబు(26) కుటుంబంలో ఒక్కగానొక్క కుమారుడు. మిగిలిన ఇద్దరు ఆడ పిల్లలు. ఇతనికి ఈ ఏడాది జూన్ 24న బాపట్ల మండలం పేరలిగ్రామానికి చెందిన మేరమ్మతో వివాహం జరిగింది. తండ్రి సంసోన్, మరి కొందరు గ్రామస్థులతో కలిసి రోజు రైలు మార్గంలో తెనాలిలో వ్యవసాయ పనులకు వెళుతున్నాడు. గత ఆదివారం పనికి వెళ్లగా, మేము తర్వాత వస్తామని చెప్పడంతో తండ్రి కొందరితో కలిసి సర్కార్ రైలులో ఇంటికి వచ్చారు. ఆ రాత్రి కల్యాణ్ తప్ప మిగతా మిత్రులంతా ఇంటికి చేరారు. చీరాల రైల్వే స్టేషన్‌లో ఉన్న కల్యాణ్ ద్విచక్ర వాహనాన్ని ఒక మిత్రుడు తీసుకువచ్చి ఇంటి వద్ద పెట్టి వెళ్లి పోయాడు. ఆసమయంలో తమ కుమారుడు ఎక్కడని అడగగా తమకు తెలియదని సమాధానమిచ్చారు. కల్యాణ్ రెండోరోజు సోమవారం ఉదయం ఈపూరుపాలెం సమీపంలో పట్టాలపై శవమై కన్పించాడు. రైల్వే పోలీసులు మంగళవారం చీరాల ఏరియా వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కు టుంబ సభ్యులకు అప్పగించారు.

**హాస్పిటల్‌కు రాని సహచరులు**

రెండు రోజులుగా హాస్పిటల్లో మృతదేహం ఉన్నా కల్యాణ్‌తో ఉన్న సహచరులెవరూ హాస్పిటల్ చుట్టు పక్కలకు రాక పోవడంపై తండ్రి సంసోన్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై న్యాయ పరమైన విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## బాలుడుకి గాయాలు

అద్దంకి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకుపాడు లో సైకిల్ పై వెళ్తున్న బాలు డు ని టిప్పర్ ఢీ కొనటం తో గాయాలు అయిన సంఘటన పై మంగళవారం అద్దంకి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. పోలీసుల కధనం మేరకు మండలంలోని కుంకుపాడు కు చెందిన అంబటి మనోజ్ అద్దంకి లోని ఓ ప్రవేట్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం కుంకుపాడు లోని గంగవరం రోడ్డు లో సైకిల్ పై వెళ్తుండగా టిప్పర్ ఢీ కొట్టింది. గాయాలైన మనోజ్ ను ఒంగోలు వైద్యశాలకు తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. ఒంగోలు హాస్పటల్ నుండి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్ బాషా తెలిపారు.

## గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

యద్దనపూడి, (మార్టూరు) డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్ వెంకయ్య (55) గుండెపోటుతో మంగళవారం వేకువజామున మృతి చెందారు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బల్లికురవ మండలం కొప్పెరపాడు స్వగ్రామం. సోమవారం రాత్రి మార్టూరులో కుమార్తె ఇంటిలో ఉన్న అతను తెల్లవారుజామున రెండు గంటల సమయంలో గుండెపోటుకు గురికాగా ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మృతి చెందారు. ఎంపీడీవో షేక్ మహమ్మద్ అబీబ్ జావెద్ సిబ్బందితో వెళ్లి కొప్పెరపాడులో కుటుంబసభ్యులకు మట్టిఖర్చులు నిమిత్తం 25 వేల రూపాయలను అందచేశారు.

## 'పది'లో మంచి మార్కులు సాధించాలి


అద్దంకిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, దాతల చేయూతను విద్యార్థులు అందిపుచ్చుకుని పదవతరగతి పబ్లిక్ పరీక్షలల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని ఎంఈవో బి.సుధాకరరావు అన్నారు. మంగళవారం యూటీఎఫ్ అద్దంకి మండల శాఖ అధ్వర్యంలో పట్టణంలోని గురకాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం హెచ్‌ఎం ఎల్.సుజాత అధ్యక్షతన జరిగింది. గతేడాది యూటీఎఫ్ పంపిణీ చేసిన మెటీరియల్ 80శాతం మందికి ఉపయోగపడిందన్నారు. అనంతరం ఎంఈవో స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి పూర్ణ చంద్రరావు, ఉపాధ్యాయులు ఏ.సుధాకర్, ఎంకే శర్మ, సునీత, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో సుధాకరరావు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5




శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

జిల్లా వార్తలు

బుధవారం 18 డిసెంబరు 2024


## 'సోమశిల'కు 3వేల క్యూసెక్కుల వరద



అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 3,004 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 72.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1550, కండలేరుకు 1,200, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.




నుడా ఛైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో ప్రమాణం చేయిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ



# కోటంరెడ్డి అనే నేను..

- నుడా ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ
- పాల్గొన్న మంత్రుల ఫరూఖ్, ఆనం, నారాయణ
- నగరంలో భారీగా బైక్ ర్యాలీ • నటుడు బాలకృష్ణ అభినందనలు

8లో..

'కోటంరెడ్డి అనే నేను..' అంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నూడా ఛైర్మన్‌గా మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. నెల్లూరులోని నుడా కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూఖ్, ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. నుడా అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని మంత్రులు స్పష్టం చేశారు. అంతకుముందు నర్తకీ సెంటర్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాగా, హిందూపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ కోటంరెడ్డికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

# నేటి నుంచి డిపార్టుమెంటల్ పరీక్షలు

- మూడు కేంద్రాల్లో నిర్వహణ
- పకడ్బందీ ఏర్పాట్లు : డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు డిపార్టుమెంటల్ పరీక్షలు జరుగుతాయని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఉదయ భాస్కర్‌రావు తెలిపారు. ఈ పరీక్షల ఏర్పాట్లపై మంగళవారం అధికారులతో ఆయన చాంబర్‌లో సమీక్ష జరిపారు. పరీక్షలు నెల్లూరులోని అయాన్ డిజిటల్ జోన్‌లో, కావలిలో ని పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో, రామిరెడ్డి సుబ్బరామి రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంట ల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం పరీక్షకు 8.30 నుంచి 9.15 గంటల్లోగా, మధ్యాహ్నం పరీక్షకు 1.30 నుంచి 2.15లోగా హాజరు కావాల న్నారు. హాల్‌టిక్కెట్, ఏదైనా ఫొటో ఆధారిత ధ్రువపత్రం తీసుకుని రావాలని సూచించారు. మొబైల్ ఫోన్లు నిషిద్ధమని తెలిపారు.

రాష్ట్ర ఖజానాకు ఆదాయమే పరమావధిగా కూటమి ప్రభుత్వం భూ విలువల పెంపునకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేయగా, రిజిస్ట్రేషన్ అధికారులు కూడా పెంపు నివేదికలు తయారు చేశారు. ఈనెల 20న పెంచిన మార్కెట్ విలువలను నోటీసు బోర్డుల్లో ఉంచుతారు. 24 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, 26న వాటిని పరిశీలిస్తారు. 27న తుది జాబితాకు జిల్లా మార్కెట్ విలువల కమిటీ ఆమోదం తెలుపుతుంది. ఆ తర్వాత జనవరి 1న పెరిగిన విలువలు అమలులోకి వస్తాయి.


# పేలనున్న భూ బాంబ్!

- జనవరి 1 నుంచి మార్కెట్ విలువల పెంపు
- నివేదిక సిద్ధం చేసిన రిజిస్ట్రేషన్ శాఖ

పెరగనున్న విలువలు ఇలా..

(చదరపు గజం, రూ.లలో)

| ప్రాంతం | ప్రస్తుతం | పెంపు |
|---|---|---|
| నెల్లూరులో.. | | |
| ట్రంకురోడు | 46,000 | 51,000 |
| వీఆర్సీ సెంటర్ | 38,000 | 42,000 |
| పొగతోట | 38,000 | 42,000 |
| హరనాథపురం | 14,300 | 16,000 |
| రామలింగాపురం | 23,000 | 26,000 |
| పెద్దబజారు | 38,000 | 42,000 |
| డైకస్‌రోడ్డు | 11,500 | 13,000 |
| పొట్టేపాళెం | 2,500 | 3,250 |
| స్టోన్‌హౌస్‌పేట | 28,000 | 11,500 |
| బాలాజీనగర్ | 15,000 | 16,500 |
| ధనలక్ష్మీపురం | 4,000 | 5,500 |
| బుజబుజనెల్లూరు | 3,700 | 5,000 |
| కాకుటూరు | 2,700 | 3,600 |
| కల్లూరుపల్లి | 6,000 | 7,200 |
| కావలి (మెయిన్) | 30,000 | 35,000 |
| ముసునూరు | 10,000 | 11,500 |
| మద్దూరుపాడు | 6,000 | 7,000 |
| గౌరవరం | 5,000 | 6,000 |
| కోవూరు | 3,500 | 4,000 |
| పడుగుపాడు | 4,700 | 5,000 |
| ఇనమడుగు | 2,500 | 3,000 |
| ఆత్మకూరు | 5,000 | 6,000 |
| అనంతసాగరం | 800 | 1000 |
| ఏఎస్‌పేట | 1,100 | 1,400 |
| ముత్తుకూరు | 10,000 | 11,500 |
| **భూములు (ఎకరా, రూ.లక్షల్లో)** | | |
| నెల్లూరు | | |
| కొండాయపాళెం | 81 | 105 |
| కనుపర్తిపాడు | 21.25 | 27 |
| దేవరపాళెం | 9.46 | 12.30 |
| పొట్టేపాళెం | 48.15 | 63.37 |
| కావలి | | |
| కావలి బిట్ వన్ | 53 | 60.75 |
| గౌరవరం | 7.70 | 8.86 |



నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 17 : నూతన సంవత్సర కానుకగా కూటమి ప్రభుత్వం భూముల, స్థలాల మార్కెట్ విలువలను పెంచనుంది. ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీ ఎంవీ శేషగిరిబాబు నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రేషన్లు-స్టాంపుల శాఖ అధికారులు నివేదికలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. భూములు, స్థలాల విలువలు బహిరంగ మార్కెట్‌లో అధికంగా ఉండగా, రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువ చాలా తక్కువగా ఉంటోంది. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకొని ఈసారి మార్కెట్ విలువలను జిల్లాలో 10 నుంచి 35 శాతం పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకు తగ్గట్టుగా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నివేదికలు తయారు చేసినట్లు తెలిసింది. ఆర్డీవోలను, నుడా అధికారులను సంప్రదించి విలువల పెంపునకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన మార్కెట్ విలువల కమిటీ రెండుసార్లు సమావేశమవగా తయారు చేసిన నివేదికలపై చర్చించారు. మార్కెట్ విలువలు పెంపు వల్ల ప్రజల్లో వ్యతిరేకత కాకుండా చూడాలనే అంశమై చర్చ సాగినట్లు తెలుస్తోంది. అంతేగాక మార్కెట్ విలువలు పెంచితే ప్రభుత్వానికి భూమి అవసరమైనప్పుడు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంది. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని నివేదిక

- మిగతా 6లో..

## భూ ఆక్రమణలు జరగకుండా
# ల్యాండ్ గ్రాబింగ్ చట్టం

- త్వరలో అమలులోకి తెస్తాం • అధికారుల సమీక్షలో మంత్రి ఫరూక్

నెల్లూరు హరనాథపురం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భూ ఆక్రమణలు జరగకుండా ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకొచ్చిందని, ఇందుకు నియమ నిబంధనలను రూపొందిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జరిగిన అధికారుల సమీక్షలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తప్పులు, భూకబ్జాలతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. సుమారు రూ.10 లక్షల కోట్లకుపైగా అప్పులు మిగిల్చి పోయారన్నారు. ఆ అప్పులకు అసలు, వడ్డీ, చెల్లించాల్సి వస్తుందని, వీటిని సరిచేసుకోవడానికే తమకు సమయం సరిపోతోందన్నారు. ఆర్అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చడానికి జిల్లాకు రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జనవరి 15లోగా ఈ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.67కోట్లతో 1157 సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో దేవదాయ శాఖ భూసమస్యల పరిష్కారానికి కూడా సత్వర చర్యలు చేపట్టాలని అన్నారు. ఉపాధి హామీ నిధుల కేటాయింపుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో చర్చించినట్లు చెప్పారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ త్వరలోనే అమలులోకి వస్తుందని చెప్పారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రాళ్లపాడు రిజర్వాయర్ నుంచి రైతులకు పూర్తిస్థాయిలో నీటిని అందించడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. 130 క్యూసెక్కుల నీటిని ఇస్తే చివరి ఆయకట్టుకు కూడా నీరు అందుతుందని చెప్పారు. ఇప్పటికే 100 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నామని చెప్పారు. బ్యాకమ్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన జెర్మనీ కంపెనీతో చర్చించి రిజర్వాయర్ గేట్లను తెరిపించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ సమీక్షలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో ఆలయాలకు శోభ

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి వెల్లడించారు. పది రోజుల తర్వాత తాను, మంత్రి నారాయణ ఇద్దరం నగరంలో తిరిగి నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ నూతన భవనంలో శిలాఫలకాలను మంత్రులు ఫరూక్, పొంగూరు నారాయణలతో కలిసి ఆనం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనం విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయ ఘాట్ పూర్తి చేయడంతోపాటు మూలాపేట వేణుగోపాల్‌స్వామి ఆలయాన్ని పునఃనిర్మించనున్నట్లు చెప్పారు. నగరాలు, పట్టణాలలో ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకొని దేవస్థానాల నిధులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, కురుగొండ్ల రామకృష్ణ, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ప్రాంతీయ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, ఉప కమిషనర్ కేబీ.శ్రీనివాసరావు, జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, వివిధ ఆలయాల ఈవోలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు ఆనం, ఫరూఖ్, నారాయణ, ఎమ్మెల్యేలు తదితరులు

# రెండు రోజులు భారీ వర్షాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఓ ఆనంద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. తీర ప్రాంత ప్రజలు, పెన్నానది పరీవాహక లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళవద్దని, బోట్లు, వలలు జాగ్రత్త పరుచుకోవాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశామని, వర్షాల వల్ల ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే నెంబరు 0861-2331261కు తెలియజేయాలని కోరారు. అధికార యంత్రాంగం అంతా హెడ్‌క్వార్టర్స్‌లో ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

# ప్రశాంతంగా డీసీ ఎన్నికలు

13 కమిటీలూ కూటమి నేతల కైవసం ● 21న పీసీ ఎన్నికల నిర్వహణ

నెల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీల (డీసీ) ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ఇటీవల ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు వారి పరిధిలోని డీసీ కమిటీలను ఎన్నుకున్నారు. మొత్తం 13 డీసీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఎన్నిక జరగ్గా, అన్నీ ఏకగ్రీవం అయ్యాయి. అన్నిటినీ కూటమి నేతలే దక్కించుకున్నారు. పెన్నా డెల్టాలో పరిధిలో ఎనిమిది డీసీలు, సోమశిల ప్రాజెక్టు పరిధిలో ఐదు డీసీలు ఉన్నాయి. సదరన్ చానల్ డీసీ అధ్యక్షుడిగా జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నెల్లూరు రమణారెడ్డి ఎన్నికయ్యారు. ఈస్టర్న్ చానల్-1 డీసీ అధ్యక్షుడిగా బత్తల హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా జొన్న శివకుమార్, ఈస్టర్న్ చానల్-2 డీసీ అధ్యక్షుడిగా పాశం శ్రీహరిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా అడపాల జనార్దన్‌రెడ్డి, పైడేరు ఎస్కేప్ చానల్ డీసీ-1 అధ్యక్షుడిగా రేబాల శంకర్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అల్లం రాధాకృష్ణయ్య, పైడేరు ఎస్కేప్ చానల్ డీసీ-2 అధ్యక్షుడిగా బీద గిరిధర్, ఉపాధ్యక్షుడిగా మేడా కృష్ణారెడ్డి, నెల్లూరు సప్లై చానల్ డీసీ అధ్యక్షుడిగా ఈ శివనారాయణ, ఉపాధ్యక్షుడిగా చెవిరెడ్డి అశోక్‌రెడ్డి, సర్వేపల్లి కెనాల్ డీసీ అధ్యక్షుడిగా చల్లా నాగార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆలూరు వెంకట విష్ణువర్ధన్‌రావు, జాఫర్ సాహేబ్ కెనాల్ డీసీ అధ్యక్షుడిగా సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షుడిగా దేవిరెడ్డి రవీంద్రరెడ్డి ఎన్నికయ్యారు. ఇక సోమశిల పరిధిలోని సౌత్ ఫీడర్ చానల్ డీసీ అధ్యక్షుడిగా వేలూరు కేశవులు చౌదరి, ఉపాధ్యక్షుడిగా చల్లా విజయభాస్కర్‌రెడ్డి, నార్త్ ఫీడర్ చానల్ డీసీ అధ్యక్షుడిగా మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పునుగుంట ధనుంజయ, కావలి కెనాల్ రీచ్-1 డీసీ అధ్యక్షుడిగా కండ్లగుంట మధుబాబు, ఉపాధ్యక్షుడిగా పులి శీనయ్య కావలి కెనాల్ రీచ్-2 డీసీ అధ్యక్షుడిగా వంటేరు జయచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మలిసేని హరిబాబు, కావలి కెనాల్ రీచ్-3 డీసీ అధ్యక్షుడిగా పులుగుంట మధుమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పులిమి విజయభాస్కర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. కాగా ప్రాజెక్టు కమిటీలకు 21వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. డీసీల అధ్యక్షులు వారి ప్రాజెక్టు కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. జిల్లాలో రెండు మేజర్ పీసీలు పెన్నా డెల్టా, సోమశిల ప్రాజెక్టులతో పాటు మీడియం పీసీలు కనుపూరు కెనాల్, గండిపాలెం ప్రాజెక్టు, రాళ్లపాడు ప్రాజెక్టు, వీఆర్‌కోట ఆనికట్ సిస్టమ్ ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి.

# ఇసుక ధరకు రెక్కలు

- సిండికేట్‌గా మారుతున్న ట్రాక్టర్ల యజమానులు
- నెల్లూరు నగరంలోనే ట్రక్కు రూ.2500
- టిప్పర్ ధరతో పోలిస్తే రూ.వెయ్యి అదనం
- మంత్రి నారాయణ ఆదేశాలు బేఖాతరు
- అధికారుల పర్యవేక్షణ అంతంతే!

ఇసుక ధరలకు మళ్లీ రెక్కలొస్తున్నాయి. ఉన్నత లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితం చేయగా.. రవాణాదారులు మాత్రం ఇదే తమకు అవకాశంగా మలుచుకుంటున్నారు. కేవలం రవాణా చార్జీలు మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా రెట్టింపు వసూలు చేస్తున్నారు. టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్న ధరకు. ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తున్న ఇసుక ధరకు భారీ వ్యత్యాసం ఉంటోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఉచితంగా ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ట్రాక్టర్లకు అనుమతి ఇచ్చింది. చిన్నస్థాయి వ్యక్తులకు కూడా సులభంగా ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తే.. ఇదే అదునుగా ట్రాక్టర్ల యజమానులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. నెల్లూరులో ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుకను రూ.2500 వరకూ విక్రయిస్తున్నారు. మొదట్లో ఇది రూ.1500 ఉండేది. అలాగే టిప్పర్ ద్వారా ఇసుకను సరఫరా చేసిన ప్పుడు యూనిట్ ధర రూ.2500 వరకూ పలికేది. ఆ తర్వాత అధికారులు తీసుకున్న చర్యలతో ఇప్పుడు ఆ ధర రూ.1500లకు దిగొచ్చింది. కానీ ఇందుకు భిన్నంగా ట్రాక్టర్ ధర మాత్రం రూ.1500 నుంచి రూ.2500లకు పెర గడం గమనార్హం. టిప్పర్లపై దృష్టి పెట్టిన అధికారులు ఫలితం సాధిం చారు. కానీ ట్రాక్టర్లపై నియంత్రణ లేకపోవడంతో వారు చెప్పిందే ధరగా మారిపోయింది. పెన్నాలో ట్రాక్టర్ ఇసుకను లోడింగ్ చేసేందుకు రూ.500 తీసుకుంటున్నారు. మొదట్లో ఇది రూ.300 ఉండేది. ఇక్కడే రూ.200 పెంచారు. ఇక రవాణా చార్జీలు, ఆదాయం కలుపుకుంటే మరో రూ.వెయ్యి అవుతుంది. మొత్తంగా రూ.1500లకు ఒక ట్రాక్టర్ (యూనిట్) సరఫరా చేసేందుకు వీలుంది. కానీ ట్రాక్టర్ యజమానులు రూ.500 నుంచి 1000 వరకూ పెంచారు. ఈ ధరను మరింత తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గతంలో మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలు కూడా ఇచ్చారు. అయితే అందుకు వ్యతిరేకంగా ధరలు పెరుగుతున్నాయి.

**● సమీక్షించకపోతే కష్టం**

ప్రస్తుతం యార్డుల్లో యూనిట్ ఇసుకను రూ.వెయ్యికు విక్రయిస్తున్నారు. ఒక టిప్పర్ ఏడు యూనిట్లను రూ.7 వేలకు కొనుగోలు చేసి దానికి రవాణా చార్జీలు మరో రూ.4 వేల నుంచి రూ.4500 కలుపుకొని నెల్లూరులో రూ.11 వేల నుంచి రూ.11,500 మధ్యలో విక్రయిస్తున్నారు. అదే ఏడు యూనిట్లను ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు చేయాలంటే రూ.15 వేలు అవుతోంది. సామాన్యులకు ఇది భారంగా మారింది. నిత్యం వందల ట్రాక్టర్లు పెన్నా నుంచి ఇసుకను తీసుకెళుతున్నాయి. ఇటీవల ఈ ట్రాక్టర్ల యజమానులంతా సిండికేట్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం అన్‌సీజన్ అయినా ధర పెరుగుతోందంటే ఇక రానున్న రెండు మూడు నెలల్లో సీజన్ ప్రారంభమైతే ఇంకెంత ధరలు పెరుగుతాయోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఉచిత ఇసుక పాలసీ అమలు తీరుపై జిల్లా అధికార యంత్రాంగం సమీక్షించడం లేదు. ఈ కారణంగా క్షేత్ర స్థాయిలో ఇసుక ధరలపై నియంత్రణ ఉండటం లేదు. పెన్నాలో లోడింగ్ దగ్గర నుంచి ట్రాక్టర్ల రవాణా చార్జీల వరకూ అధికారులు సమీక్షించకపోతే రానున్న రోజుల్లో ఇసుక ధరలు మరింత పెరిగే ప్రమాదముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## ● మన్నేరు ఇసుకకు డిమాండ్

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణం, పరిసర ప్రాంతాలలో మన్నేరు ఇసుకకు డిమాండ్ ఏర్పడటంతో ట్రాక్టర్ల యజమానులు అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారు. కందుకూరు ప్రాంతంలో పాలేరు, మన్నేరు, ఉప్పుటేరులలో ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇందులో పాలేరు కందుకూరుకు అతి సమీపంలో ఉండగా మన్నేరు నుంచి ఇసుక తరలించాలంటే కొంత దూరం పెరుగుతుంది. అయితే నాణ్యతపరంగా మన్నేరు ఇసుకకు డిమాండ్ ఉండటంతో దూరాన్ని ఆసరాగా చూపించి అదనంగా వసూలు చేస్తున్నారు. పాలేరు నుంచి కందుకూరుకు ట్రక్కు ఇసుక రూ.1500లకు తోలుతుండగా మన్నేరు నుంచి మాత్రం ట్రక్కుకు రూ.2100 నుంచి 2300 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మన్నేరు నుంచి ఇసుక తేవాలంటే రాను పోను పాలేరుకన్నా రమారమి 30 కి.మీ దూరం పెరుగుతుందని చెబుతూ అదనంగా వసూళ్లు చేస్తున్నారు. కాగా మన్నేరు పరివాహక గ్రామాల ప్రజలు సైతం ఏటిలోకి వెళ్లే మార్గాల వద్ద ట్రాక్టర్ల నుంచి నగదు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

# పుత్రశోకం!

- స్కూలు వ్యాను కింద నలిగిన చిన్నారి ప్రాణం
- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు

బడికి వెళుతున్న తన అన్నకు టాటా చెప్పేందుకు రెండేళ్ల చిన్నారి ఇంట్లో నుంచి బుడిబుడి అడుగులు వేసుకుంటూ బయటకు వచ్చి స్కూలు వ్యాను ముందు నిల్చున్నాడు. ఇది గమనించని డ్రైవర్ వాహనాన్ని కదిలించడంతో పసిప్రాణం చక్రాల కింద నలిగిపోయి విలవిలకొట్టుకుంది. కళ్లెదుటే కుమారుడు విగతజీవిగా మారడంతో ఆ తండ్రి రోదన మిన్నంటింది. కందుకూరు మండలం అనంతసాగరంలో మంగళవారం ఉదయం ఈ విషాదం చోటు చేసుకుంది.



వ్యాన్ కింద పడి మృతి చెందిన రెండేళ్ల బాబు

కందుకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతసాగరం గ్రామానికి చెందిన గోగినేని శ్రీకాంత్ పెద్ద కుమారుడు (5) పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కి వెళ్తున్నాడు. మంగళవారం ఉదయం కుమారుడ్ని స్కూలు వ్యాన్ ఎక్కించేందుకు శ్రీకాంత్ వెళ్లాడు. వీరివెంటే బుడిబుడి అడుగులు వేసుకుంటూ వెళ్లిన చిన్న కుమారుడు వ్యాన్ ముందు నిల్చున్నాడు. ఆ చిన్నారిని ఎవరూ గమనించకపోగా డ్రైవర్

- మిగతా 6లో..

## మొదటి చాటింపు వచ్చిందోచ్..



ఈ నెల 31న జరుగనున్న స్థానిక గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మల తిరునాళ్లకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తొలి చాటింపు వేయించారు. అంతకుముందు ఊరు ప్రజలు పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని గ్రామ పెద్దకాపు నలగట్ల మహేష్‌రెడ్డి, పెద్ద గొల్ల మేగ సుబ్బయ్య, పెద్ద మాదిగ ఈపూరు బ్రహ్మయ్యలతో పాటు అన్ని కులాల పెద్దలు చేరుకొని ఈ చాటింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అనంరాజు బాలకృష్ణంరాజు, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, కత్తుల విజయకుమార్ ఉన్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

## విద్యుత్‌ను వృథా చేయొద్దు

నెల్లూరు (జడ్పీ), డిసెం బరు 17 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్‌ను వృథా చేయ వద్దని, దేశాభివృద్ధి విద్యుత్ వినియోగంపై ఆధారపడి ఉందని, దీనిని ప్రతి ఒక్క రూ అవగాహన చేసుకోవా ల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా నెల్లూరులోని విద్యుత్ భవన్ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. దీనిని జేసీ ప్రారంభించి ప్రసంగించారు. విద్యుత్ వృథాను అరికట్టి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎస్‌ఈ మాట్లాడుతూ విద్యుత్ పొదుపుపై గ్రామస్థాయి నుంచి అవగా హన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పా రు. స్టార్ రేటింగ్ పరికరాల ద్వారా విద్యుత్‌ను పొదుపు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు శేషాద్రి బాలచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, పరంధామయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





### తిరుమల ప్రత్యేక దర్శన
# టికెట్లు కేటాయించండి

● రాష్ట్ర మంత్రులతో తమిళనాడు మంత్రి రాజేంద్రన్ భేటీ

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు తిరుమల ప్రత్యేక దర్శన టిక్కెట్లను కేటాయించాలని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణలను తమిళనాడు పర్యాటకాభివృద్ధి శాఖ మంత్రి రాజేం ద్రన్ కోరారు. ఆయన మంగళవారం నెల్లూరులో మంత్రి రామ నారాయణరెడ్డి ఇంటికి విచ్చేశారు. తమిళనాడు టూరిజం శాఖకు 1974 నుంచి తిరుమల దర్శనానికి స్పెషల్ ఎంట్రీ టిక్కెట్లు ఇస్తు న్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం టీటీడీ బోర్డు అన్ని కార్పొరేషన్లకు తీర్థ దర్శన కోటాను రద్దు చేసిందని, దీని పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విష యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి



మంత్రులు ఆనం, నారాయణ, ఫరూక్‌తో తమిళనాడు మంత్రి రాజేంద్రన్

తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి ఆనం సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### బెల్టు దుకాణాలపై
## ఎక్సైజ్ దాడులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో బెల్టు దుకాణాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి వద్ద మద్యం విక్రయిస్తున్న ఎర్రకట్ట సంఘానికి చెందిన ఏ వెంకయ్యను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 9 క్వార్టర్ సీసాల మద్యం స్వాధీనం చేసుకు న్నారు. ఇర గాళమ్మ సంఘం సమీపంలోని బస్సు షెల్టర్ వద్ద అదే ప్రాంతానికి చెందిన రామకృష్ణను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 15 క్వా ర్టర్ల మందు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ బెల్టు దుకాణాలు నిర్వహి స్తున్న వారి సమాచారాన్ని ప్రజలు తెలియజేయాలని కోరారు.

## పుత్రశోకం!

(5వ పేజీ తరువాయి)

కూడా చూసుకోకుండా వ్యాన్‌ను కదిలించటంతో చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నారి మృతదేహానికి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ముక్కుపచ్చలారని చిన్నారిని వ్యాన్ రూపంలో మృత్యువు కబలించటంతో అనంతసాగరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### పేలనున్న
## భూ బాంబ్!

(5వ పేజీ తరువాయి)

తయారు చేస్తున్నారు. జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాలలో అంకణం విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేలు, లక్షల్లో ఉంటోంది. ఇక ఎకరా భూమి రూ.కోట్లు పలుకుతోంది. అయితే, రిజిస్ట్రేషన్‌శాఖ మార్కెట్ విలువలు మాత్రం రూ.వేలు, లక్షలు దాటడం లేదు. దీంతో భూముల మార్కెట్ విలువల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో చాలా ప్రాంతాలలో వ్యవసాయ భూములు ఇళ్ల స్థలాలుగా మార్పు చెందాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మారుస్తూ భూమార్పిడి జరిగింది. జిల్లా అంతా దాదాపుగా నుడా పరిధిలో ఉంది. మార్కెట్ విలువలకు సంబంధించిన అన్ని అంశాలపై తుది నివేదిక తయారైంది. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాలలో రెండేళ్లకొకసారి రిజిస్ట్రేషన్ విలు వలు పెంచుతారు. ఈసారి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కూడా ఈ విలువలు పెరగనున్నాయి. జనవరి 1వ తేదీన ఈ పెంపు అమలులోకి వస్తుంది. ఈనెల 20న పెంచిన మార్కెట్ విలువలను నోటీసు బోర్డులలో ఉంచుతారు. 24 వరకు ప్రజల అభ్యంతరాలు స్వీకరిస్తారు. 26న వాటిని పరిశీలించి, 27న తుది జాబితాకు జిల్లా మార్కెట్ విలువల కమిటీ ఆమోదం తెలుపుతుంది. ఆ తర్వాత జనవరి 1న పెరిగిన విలువలు అమలులోకి వస్తాయి.

## నేడు ఎల్‌టీ, ఫార్మాసిస్టుల మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేసు కున్న వారి మెరిట్ జాబితా బుధవారం విడుదల చేస్తు న్నట్లు డీఎం హెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు ల్యాబ్ టెక్నీషియన్, రెండు ఫార్మాసిస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే 19వ తేదీలోపు వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యంలో తెలియచేయాలని కోరారు.

# ‘పది’కి వంద రోజుల ప్రణాళిక

● ఉత్తమ ఫలితాల సాధనకు చర్యలు ● వెనుకబడిన విద్యార్థులపైనే ప్రత్యేక దృష్టి



నెల్లూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పదోతరగతి తొలిమెట్టు. ఇందులో తన ‘మార్క్’ చూపాలని ప్రతి విద్యార్థి ఆశిస్తుంటాడు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లోని చాలా మంది విద్యార్థులు గట్టెక్కలేకపోయినట్లు గణాంకాలు కూడా తెలుపుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టెన్త్‌పై ప్రత్యేక దృష్టి సారించి, పది విద్యార్థులు అత్యున్నతంగా రాణించేలా కార్యాచరణ సిద్ధం చేసింది. మారిన సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటుతో తాత్కాలిక ఏర్పాట్లు చేసింది. పరీక్షల షెడ్యూల్ కూడా విడుదల కావడంతో డిసెంబరు నుంచి మార్చి వరకు వందరోజుల ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశాలు వెలవడటంతో ఆ మేరకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

● విద్యార్థుల లోపాలను గుర్తిస్తూ..

పదోతరగతి పరీక్షలను ఓ సమరంలా భావించి విద్యార్థులు సన్నద్ధమవుతుండగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తోడ్పాటు అందిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన పరీక్షల షెడ్యూల్ ప్రకారం మార్చి 17వ తేదీన ప్రధాన పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సరిగ్గా మూడు నెలల వ్యవధి ఉండటంతో పక్కా ప్రణాళికతో విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు వందరోజుల ప్రణాళికలను అనుసరిస్తున్నారు. జిల్లాలో 30వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, వీరందరికీ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ రోజుకో సబ్జెక్ట్‌లో పునఃశ్చరణ పరీక్షలు రాయిస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్ది విద్యార్థుల లోపాలను మెరుగుపరుస్తున్నారు. వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. అలాగే ఈ ఏడాది టెన్త్ పరీక్షల విధానం కొంత మారింది. గత ఏడాది ఫిజికల్ సైన్స్, సోషల్‌స్టడీస్‌లు ఒకే ప్రశ్నపత్రంలో ఇచ్చారు. దీనివల్ల విద్యార్థులు తికమకకు గురయ్యారు. మూల్యాంకనంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఈ ఏడాది ఈ రెండింటినీ విడివిడిగా 50 మార్కుల చొప్పున నిర్వహించేందుకు టైంటేబుల్ ప్రకటించారు. అదే విధంగా విద్యార్థికి తమ ఇష్టానుసారం తెలుగు మాధ్యమంలోనూ పరీక్ష రాసే వీలు కల్పించారు.

### విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



టెన్త్ విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు పీరియడ్లు, స్టడీ అవర్స్ చేపట్టి రోజూ ఆరో పీరియడ్ లో పరీక్షల నిర్వహిస్తు న్నాం. సబ్జెక్ట్ నిపుణులు తయారు చేసిన ప్రశ్న పత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని నిత్యం విద్యార్థులతో రాయిస్తున్నాము. అంతేగాక టర్మ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల స్థాయిని నిర్ణయించి వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము. సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులు 6 నుంచి 8 మంది వరకు ఒక్కో ఉపాధ్యాయుడు దత్తత తీసు కుని మంచి మార్కులు సాధించేలా తీర్చిదిద్దేలని ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థుల అంతర్గత మార్కుల వివరాలను తల్లిదండ్రులతో చర్చించి ప్రోగ్రెస్ కార్డులను అందిస్తున్నాము. అలాగే, ఇంటి దగ్గర కూడా పిల్లల్ని చదివించేలా దిశానిర్దేశం చేస్తున్నాము.

- డాక్టర్ ఆర్.బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

### కోళ్ల వ్యర్థాల
## వాహనాల స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. ఇతర ప్రాంతాల నుంచి మండలంలోని కాగులపాడు గ్రామ శివారు నుంచి దామరమడుగుకు వెళ్లే మార్గంలో కోవూరు కాలువ వెంబడి ఉన్న చేపల గుంతలు, నెల్లూరు చంద్రారెడ్డి స్కూలు వెనుక చేపల గుంతలకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డిలు దాడులు నిర్వహించి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ‘పది’ విద్యార్థులకు రేపటి నుంచి ఎడిట్ ఆప్షన్

నెల్లూరు(విద్య), డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సంబంధించి ఫీజు చెల్లింపు గడువు ముగిసిందని, దరఖాస్తులో తప్పులు సరిదిద్దుకునేందుకు పాఠశాల లాగిన్‌లో ఎడిట్ ఆప్షన్ ఈనెల 19 నుంచి 23వతేదీ వరకు అందుబాటులో ఉంటుందని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానోపాధ్యా యులు స్కూల్ రికార్డులు, ఆపార్ ఐడీ ఆధారంగా పరిశీలించి విద్యార్థులు మార్పులు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఈ ఆప్షన్‌లో విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, ప్రథమ, ద్వితీయ లాంగ్వేజ్‌లను మార్పు చేసుకోవడం, మీడియంను, పుట్టుమచ్చలను, ఫొటో మరియు సంతకాలతో పాటు మరికొన్ని అంశాలను ఎడిట్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

## చిట్టీల పేరుతో మోసం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చిట్టీల పేరుతో మోసగించిన వ్యక్తిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్‌లో ఆక్వా టెక్నీషియన్ నరేంద్ర నివసిస్తు న్నాడు. ఆయన మూలాపేటకు చెందిన చిరంజీవి వద్ద రూ.10 లక్షల చీటీ వేసి పదహారు నెలలు కట్టా రు. అనంతరం చీటీపాట పాడుకున్నారు. రెండు నెలలుగా చిరంజీవి ఫోన్ తీయకుండా సమా ధానం చెప్పకుండా తప్పించుకొని తిరుగుతు న్నాడు. తనలాగే పలువురిని మోసగించాడని తెలుసుకుని విషయాన్ని చిరంజీవి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు కొంత సమయం ఇస్తే డబ్బు కడతామని చెప్పడంతో కొంతకాలం వేచిచూశాడు. ఇటీవల నగదు కోసం గట్టిగా నిలదీయడంతో వారు అసభ్యకర పదజాలంతో దూషించారు. దీంతో బాధితుడు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పేదలకు ఆపన్నహస్తం..
# సామాజిక చైతన్యం

ఉదయగిరి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మారుమూల పల్లెలో జన్మించిన ఆ యువకుడు ఆనాడు వసతి గృహంలో కడుపునింపుకొని చదువును సాగిస్తున్న తరుణంలో అప్పటి సమాజంలో నెలకొన్న అసమానతలు, బడుగు, బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించిపోయాడు. ఏనాటికైనా వాటిని రూపుమాపేందుకు తనవంతుగా పోరాడాలని సంకల్పించాడు. అనంతరం వాటికి రూపకల్పన చేస్తూ లార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించిన జడదేవి గ్రామానికి చెందిన నూనె ప్రసాద్ తన ఆలోచనలను ఆచరణ రూపంలో పెడుతూ నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సామాజిక చైతన్యం కోసం తనవంతుగా అడుగులు వేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 1990-91 కాలంలో జిల్లా కేంద్రాలు, పట్టణాలకే సంస్థలు పరిమితమైన కాలంలో తొలుత ఓ సంస్థలో ఆర్గనైజర్‌గా విధులు నిర్వర్తించిన ప్రసాద్ పల్లె ప్రాంతాలకు సైతం విస్తరింపచేయాలనే ఉద్దేశంతో 1993లో స్వతహాగా ఓ సంస్థను ప్రారంభించి ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. అందుకు ప్రతిఫలంగా 2006లో జరిగిన ఎన్నికల్లో గ్రామస్థులు ఆయన్ను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. చదువు పూర్తయిన తర్వాత పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చినా కుటుంబ సభ్యులు అంగీకరిం చకపోవడంతో ఉద్యోగాన్ని సైతం వదులుకున్న ఆయన సేవా కార్యక్రమాలకే పరిమితం అయ్యారు.



వసతిగృహంలో చదువుకుంటున్న విద్యార్థినులు




ప్రజలకు అవగాహన కల్పిస్తూ..




అవార్డు అందుకున్న నూనె ప్రసాద్

- ప్రకాశం జిల్లా పామూరులో పేద విద్యార్థులకు వేర్వేరుగా వసతిగృహాల ఏర్పాటు
- వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, పామూరు మండలాల్లో వయోజక విద్యా కేంద్రాలు ఏర్పాటు, జనన, మరణ నమోదుపై అవగాహన
- ఉదయగిరి మండలంలో మాతంగి నిర్మూలనపై చైతన్యం
- కావలి డివిజన్ పరిధిలో టీబీ, హెచ్‌ఐవీ, ఎయిడ్స్, ఫైలేరియా, కుష్ఠు తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.
- దుత్తలూరు మండలంలో తాగునీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన
- వరికుంటపాడు, దుత్తలూరు, పామూరు, సీఎస్‌పురం మండలాల్లో కొవిడ్-19 సమయంలో అవగాహన, ఆహారం సరఫరా
- దుత్తలూరు, పామూరు మండలాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి బోర్ల ఏర్పాటు
- వరికుంటపాడు మండలంలో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన
- దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ
- ఉదయగిరి కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహణ
- పలు మండలాల్లో సంచార జాతుల పిల్లల కోసం సాయంత్రం పాఠశాలల ఏర్పాటు
- ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలపై అవగాహన
- సర్పంచు, ఎంపీటీసీ, వార్డు సభ్యులకు విధులు, హక్కులపై అవగాహన
- ప్రతిఏటా ప్రత్యేక దినోత్సవాలు నిర్వహించి ప్రాముఖ్యతపై అవగాహన

### అందుకున్న అవార్డులు

పేదల కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన నూనె ప్రసాద్ అనేక అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకొని ఉన్నతాధికారులు, పలు సంస్థల ప్రతినిధుల నోట శభాష్ అనిపించుకుంటున్నారు.

- 2010లో హైదరాబాదులోని దళిత కళామండలి నిర్వహించిన కార్యక్రమంలో దేశ ఫెలోషిప్ అవార్డు అందుకున్నారు.
- 2014లో ఢిల్లీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు
- 2017లో చెన్నైలో జరిగిన ఆదిఆంధ్ర అరుంధతి మహాసభలో దళిత అవార్డు
- 2021లో కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా అవార్డు
- 2022లో చెన్నైలో వరల్డ్ ఆర్యవైశ్య మహాసభలో అవార్డు
- అదే ఏడాది నెల్లూరులో బెస్టు సోషల్ వర్కర్ అవార్డు అందుకున్నారు.
- 2024 ఆగస్టులో నెల్లూరులోనూ, డిసెంబరు 5న నెల్లూరులో నిర్వహించిన వరల్డ్ వలంటీర్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు అందుకున్నారు.

### సంతోషంగా ఉంది



చిన్నప్పుడు నేను అనుభవించిన కష్టాలు ఇప్పటితరానికి దూరం చేయాలనే సంకల్పంతో కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉంది. నావంతు శక్తితోపాటు దాతల సహకారంతో సంస్థను కొనసాగిస్తున్నా. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నాం.

- నూనె ప్రసాద్, లార్డ్ సంస్థ అధ్యక్షుడు

## మహిళలతో అసభ్య ప్రవర్తన

● ఇద్దరిపై పోలీసు కేసు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించారన్న అభియోగంతో ఇద్దరు వ్యక్తులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని వాకర్స్ రోడ్డుకు చెందిన మహిళలు లక్ష్మీ వైన్‌షాపునకు వ్యతిరేకంగా గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం లక్ష్మీ వైన్‌షాపులో పనిచేస్తున్న ఓ వ్యక్తి మూత్ర విసర్జన చేసుకుని తన మర్మాంగాన్ని ఆందోళన చేస్తున్న మహిళలకు చూపించి అసభ్యకరంగా సైగలు చేశాడు. అదే క్రమంలో షాపులోని క్యాష్ కౌంటర్‌లో ఉన్న మరో వ్యక్తి డబ్బు చూపిస్తూ సైగలు చేయడమేకాక వీడియోలు, ఫొటోలు తీశారని మహిళలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మద్యం దుకాణం
## క్యాషియర్‌పై దాడి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బ్రాందీషాపు క్యాషియర్‌పై దాడి ఘటనపై చిన్నబాజరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని అయ్యప్పగుడి సెంటర్ సమీపంలో ఉన్న టీచర్స్ కాలనీకి చెందిన కే శ్రీనివాసులు పరమేశ్వరీ నగర్‌లోని లక్ష్మీవైన్స్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. షాపు ప్రారంభమైన రోజు నుంచే కోటమిట్టకు చెందిన జాబేర్, జిలానీ, మరికొందరు దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలని ఆందోళన చేస్తున్నారు. దీనిపై శ్రీనివాసులు గతంలో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ రాత్రి శ్రీనివాసులు షాపులో ఉండగా జాబేర్, జిలానీ మరికొందరు దాడి చేశారు. మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. గాయాల పాలైన క్యాషియర్ మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం



సన్మానం అనంతరం సీనియర్ పెన్షనర్లతో నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని భక్తవత్సల నగర్ పెన్షన్ భవన్‌లో మంగళ వారం జాతీయ పెన్షనర్ల దినోత్స వం ఘనంగా జరిగింది. పెన్షనర్స్ సంఘం గౌరవాధ్యక్షుడు వితపు బాల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెన్షనర్స్ జెండా, 2025 పెన్షనర్స్ క్యాలెండరును ఆవిష్కరించారు. పెన్ష నర్స్ మూలపురుషుడు డీఎస్ నీకరా, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పీఎస్ రామానుజాచార్యులు చిత్రపటాలకు పుష్పమాలలు వేసి నివాళులు అర్పించా రు. పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం గౌస్, ఉపాధ్యక్షులు గురు నాథం, కేఎస్ జ్ఞానరత్నం, ఖాజా రసూల్ ఉపన్యసిం చారు. జిల్లా ట్రెజరీ అధికారి మాట్లాడుతూ గంగాద్రి మాట్లాడుతూ పెన్షనర్స్ 2025 ఫిబ్రవరి 25లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. కలెక్టరేట్, బాలాజీనగర్, మూలాపేటలో లైఫ్ సర్టిఫికెట్ల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరా డెంటల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ కే వివేకానంద వృద్ధాప్యంలో దంత సమస్యలు, నివారణ చర్యలను వివరించారు. అనంతరం 30 మంది సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి, కోశాధికారి హజరత్తయ్య, వైస్ ప్రెసిడెంట్ వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కావలి

## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



# అందని 'ల్యాబ్' సేవలు

- అర్బన్ హెల్త్‌సెంటర్‌లో లేని టెక్నీషియన్
- వ్యాధి నిర్ధారణకు ప్రజల ఇబ్బందులు
- ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయిస్తున్న రోగులు

కందుకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోవూరురోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్‌సెంటర్‌లో తగినంత వైద్య సిబ్బంది, వ్యాధి నిర్ధారణకు కీలకమైన ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందటం లేదు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పట్టణంలోని క్లబ్ సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ల్యాబ్ టెక్నీషియనే ఇక్కడ కూడా డిప్యుటేషన్‌పై వారంలో రెండురోజులు విధులు నిర్వహిస్తున్నారు. ఏ చిన్న వ్యాధి నిర్ధారణకు వెళ్లి పరీక్షలు చేయించుకుని రమ్మని సూచిస్తుండటంతో కోవూరు రోడ్డు అర్బన్ హెల్త్‌సెంటర్ పరిసరాల్లో ఎస్టీ కాలనీలు, జనార్దన కాలనీ, ఏకలవ్య నగర్, ఉప్పు చెరువు, బొగ్గులసంఘం తదితర నిరుపేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని హంగులతో నూతన భవనం నిర్మించి అన్నిరకాల పరికరాలు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోతున్నదని స్థానికులు వాపోతున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవటం, సిబ్బంది కొరత కారణంగా మిగిలిన సిబ్బంది, డాక్టరు కూడా పూర్తిస్థాయిలో తమ సేవలు వినియోగించటం లేదన్న విమర్శలు ఉన్నాయి.


కోవూరు రోడ్డులో ఏడాదిక్రితం ప్రారంభమైన అర్బన్ హెల్త్‌సెంటర్

## గుంతలు పూడ్చివేత


కోఆపరేటివ్ కాలనీలోని గుంతకు వేసిన సిమెంట్ కాంక్రీట్

కావలి, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో దెబ్బతిన్న రోడ్లకు అధికారులు మంగళవారం ప్యాచ్‌వర్క్ పనులను చేపట్టారు. 40వార్డులలోని గుంతలను ఊడ్చివేశారు. అలాగే పట్టణంలోని మరికొన్ని వార్డులలో పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. నెలాఖరులోగా పనులు పూర్తిచేస్తామన్నారు.

## పెన్షనర్ల సామాజిక దృక్పథం అభినందనీయం

- పెన్షనర్ల దినోత్సవంలో డీఎస్పీ శ్రీధర్


సన్మానం అందుకున్న సీనియర్ పెన్షనర్లు

కావలి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు సామాజిక దృక్పథం కలిగి ఉండటం అభినందనీయం అని డీఎస్పీ శ్రీధర్ అన్నారు. ఆలిండియా పెన్షనర్ల దినోత్సవంను పురస్కరించికొని కావలి తాలూకా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా డీఎస్పీ శ్రీధర్ పాల్గొన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలైన పెన్షనర్లకు బహుమతులు అందజేశారు. సీనియర్ పెన్షనర్లను శాలువా,పూలమాలు మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య, సహాధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి ఆదిశేషులు, వెంకయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### పేదలకు పండ్లు పంపిణీ

ఉలవపాడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటిరెడ్డికుంట ఎస్టీ కాలనీవాసులకు మంగళవారం హైకోర్టు జూనియర్ న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు, మన్నం శ్రీహరిబాబు పండ్లు పంపిణీ చేశారు. శానంపూడి ఉన్నం కార్తీక్ పుట్టినరోజు సందర్భంగా చేపట్టిన కార్యక్రమంలో తొట్టెంపూడి సుబ్బారాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### కుట్రలను తిప్పికొట్టాలి

ఉదయగిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై కొంతమంది మాలలు చేస్తున్న కుట్రను మాదిగలు తిప్పికొట్టాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ పేర్కొన్నారు. మంగళవారం ఏబీఎం చర్చి ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జిల్లాలో జరగనున్న మంద కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాషువా, బెజవాడ బాలగురవయ్య, పందిటి అంబేడ్కర్, డేవిడ్, మోహన్, సింహాద్రి పాల్గొన్నారు.

### కూలీల సంఖ్య పెంచాలి

ఉదయగిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులకు వచ్చే రోజువారి కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పట్టణ సమీపంలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. మస్టర్లలో హాజరును తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. క్షేత్ర సహాయకులు కూలీలకు కొలతలు కేటాయించి పనులు చేయించాలన్నారు.

### 32 మందికి ఉద్యోగాలు

ఆత్మకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 69 మంది పాల్గొన్నారు. వీరికి పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హులైన 32మందికి ఉద్యోగాలిచ్చారు. వారిని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూమ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అభినందించారు.

### ధనుర్మాస పూజలు

వింజమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమలనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు, హారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా మేకల వెంకటరమణయ్య-ప్రసన్న దంపతులు, వారి కుమారులు వెంకటహేమంత్ యాదవ్, వెంకట నిఖిల్, ఆర్య వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ కౌన్సిలర్‌గా చెంచలబాబు

వింజమూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల యూటీఎఫ్ నాయకుడు గాలం చెంచలబాబు యాదవ్‌ను యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నుకున్నట్లు మండల నాయకులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆయన్ను మూడోసారి ఎన్నుకోవడం పట్ల యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, వీరాంజనేయులు, పరమేశ్వరరావు, శివకుమార్, సుబ్బారావు, నరసింహులు, మీరావలి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ

కందుకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, సాంకేతిక అధికారి సుకుమార్‌లు స్థానిక ఏఓ రాముతో కలిసి మంగళవారం పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపుల యాజమానులకు పాటించాల్సిన సూచనలు తెలిపారు.

### ఆంజనేయరెడ్డిని కలిసిన అమరా

కావలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జీఎస్టీ సభ్యులు అమరా వెంకటసుబ్బారావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందంతో కలిసి మంగళవారం నెల్లూరులో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డిని కలిశారు. కావలిలో బీజేపీ బలోపేతానికి చేట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వ్యాపారులకు కేంద్ర జీఎస్టీతో ఎదురయ్యే ఇబ్బందులను చర్చించారు.

### ఓరియంటేషన్‌పై శిక్షణ

సీతారామపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, మండల అధికారులకు ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన ఓరియంటేషన్‌పై శిక్షణ ఇచ్చారు. అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# రైతులకు అన్నివేళలా అందుబాటులో ఉంటాం

- పైడేరు ఎస్కేప్-2 చానల్ అధ్యక్షుడిగా బీద గిరిధర్, కావలి కాలువ డీసీ-2కి వంటేరు

అల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సాగునీటి సమస్యలు తలెత్తకుండా కృషి చేస్తానని పైడేరు ఎస్కేప్-2 ఛానల్ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడిగా బీద గిరిధర్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో డైరెక్టర్లు ఆయన్ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఎన్నికల అధికారులు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బీద గిరిధర్ మాట్లాడుతూ రైతులు తమకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధ్యక్ష ఉపాధ్యక్షులు గిరిధర్‌కు, కృష్ణారెడ్డిలకు కార్యకర్తలు అభిమానులు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, బండి అమర్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, తోట శ్రీహరి, కృష్ణచైతన్య, పాపనబోయిన రత్తయ్య, అరగల రమణయ్య, సామంతుల పరంధామరెడ్డి పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలు మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండల నోడల్ అధికారి నారాయణయ్య ఆధ్వర్యంలో కావలి కెనాల్ అధ్యక్షుడి ఎన్నిక జరిగింది. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలో ఎన్నికైన ఎస్వీ పీఎం-1, 2 అధ్యక్షులు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, యన్నాబత్తిన రమణయ్య, చామదల బీ-1 పేరం వెంకటేశ్వర్లురెడ్డి, తలమంచి మేజర్ పులి శీనయ్యలు దామవరం మైనర్ అధ్యక్షుడు కండ్లగుంట మధుబాబునాయుడు, ఉపాధ్యక్షుడిగా పులి శీనయ్యను ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాగునీటి సంఘాల ఎన్నికల అధికారి అశోక్‌కుమార్ మధుబాబునాయుడుకు, పులి శీనయ్యలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమం లో టీడీపీ నేతలు ముంతాల వెంకయ్య, గనిపినేని నాగరాజు, గన్నేషం రమేష్‌రెడ్డి, పేరం కృష్ణారెడ్డి, శ్రీహరినాయుడు, పుచ్చకాయల రమేష్ ఉన్నారు.

**జలదంకిలో..**

జలదంకి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కావలి కాలువ-2 డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలో సోమవరప్పాడు మేజర్ కాలువ అధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి కావలి కాలువ డీసీ-2 అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చామదల-2 మేజర్ కాలువ అధ్యక్షుడు మలినేని హరిబాబునాయుడు ఉన్నారు. ఎన్నికను ఎన్నికల అధికారి నుంచి వారు నియామకపత్రం అందుకున్నారు. ఎన్నికైన వీరిని నీటి సంఘం అధ్యక్షులు పూనూరు భాస్కర్‌రెడ్డి, వంటేరు భాస్కర్ రెడ్డి, హరిబాబు, టీడీపీ నేతలు మునగాల తిరుమలరెడ్డి, చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, కరియావుల అప్పలయ్యనాయుడు, గుర్రం ప్రవీణ్‌బాబులు అభినందించారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న బీద గిరిధర్


నియామకపత్రం అందుకుంటున్న వంటేరు జయచంద్రారెడ్డి

## పంటల బీమా చేసుకోండి

- వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి, అల్లూరు



అల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు బీమా ప్రీమియం చేసి ఇన్సూరెన్స్ సౌకర్యం పొందాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎకరానికి రూ.168 చెల్లిస్తే పంట బీమా వర్తిస్తుందన్నారు.

**? వరి సాగులో ఏర్పడే ప్రధాన సమస్య.**

! ప్రారంభ దశలో అత్యధికంగా తెల్లతెగులు వస్తుంది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో అగ్గితెగులు వ్యాపిస్తుంది. తెల్లతెగులు నివారణకు క్లోర్-50, అగ్గితెగులుకు ట్రైసైక్లోజోల్ పిచికారీ చేసుకోవాలి.

**? పీఎం కిసాన్ పథకంలో అనర్హులను గుర్తించారా.**

! మండలంలో జరిగిన సర్వే అనంతరం జరిగిన పరిశీలనలో 263మంది అనర్హులుగా గుర్తించాం. రెండోసారి విచారణ చేపట్టి అర్హులుంటే వారిని కొనసాగిస్తాం. అనర్హుల వివరాలు ఉన్నతాధికారులకు పంపుతాం.

**? యూరియా ఎందుకు డిమాండ్ ఏర్పడింది.**

! రబీ సీజనులో అల్లూరులోని రెండు సొసైటీల్లో యూరియాకు డిమాండ్ ఎక్కువగా ఉంది. మిగిలిన ప్రాంతాల్లో యూరియా అందుబాటులో ఉంది. మరో రెండురోజుల్లో ఈ రెండు సొసైటీలల్లో 60టన్నుల యూరియాను అందుబాటులో ఉంచాం.

**? దిగుబడి సమయానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అవుతాయా.**

! గత పరిస్థితి గురించి నాకు తెలియదు. ఈ రబీ సీజను పూర్తి చేసుకునే నాటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ఈ కేంద్రాలతో విక్రయించుకునే రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలి. కౌలు రైతులు కూడా తమ కౌలుపత్రాల ద్వారా ఈ-పంట నమోదు చేసుకుంటే దిగుబడి అమ్ముకునేందుకు అర్హత పొందగలరు.

# మందాటి చెరువును సంరక్షించండి

కావలి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముసునూరు 14వ వార్డు సచివాలయంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా మందాటి చెరువు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు చెరువు పరిరక్షణ సమితి బాధ్యులు ఇంటూరి రమణయ్య, బీజేపీ పట్టణ కార్యదర్శి మందా కిరణ్, జనసేన నాయకులు శ్రీనాథ్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. హిందూ శ్మశాన వాటిక స్థలం ఆక్రమణలు తొలగించాలని కోరారు. ప్రధానంగా ముసునూరులో ఎక్కువగా చుక్కల భూముల సమస్యలు, రాళ్లగుట్ట పోరంబోకు స్థలాలు, క్వారీ పోరంబోకు స్థలాలపై వినతులు అందజేశారు.

- కందుకూరు: వలేటివారిపాలెం మండలం సింగమనేనిపల్లిలో దేవాయికుంట ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలని సామాజిక కార్యకర్త చిడిపోతు వెంకటేశ్వర్లు మంగళవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో జరిగిన సదస్సులో ఆయన పూర్తి ఆధారాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.
- ఉదయగిరి: కుర్రపల్లిలో తహసీల్దారు సుభద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజలు, రైతులు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో డీటీ హసీనా, వీఆర్వో అనూష, సర్వేయర్లు రమణ, శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- దుత్తలూరులో:అయినపల్లిలో తహసీల్దారు వై.నాగరాజు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలు సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకట్, సర్వేయరు శివ, సిబ్బంది పాల్గొన్నారు.
- కలిగిరి: రెవెన్యూ సదస్సులు చప్పగా సాగుతున్నాయి. అధికారుల నుండి పూర్తి స్థాయిలో సమాచారం లేకపోవడంతో సదస్సులకు రైతులు హాజరుకావడం లేదు. ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న భూ సమస్యలపై పరిష్కారం లభించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలిగిరి పంచాయతీ పరిధిలో వివిధ భూ సమస్యలపై జరిగిన సదస్సులో 50అర్జీలు మాత్రమే అందినట్లు అధికారులు తెలిపారు. జిర్రావారిపాలెంలో భూములు తప్పుగా నమోదై ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 1నుండి 500వరకు రీసర్వే చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపతున్నారు.
- వలేటివారిపాలెం: శింగమనేనిపల్లె పంచాయతీ కార్యాలయంలో అధికారులు గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్‌అమీద్ పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో మస్తాన్, రైతులు పాల్గొన్నారు.


కలిగిరి: అర్జీ అందజేస్తున్న రైతులు

## కాంట్రాక్టు అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కందుకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అకాలంగా మరణించిన స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వజూనియర్ కళాశాల కాంట్రాక్టు ఇంగ్లీష్ అధ్యాపకుడు ఛాత్రాసి భాస్కరరావు కుటుంబానికి మంగళవారం అధ్యాపకులు రూ.3,36,600లను అందజేశారు. కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో మృతుడి భార్య, కుమార్తె పేరుతో ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ అందరి సహకారంతో మొత్తాన్ని సమకూర్చినట్లు తెలిపారు. కృషి చేసిన అధ్యాపకులు బాబూరావు, హజరత్తయ్య, కాశీరత్నంలను ప్రిన్సిపాల్ అభినందించారు.


కుటుంబసభ్యులకు డిపాజిట్ పత్రాలను అందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

## సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

ఉదయగిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. మంగళవారం స్త్రీశక్తి భవనంలో పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ నిర్వహించారు. జడ్పీటీసీ రామాంజనేయులు, మండల వైస్ మట్ల శాంతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివా సరాజు, ఈవోపీఆర్డీ కరీముల్లా, ఏపీఎం ఖాజా రంతుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను పాల్గొన్నారు.

- చేజర్ల: ప్రజాప్రతినిధులతో అధికారులు భాగస్వామ్యమై సమన్వయంతో పనిచేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలని ఏపీఎస్ఐఆర్డీ పీఆర్ రాష్ట్ర పరిశీలకులు రమేష్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై ఎంపీ డీవో విజయలలిత సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నారాయణ, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ శివ పాల్గొన్నారు.

# మోటార్లతో కుడి కాలువకు నీరివ్వాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుల డిమాండ్


లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించిన ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు

లింగసముద్రం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గేటు మరమ్మతు చేసేవరకు రైతాంగానికి మోటర్లతో నీరు లిఫ్ట్ చేసి కుడి కాలువకు నీరు అందించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండురోజులుగా నీటికోసం రోడ్డెక్కిన రైతన్నలకు అండగా రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఏపీ రైతు సంఘం నాయకులు విరిగిపోయిన రాళ్లపాడు ప్రాజెక్టు కాలువ గేట్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రతిఏడాది నీటి ఎద్దడితో పంటలు పండక నానా ఇబ్బందులు పడ్డామని, ఈ ఏడాది నీరు పుష్కలంగా ఉండి అధికారుల నిర్వాహణ లోపంతో నీరు అందడం లేదని రైతులు వాపోయారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి వరి నారుమళ్లు వేసుకుంటే ఆచరణలోకి వచ్చే సరికి ఈ పరిస్థితి నెలకొందని చెప్పారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు మాట్లాడారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పాలక, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మాని రైతులకు నీరు ఇచ్చేలా లేరని మండిపడ్డారు. ప్రస్తుతం వస్తున్న 100క్యూసెక్కుల నీరు ఎంతమాత్రం సరిపోదని గేట్లు ఎత్తడం కోసం నిపుణులను రప్పించి సమస్య పరిష్కారం చేయాలని అంతవరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రైతులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు జీవీబీ కుమార్, ఎస్‌డీ గౌస్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దువ్వూరి జాను, డీఎం రాయుడు పాల్గొన్నారు.

- కందుకూరు: రాళ్లపాడు రిజర్వాయరు కుడి కాలువ షట్టర్ విరిగి పడిపోయి పదిరోజులు గడిచినా ఆ సమస్యను పరిష్కరించి కాలువకు నీరు విడుదల చేయకలేక పోవటంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే కారణం అని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రైతులు సాగు చేసిన వరినారు మడులు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. విరిగిన షట్టర్‌ను లేపటం కష్టసాధ్యంగా ఉందని, ఈ ప్రక్రియ ఆలస్యం అవుతుందని అర్థమైనపుడు మోటార్లు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలతో నీరందించే ఏర్పాట్లు చేయకపోవటం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అన్నారు.

# నుడా అభివృద్ధికి ప్రభుత్వ భూములు కేటాయిస్తాం

- రాష్ట్ర మంత్రులు నారాయణ, ఆనం వెల్లడి
- అట్టహాసంగా నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి ప్రమాణ స్వీకారం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ భూములను కేటాయించి లేఅవుట్ల ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తామని రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకుల సమక్షంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నుడా చైర్మన్‌గా మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నుడా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ముందుగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ నుడా ఆర్థికంగా అభివృద్ధి చెంది, వనరులు సమకూర్చుకునేందుకు పెద్దఎత్తున ప్రభుత్వ భూములను కేటాయించి, లేఅవుట్ల ఏర్పాటు చేసుకోవడం ద్వారా భారీగా నిధులు సమకూర్చుకోవచ్చని అన్నారు. టిడ్కో కాలనీల్లో దేవాలయాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. నగరంలో చెత్తతో కరెంటు ఉత్పత్తిచేసే ప్రాజెక్టు మంజూరయ్యిందని, నగరంతోపాటు, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్తసమస్య పూర్తిగా తొలుగుతుందన్నారు. నెక్లెస్ రోడ్డు, పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ టిడ్కో కాలనీల్లో దేవాలయాల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూఖ్ మాట్లాడుతూ నుడా అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని అన్నారు.

**● నమ్మకాన్ని వమ్ము చేయను : కోటంరెడ్డి**

తనపై ఎంతో నమ్మకంతో రెండో దఫా నుడాచైర్మన్ పదవిని ఇచ్చిన నేతల నమ్మకాన్ని వమ్ముచేయకుండా, ప్రజల మన్ననలు పొందేలా పాలన సాగిస్తానని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి తెలిపారు. నగరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. జిల్లాకు సేవలు అందించి మృతిచెందిన పాలకులు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, ఆనం వివేకానంద రెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, ఉక్కాల రాజేశ్వరమ్మ, మాగుంట పార్వతమ్మ, వెన్నెలకంటి రాఘవయ్య విగ్రహాలను నగరంలో ఏర్పాటు చేసేలా మంత్రి నారాయణ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

**● బాలకృష్ణ అభినందనలు**

నుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డికి హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ అభినందనలు తెలిపారు. సభ జరుగుతున్న సమయంలో కోటంరెడ్డికి బాలకృష్ణ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపి, నుడాను అన్నివిధాలా ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం వేదికపై ఉన్న మంత్రులతోనూ బాలకృష్ణ మాట్లాడారు. ఈ సభలో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కాకార్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి, టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నాయకులు గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్, నూనె మల్లికార్జున, టీడీపీ, బీజేపీ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**● భారీ బైక్ ర్యాలీ**

కోటంరెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నర్తకి సెంటర్‌లో ఉన ఎన్టీఆర్ విగ్రహం నుంచి వేలాది సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి, గాంధీబొమ్మ, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోలు బంకు, ఏసీ స్టేడియం, వేదాయపాళెం, అయ్యప్పగుడి మీదుగా ఆటోనగర్‌లోని నుడా కార్యాలయం వరకు ర్యాలీ సాగింది.

## విజేతలకు అభినందన

కావలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా కదిరి మండలం ఓడిచెరువులో ఈ నెల 15న జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోలింగ్ పోటీలు జరిగాయి. ఇందులో ఎస్ఆర్ విద్యానికేతన్ విద్యార్థులు అర్జున్, జాయ్, వనజితేంద్రలు ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారిని అభినందించారు. జనవరిలో జైపూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల చైర్మన్ శ్రీవల్లి, ప్రిన్సిపాల్ అన్నమ్మ, పీడీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

## సోమశిల దక్షిణ కాలువ చైర్మన్‌గా కేశవచౌదరి

చేజర్ల, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్టు దక్షిణ కాలువ కమిటీ చైర్మన్‌గా నాగులవెల్లటూరు టీడీపీ సీనియర్ నాయకుడు వేలూరు కేశవచౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రత్యేక అధికారి, ఆర్‌బీ ఎస్ఈ గంగాధర్ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్‌గా కేశవచౌదరి, వైస్ చైర్మన్‌గా కలువాయి చల్లా విజయభాస్కర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

- అనంతసాగరం: ఎంపీడీవో కార్యాలయంలో సోమశిల ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పీ ధనుంజయను అధికారులు ఎంపిక చేశారు. ఈమేరకు వారికి డిక్లరేషన్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రమణారెడ్డి, నోడల్ ఆఫీసర్ పెద్దిరాజు, ఈవో శోభన్‌బాబు మండల టీడీపీ అధ్యక్షురాలు మునగపాటి సునీత, సాగరం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మట్టి తరలిస్తే చర్యలు

సీతారామపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల్లో అనుమతి లేకుండా, హైవే నిర్మాణ సంస్థలు మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. మారంరెడ్డిపల్లిలో ప్రభుత్వ అనాధీన భూమిలో హైవే నిర్మాణ సంస్థ మట్టి తరలించినట్లు గ్రామానికి చెందిన ఎలిషా కుమార్, ప్రతాపరెడ్డిల ఆధ్వర్యంలో గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్‌కి అర్జీని అందజేశారు.